# గంగా తరంగిణీ ప్రచురణములు

1. రుక్మిణీ కల్యాణము - ముద్రితము
2. పార్వతీ విజయము ,,
3. శ్రీమద్భగవద్గీతాగానము ,,
4. పరీక్షిత్తు ,,
5. ఆత్మబోధ శతకము ,,
6. గంగారూపకములు
    1. మల్లె
    2. రామరాజ్యము
    3. క్రాంతి (ఫ్రాన్సు)
    4. ఎన్నికలు వస్తున్నాయి
7. గ్రంథకర్త పితృదేవుల రచనలు
    1. శ్రీ రత్నకాంత నాటకము
    2. కుచేలోపాఖ్యానము

శ్రీ శారదాయై నమః.

# శ్రీమద్భగవద్గీతా గానము

(గంగాతరంగిణీ తృతీయ తరంగము)

కృతికర్త:
కవిశేఖర
శ్రీ గంగా రాజేశ్వరరావు

ప్రచురణ
గంగా తరంగిణీ సారస్వత సమితి
గంగా సదనము
మంథని, కరీనగరం జిల్లా.

ప్రథమ ముద్రణ : 1990

ప్రతులు : 1000

వెల : 15_00

ప్రతులు దొరకుచోటు :
గంగా తరంగిణీ సారస్వత సమితి
గంగాసదనము, మంథని,
కరినగరం జిల్లా.

ముద్రణ :
భాను ప్రింటింగ్ వర్క్స్,
తిలక్‌నగర్, హైదరాబాదు-44.

# ఆశీస్సులు

బి. ఈశ్వర్
శ్రీకాళహస్తి

మంథని వాస్తవ్యులు, కవిశేఖరులునగు పండిత శ్రీ గంగా రాజేశ్వర రావుగారు 'శ్రీ మద్భగవద్గీతాగానము' అను పేరుతో భగవద్గీతను గేయ రూపముగ రచించి భక్తులకు మహోపకార మొనర్చిరి. సులలితభాషతో, అర్థగాంభీర్యముతో గ్రంథము కొనసాగినది. పరమార్థజిజ్ఞాసువులు ఈ గ్రంథ మును లెస్సగ పఠించి, గీతాచార్యుల దివ్యబోధలను నిత్యజీవితమున ర్యాన్వీత మొనర్చుకొని పర మానందమును బడయుదురుగాక !

ఓమ్

స్వామి విద్యా ప్రకాశానందగిరి

# అ భి న ం ద న

ప్రస్థానత్రయంలో భగవద్గీతలకు లభించిన ప్రాచుర్యం మిగిలిన రెంటికి లభింపలేదనుట నిర్వివాదాంశం. ఉపనిషత్తులకు, బ్రహ్మసూత్రాలకు సారభూతంగా వెలసింది శ్రీ మద్భగవద్గీత. ''సర్వోపనిషదోగానః, దోగ్ధా గోపాలనందనః, పార్థోవత్సః సుధీర్భోక్తా, దుగ్ధం గీతామృతం మహత్'' అని చెప్పటం మూలాన బుద్ధిమంతుడైన ప్రతి మనిషికి జాతి మత వర్ణ వర్గ విభేదం లేకుండా గీతా మకరందం ఆస్వాదయోగ్యమైంది. కనుకనే దీని కింతటి ప్రాచుర్యం.

గీతా శాస్త్రానికి త్రిమతాచార్యులు మొదలుగా ఎందరో విద్వాంసులెన్నో రీతుల వ్యాఖ్యలు వ్రాశారు. పాశ్చాత్య పండితులనేకులు భగవద్గీతల ప్రాశస్త్యాన్ని ప్రశంసించారు. కాని మనదేశంలోనే ఆధునికులమనుకొనేవారు కొందరు శ్రీ మద్భవద్గీత యెడ చిన్నచూపు కలిగియుండుట విచారకరం — మహోజ్జ్వలమైన భారతీయ తాత్త్విక చింతన ఆధ్యాత్మిక భావ సంపద అందరికీ అందుబాటులో ఉండాలంటే గీతాశాస్త్రం బహుళ ప్రచారం పొందాలి. ఈ ఉద్దేశంతోనే కొందరు పండితులు గీతకు సరళమైన అనువాదాలు చేకూరుస్తున్నారు.

శ్రీ మద్భగవద్గీతకు తెలుగులో గద్య పద్య రూపకములైన ఎన్నో అనువాదాలు వెలిశాయి. కొందరు కవులు ద్విపదలుగా కూర్చి ప్రకటించారు. ఈ అనువాదాలన్నింటిలో ఏదోలోపం కొట్టవచ్చినట్లుగా కనిపిస్తూనే ఉంటుంది. మూలానికి దీటుగా అనువాదం ఎప్పుడూ ఉండదు అనేది జగమెరిగినసత్యం. ఐనప్పటికిని సంస్కృతం తెలియని వారు ఏదోరకంగా గీత అర్థం చేసికోవాలి కనుక అనువాదాలు అవశ్యకర్తవ్యాలైనవి. ఏతత్సంకల్పమే ఈ కృతికి కారణమై ఉంటుంది. గీతను గద్యాలుగా పద్యాలుగా వ్రాయడంకంటె గేయాలు పాటలుగా వ్రాస్తే గీతా ప్రచారానికి ఎక్కువ దోహదం చేకూరుతుంది. ఈ పాటలు, గేయాలు జానపదుల వదనాలలో నాని, కరిగి, జాలువారి చిరస్థాయిగా నిలుస్తాయి. అందుకే పూజ్యులు శ్రీ గంగా రాజేశ్వరరావు

గారు మాత్రా ఛందస్సులో రాగతాళయుక్తంగా గీతా రచనచేసి 'Poetry is the rhythmic creation of beauty'' అనే నానుడి సార్థకం చేశారు. వారికి గల హరికథా గానానుభవమే ఈ రచనకు జీవం పోసింది. ఈ పాటలు వారి నోటినే వింటే మనకు ఆనంద పారవశ్యం కలుగుతుందని అనుభవపూర్వకంగా తెలిసికొన్న విషయం.

శ్రీ గంగా రాజేశ్వరరావుగారు పరిణతి జెందిన కవివరేణ్యులు నివురుగప్పిన నిప్పుకణం-అంతర్ముఖులు-ఋషికల్పులు-జీవితంలోని ఆటుపోటులకు ఏమాత్రం చలింపని గుండెనిబ్బరం గల మనిషి. నాకు పరమ మిత్రులు. మేమిరువురం ఒకే విద్యాలయంలో కలసి పనిజేశాం. ఒకే ఇంటిలో కొంత కాలం కలసి ఉన్నాం. వారి ప్రతిభావ్యుత్పన్నతలను గురించి సదవగాహన కలిగిన సాహితీప్రియులలో నేనొకణ్ణి. కనుకనే అర్హతా నర్హతల నాలోచింపక నన్నీకృతికి అభిప్రాయం వ్రాయమన్నారు. ''ప్రీతిస్వాదుజనే నయోన్నపజనే విద్వజ్జనేచార్జవం, యే చైవం పురుషాః కలాసు కుశలాస్తేష్వేవ లోకస్థితిః'' అని భర్తృహరి సుభాషితం అందుకే శ్రీ రాజేశ్వరరాయ కవి మిత్రుల ఆదేశం శిరోధార్యమైంది.

ఈనాడు కలమెత్తిన ప్రతిమనిషి మనీషిగాకున్నా కవి శబ్ద వాచ్యుడే. భేదం మాత్రం ''కవిర్మనీషీ, పరిభూః స్వయంభూః మంత్రద్రష్టలైన ఋషులకు లోకోత్తర వర్ణనాత్మక కావ్య నిర్మాతలైన మనుషులకు 'కవిశబ్దం వర్తించింది. పురుషోత్తముడైన భగవంతుని ప్రకృతి గుణ లీలా విభూతి వర్ణనం మించిన లోకోత్తర వర్ణనం ఏముంటుంది? అందుచే ప్రాచీన కావ్య సంపద భగవద్గుణ లీలా విభూతితో నిండిపోయింది. అదే లక్ష్యంలో కావ్య రచన సాగింది. చతుర్వర్గ వ్యుత్పత్తియే కావ్య ప్రయోజనంగా నిర్దేశింపబడింది. ''ధర్మార్థ కామ మోక్షేషు వైచక్షణ్యం కలాసు చ। కరోతి కీర్తిం ప్రీతించ సాధుకావ్య నిషేవణం'' అని అంటాడు భామహుడు. పూజ్యులు శ్రీ గంగా రాజేశ్వరుల వంటి పండిత కవులు ఈనాటికి అదే లక్ష్యంతో రచనలు సాగిస్తున్నారు. అట్టి కృతులే అనశ్వరాలై నిలుస్తాయి.

శ్రీ గంగా రాజేశ్వరులు వారి ఉద్యోగ విరమణ తర్వాత నావలె నిరుద్యోగాశ్రమంలో ప్రవేశించి చేతులు ముడుచుకొని కాలక్షేపం చేయడం లేదు. గంగా తరంగిణీ ప్రచురణల పేర ఒక సంస్థ నేర్పాటు చేసికొని ఇది

వరకే ఏడు తరంగములను సృష్టించారు. అందులో ప్రథమ తరంగం రుక్మిణీ కల్యాణముగా వెలువడి ముద్రణకు నోచుకొన్నది. పండిత ప్రశంసల నందుకొన్న ఉత్తమ కావ్యమది. ఇది శ్రీమద్భగవద్గీతాగానము రెండవ తరంగము ముద్రణకు సిద్ధంగా రూపు దిద్దుకొన్నది. ఇది సర్వజనాదరణీయాకాంక్షతో రచింపబడిన గీతానువాద కావ్యం.

ప్రియ మిత్రులు శ్రీ గంగా రాజేశ్వరరావుగారి అనువాద సరణిని విమర్శింపజాలిన సామర్థ్యం నాలోలేదు. ''కౌతి శబ్దాయతే విమృశతి రసభావన్ ఇతి కవాః'' అన్న భట్టగోపాలుని అభిప్రాయానుసారం కవులు ఎవరికి వారే సద్విమర్శకులు. అభినందన పూర్వకంగా నా అభిప్రాయం తెలియ వ్రాయడమే ప్రస్తుతం నేను చేయగలిగిన పని. శ్రీ గంగా రాజేశ్వరుల శైలి గంగా ప్రవాహంవలె అనర్గళమై, నిసర్గ రమణీయమై నిర్దుష్టమై పండితులను, పామరులను రంజింపజేస్తుందని ముందు మాటగా చెప్పితే తినబోయేముందు గారెల రుచి గురించి చెప్పినట్లౌతుంది. ఐనా మచ్చునకు ఒకటి రెండు — పాండవ పక్షంలోని వీరులంతా తమ తమ శంఖాలు పూరించిన సందర్భంలో

''అరవంబు భూమ్యాకా, శాంతరాళ మందిముడక
వైరుల గుండెల కొండల దూరి వాని జీరివెడలె,
సమరమునకు గురు బలములు సంసిద్ధముగాన్, యుద్ధో
ద్యముడై గాండీవ మెత్తి యర్జునుడనె గృష్ణునితో''

ఆ ధ్వని భూమి, ఆకాశాంతరాళములలో ఇముడనంత గొప్పది వైరివీరుల కొండలవంటి గుండెలు దూరి వానిని చీరి వెడలెనని చెప్పుట ఇవి ఉత్తమ కవితారచన కుదాహరణము. అట్లే యుద్ధో అని విఱచి ''ద్యముడై'' అని శబ్దాన్ని ఆకస్మాత్తుగా ఎత్తివేసినట్లు వ్రాయుట వెంటనే అర్జునుడు గాండీవ మెత్తినట్లు వ్రాయుట అర్జుని యుద్ధోద్వేగమును ధ్వని సుచ్యార్థముగా ప్రకటించుచున్నది. యుద్ధోద్యముడై అన్నచోట మృందంగం 'ధాం,' అంటే ఎంత రక్తి కడుతుందో ఆలోచించండి. ఇదే జీవిత పోషకమైన రచన. ''ఔచిత్యరస సిద్ధస్య స్థిరం కావ్యస్య జీవితం''అని క్షేమేంద్రుని అభిప్రాయం. ఇట్టి ఔచితీ పోషకమైన రచన హృదయాహ్లాదియై ఎడనెడ ఈ కృతిలో రసజ్ఞులకు సాక్షాత్కరిస్తుంది.

శ్రీ రాజేశ్వరరావుగారు భగవద్గీతలోని ముఖ్యమైన శ్లోకాలన్నిటిని చక్కగా అనువదించారు. ఈ అనువాదం శ్లోకం తర్వాత శ్లోకం వరుస

క్రమంలో చేసినట్టిది కాదు. స్వచ్ఛందానువాదం. 4, 5 శ్లోకాలను ఒకేసారి తీసి కొని అందులోని భావాన్ని స్వేచ్ఛగాఅనువదించారు. ''సీదం తిమమ గాత్రాణి ... గాండీవం సంస్రతేహస్తాత్'' అనే రెండు శ్లోకాల అనువాదం చూడండి.

''సడలుచున్నవి యంగములు తడ
బడెడు వాక్యము లుడికె దేహము
పిడుచగట్టెను నాల్క పులకలు
పొడమ దొడగె శరీరమంతట
నొడలు తెలియగలేను నేనిల
బడగ నోపను, చూడు! మేనెటు
వడకుచున్నదొ? చేతి గాండీ
వంబు జారుచునున్న దక్కట.''

ఇది చక్కని చిక్కని తెలుగుసేత. దేహము ఉడుకుట, నాలుక పిడుచగట్టుట పులకలు పొడముట, ఇవిగో ఇవి అన్నీ కృష్ణుని చూడుమనుట-ఈ పదప్రయోగమంతా సహజ సుందరంగా ఉన్నది. అందులో డకార ప్రాసము భయోద్రేకమును స్ఫురింప జేసే మాత్రల త్రిపుటగతి ఛందస్సు సన్నివేశ చిత్రణకెంతో దోహదం చేశాయి. రసానుకూల రచనా విధానం అంటే ఇదే. ''కావ్యస్యాత్మని సంజ్ఞిని రసాది రూపేన కస్య చిద్విమతిః'' అంటాడు మహిమభట్టు.

''కర్మేంద్రియాణి సంయమ్య అను శ్లోకం మొదలుకొని నియతం కురు కర్మత్యం'' అనే శ్లోకం వరకు గల కర్మయోగ సిద్ధాంతాన్ని సర్వ జన గ్రాహ్యంగా సరళంగా చేసిన తెనుగుసేత గమనించండి.

''తాను కర్మేంద్రియముల నడచి,
జ్ఞానివలె నటియించుమూఢుడు
మానసంబున విషయచింతన
మానునా? మిథ్యావిచారుడు
మనసు బుద్ధీంద్రియములనన్నిటి
దనవశంబున నునిచి నియతపు
బనులనాసక్తి యోగంబున
నొనరించెడివాడు శ్రేష్ఠుడు—
కర్మ మానుటకన్న-శ్రేష్ఠము
కర్మసలుపుట-నియతమైన స్వ
కర్మ సేయుము చేయకుండిన
గడచునా శారీర యాత్రయు.''

అలతి అలతి పదాలలో గీతాసారాన్ని అందిస్తున్నట్లుందీ రచన.

ఈ విధంగా వ్రాస్తూ పోతే అసలు గ్రంథంకన్నా అభిప్రాయాల భారం ఎక్కువై పోతూంది. మిగిలిన కావ్యం రసగ్రహపారీణులకు అప్పగించి ముగిస్తాను. ఏ పట్టునను నీరసించని రచన ఇది. దీని చదువునప్పుడు వినునప్పుడు ''సద్యః పర నిర్వృతయే'' ''ఉపదేశయుజే, అని కావ్య ప్రకాశకారుడు నిర్దేశించిన రెండు ప్రయోజనాలు సిద్ధిస్తాయి. ప్రయోజనకరమైన ఇట్టి చక్కని రచనచేసిన శ్రీరాజేశ్వరరావుగారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. మంత్రకూటంలో దిగ్గంతులవంటి ఎందరో పండితులుండగా అల్పజ్ఞుడగు నన్ను అభిప్రాయం వ్రాయమని కోరడం వీరికి నా యెడ గల సుహృద్భావం ప్రేమాభిమానాలే కారణాలు - పరమ పూజ్యులు మిత్రులు బ్ర॥ శ్రీ గంగా రాజేశ్వరరావుగారి కృషి ఫలప్రదం కావాలని అచిరకాలంలో ఈ కృతి తెలుగులోకి రావాలని. ''యశసే, అర్థకృతే'' అనే రెండు ప్రయోజనాలు కూడ వారికి సమకూరాలని ఇతోధిక సాహితీ కృషికై పరమేశ్వరుడు వారికి సంపూర్ణాయురారోగ్యాలను ప్రసాదించాలని ఆకాంక్షిస్తున్నాను.

శ్రీ గంగా రాజేశ్వర
భాగవతకృతాంధ్ర గేయ భగవద్గీతన్
రాగజనుషాంధులకు భవ
సాగరము తరింపజేసి సద్గతి గూర్చున్.

ఓం తత్ - సత్

తేది 21-11-85

ఇట్లు
విద్వజ్జన విధేయుడు
**గట్టుపల్లి సత్యనారాయణరాజు**
రిటైర్డు ప్రిన్సిపాల్
ప్రభుత్వ జూనియర్ కళాశాల (సైన్సు విభాగం)
ఇం. నెం. 7-1-6, మంకమ్మతోట

ఓం

శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

# మనవి

''సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహంత్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామిమాశుచః''

ఇది శ్రీ మద్భగవద్గీతోపదేశరత్నము. నిత్యశుద్ధ బుద్ధరూపుడును, సచ్చిదానందస్వరూపుడును, సర్వవ్యాపకుండును, సర్వాంతరామియును, సృష్టి స్థితి లయకారణభూతుండును, కర్మసాక్షియు, కర్మఫలదాతయు నాత్మారాముండైన శ్రీకృష్ణ పరమాత్మ, అహంకార మమకార రాగద్వేష కలుషితుడును, కర్మపాశబద్ధుడును, జన్మ మరణరూప సంసార మాయాచక్ర పరిభ్రమణాయ మానుండును, దేహాభిమానియగు జీవాత్మకు ప్రతినిధియైన యర్జునునకు బోధించిన గీతాసారమిది. అర్జునా! సమస్త సంసార ధర్మములను వదలి కేవలాత్మ ధర్మములను ఆశ్రయించితివేని సర్వపుణ్య పాపకర్మ బంధములనుండి నిన్ను రక్షింతును. ఇక దుఃఖించకుము అని తాత్పర్యము. కర్మలయందాసక్తిని కర్మ ఫలములయందాపేక్షను వదలి ఈశ్వరార్పణ బుద్ధితో స్వధర్మ కర్మలనాచరించినచో మోక్షము కరతలామలకమగును. ఇక దుఃఖమునకు తావెక్కడిది.

సంసారమందు ప్రతిజీవి కర్మవలననే పుట్టును, కర్మవలననే బ్రతుకును, కర్మవలననే చచ్చును. కావున ప్రతి వ్యక్తికి కర్మ అనివార్యము. మన యిష్టప్రమేయము లేకుండనే ప్రకృతి గుణ ప్రేరణవలన కర్మలు జరిగిపోవుచునేయుండును. కావున కర్మ ఎట్లు చేయవలయుననునదియే గీత బోధించు ప్రధానాంశము. ''యోగస్థకురు కర్మాణి'' యోగమునందుండి కర్మచేయుము. యోగమననేమి ''సమత్వం యోగ ఉచ్యతే'' సుఖదుఃఖాదిద్వంద్వముల యందు సమభావము గలిగి దృశ్యమున దృక్ దృష్టితో మెలగుట యోగము.

''యోగః కర్మసు కౌశలమ్'' కర్మ సల్పుట యందలి నేర్పరితనమేయోగము సమత్వ ఆ కుశలత్వము లెట్టివి? ''సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ'' అహంకార మమకార రాగద్వేష విరహితుఁడై సంపూర్ణ ప్రపత్తితోకూడిన శరణాగత భావముతో స్వకీయ ధర్మములను నెరవేర్చుచు తనసర్వ భావమును భగవంతుని నెత్తిన నెత్తి వాడు నడిపించినట్లు నడుచుచు నిశ్చింతగా జీవయాత్ర సాగించవలెను. ఈ ప్రపత్తి విధానమే కర్మ చేయుట యందలి చక్కని కౌశలము, ఇదియే సమదృష్టి.

ఇప్పుడు గీతాతత్వ మొకింత విచారింతము. ''సర్వోపనిషదోగావోదోగ్ధా గోపాలనందనః పార్థోవత్సస్సు ధీర్భోక్తా దుగ్ధగీతామృతం మహత్'' పార్థసారథియైన గీతాచార్యుడు పార్థుడను వత్సమునుముందిడుకొని ఉపనిషత్తులను గోవులను బిదికి గీతామృతములు భక్తులకొఱకందఁ జేసెను. తత్త్వమసి యను మహావాక్యానుసారము కర్మబోధక ప్రథమషట్కము'త్వం' అను జీవాత్మను గుఱించియు జ్ఞానబోధకాంత్యషట్కము 'తత్' అను పరమాత్మను గూర్చియు, భక్తిబోధక మధ్యషట్కము 'అసి' అను జీవబ్రహ్మైక్యమును బోధించును. గీతాహారములో నొక్కొక్క శ్లోక మొక్కొక్క రత్నము ఏ యొక్క శ్లోకమునైనను అర్థసహితముగా మననచేసి యాచరణయందుంచి నను సంపూర్ణ గీతాపఠన ఫలితమును బొందవచ్చును. తొమ్మిదవ అధ్యాయము, 22వ శ్లోకము నాయకమణి అది గీతా ప్రకాశమును ఇనుముడింపఁ జేయుచున్నది. అది యిది.

''అనన్యాశ్చింతయంతోమాం యేజనాః పర్యుపాసతే
తేషాంనిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం"

సంసారచింతలు మాని నన్నే చింతించువారికి లేనిది ఇచ్చుచు ఉన్నది కాపాడుచు వారి సర్వభారమును, రైలుబండి ప్రయాణీకులను వారి సామానులను మోయుచు గమ్యమును చేర్చునట్లు, నేనే వహింతును. నా సంసారమును నేనే వహించుచున్నాననుట దురహంకారము దుఃఖమూలమును.

ఈ భగవద్గీత కేవల హిందువులనేకాక సమస్త మానవాళిని సమానముగా కొనిపోయి గమ్యస్థానమును జేర్చు ఏకైక ధర్మ గ్రంథము. ఈ సత్యము గ్రహించియే సర్వ దేశములయందు సర్వ మతములవారు భగవద్గీత

లను తమతమ భాషలలో ననువదించుకుని యనుసరించుచు ఫలితము పొందు చున్నారు. ఇది సర్వ జనాదరణీయము ననుసరణీయమునై యున్నది.

ఈ గీతలననేక పర్యాయములు పఠన, పాఠన పారయణ వ్యాఖ్యాన ములు చేయుటచే నాకు లభించిన స్వల్ప జ్ఞానానందమును నా సోదరులగు తెలుగువారికిని తెలుగు నేర్చినవారికి పంచియిచ్చుటకై యీ గీతా రచన కుప క్రమించనైనది. గీతలు భగవంతునిచే పాడబడినవి కావుననే గేయరూపకములో రచన సాగినది. ఇది మాత్రా ఛందోబద్ధము ఇందు 16 మాత్రలు (ఆదితాళము), 14. మా. (త్రిపుటతాళము), 12 మా. (రూపకతాళము), 10 మా. (జంపె తాళము), 8 మా. ఏకతాళములు ప్రదర్శితములు, కావున భక్తులు పాడుకొని పాడి వినిపించి, ఆనందించి యానందపరచి, తాము తరించి యితరులను తరింపఁజేతురని నాయాకాంక్ష, ఇది కేవల శ్లోకముల యర్థ మొక్కొక్క గేయమునఁ గూర్చబడినది. సాధారణముగా శ్లోకానుక్రమణాతిక్రమణ జరుగ లేదు. రచనాకాలములోనే కాక పాడుకొనినప్పుడెల్లను ఆనంద తన్మయావస్థ సిద్ధింపజేయును ఈ గీతాగేయగ్రంథము ప్రతియింట పూజామందిరములో నిల్పుకొని నిత్యపారాయణము చేసినచో జ్ఞానానందాభివృద్ధితోపాటు ఆ కృష్ణ పరమాత్మ దయవలన ఐహికాముష్మిక సుఖములేకాక పరమ మోక్షసుఖము తప్పక సిద్ధించును.

''అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి
మాశుచః'' ఇది భగవదభయ వాక్యము.

ఈ గ్రంథమును పలువురు పరివ్రాజకులు కవులు, పండితులు కనివిని ఆనందించి యాశీస్సులను ప్రోత్సాహములనందించిరి. శ్రీశ్రీశ్రీ రామకృష్ణా నందస్వాములు, శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములు, శ్రీశ్రీశ్రీ ప్రబోధా నందగిరిస్వాములు, శ్రీశ్రీశ్రీ రామానంద తీర్థస్వాములు, శ్రీ గోపాలరావు బాబాగారు, డా॥ శ్రీ వేంకటావధాని సర్వశ్రీ రాంపలి నరసింహశాస్త్రి, భాగవతారు, గంగాబాలాజీ గీతా ప్రచారకులు, గట్టు గణపతి లెక్చరర్, కె. సీతారాంశర్మ అధ్యాపకులు, వి. నారాయణ అధ్యాపకులు ఇత్యాదులు అభివందనీయులు అభినందనీయులు. శ్రీరామ కృష్ణానందాశ్రమము మందెనలో ఈగీతాగానము మృదంగతాళ మేళముగా పాడబడి వ్యాఖ్యానింపబడినది.

ఆ యాశ్రమవారికి ముఖ్య కృతజ్ఞతలు. కోరినంతనే దయతో పీఠిక వ్రాసి యిచ్చిన డా. చిలుకమర్తి వేంకటరమణాచార్యులు (శుకశ్రీ) ఉపన్యాసకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంథెనగారికి హార్దిక కృతజ్ఞతలు. అడిగినంతనే తమ అమూల్యాభిప్రాయమందజేసిన శ్రీ గట్టెపల్లి సత్యనారాయణరాజు, మాజీ ప్రిన్సిపాలు, బాలుర జూనియర్ కళాశాల, కరీంనగరుగారి ప్రేమపూర్వక కృతజ్ఞతలు.

ఈ గ్రంథ ముద్రణ ద్రవ్య దాతయు, కృతిస్వీకర్తయునగు మన్మిత్రులు కవిశేఖరులు, శ్రీ చెప్యాల రాంకిషన్‌రావు మేడిపల్లి గారికి బహు కృతజ్ఞతలు వారికి శ్రీకృష్ణపరమాత్మ సహకుటుంబముగా నాయురారోగ్యైశ్వర్యములిచ్చి భక్తి జ్ఞాన వైరాగ్యములు ప్రసాదించుతమని యాశీస్సులందజేయు చున్నాను. ఈగ్రంథమును చక్కగా ముద్రించి యందజేసిన భాను ప్రింటర్స్, హైదరాబాదు వారికి కృతజ్ఞతలు. ప్రకాశకులగు గంగాతరంగిణీ సారస్వత సమితి వారికి నభినందనములు.

ఇతిశమ్

గ్రంథకర్త

# కృతి సమర్పణ

## 16 మాత్రలు

శ్రీమంతంబగు నారుట్లగోత్ర చెప్యాలాన్వయజలనిధిశశి యన,
కామితార్థములఁ బంచుటకై భువి కామధేనువే దిగివచ్చెనా యన,
శరణార్థుల రక్షణకొఱకు విష్ణుచక్ర మవతరించెను భూమిని యన,
కరుణఁబ్రోవ దీనజనావళి వేంకటపతి వెలసెను మేడిపెల్లి నన,
వేంకారాయఁడు పాలించుచు భువి వెలుగుచు నుండెను దివి రవివలె, వం
శాంకురమును గానక బహుకాలము వ్యథపడుచుండె సతీసహితుండై
వనము వారి బిడ్డను దత్తతఁగొని వంగడంబు నిలఁబెట్టుకొనెను, నా
తనయుఁడు భీమారాయాఖ్యుఁడు సార్థకనామునఃడు భీమవిక్రము డగుడు
దైవసంపద భీమారాయఁడు తండ్రిని మించిన కొడుకనిపించెను,
దైవభకితత్పరుఁ డాతఁడు సహధర్మచారిణీ కాంతా యుతుఁడై
మాన్యము లిచ్చి నగరమందున బ్రాహ్మణకుటుంబమున కేర్పరచె నునికి
మాన్యుండయ్యె బ్రతిష్ఠించెను హనుమత్పంచాయతనము పురమందున;
దానధర్మముల కీర్తులు కాశీద్వారము దాకెను వెదకికొనుచు వా
రాణాసి విప్రులు వచ్చిరి భీమారావువారి సంతృప్తులఁ జేసెను.

## 10. మా.

అనసూయ యత్రు లన నా దంపతులు గనిరి
ముగ్గురు కుమారులఁ ద్రిమూర్తులో యన నందు
వేంకటనృసింహునకు వెలది రుక్మిణి యందు
దైవాంశులైన యిద్దఱు పుత్రు లుదయించి
రందు జ్యేష్ఠుండు నరహరిరాయుఁ డాతనికి
సత్యాంబ యనఁబడెడు సాధ్వికడుపున రామ
కృష్ణాంశుఁడగు రామకృష్ణరాయఁడు రామ

కృష్ణునకు విజయలక్ష్మి గర్భశుక్తిము
క్తాఫలంబులొాయనగఁ గల్గి రిద్దఱు సుతులు,
ప్రేమస్వరూపుండు విష్ణుప్రసాదుండు,
రాజనరసింహుఁడు విరాజిలె నరేంద్రుడని
వేకుఁడు నరేంద్రుడు, వీరు వీరు లుభయులు
డుద్భవము గాంచి వంశోద్ధారకులు నైరి.
యాజానుబాహులే యందఱీ వంశాన,
కంఠీరవరవసమ కంఠధ్వనిగలారు,
గాంభీర్యమూర్తులును, కరుణార్ద్ర హృదయులును.
ధర్మమున కాశ్రయులు, దానసద్భూషణలు,
సత్యజీవనులును, సహనస్వరూపులును,
త్యాగధనులును. భూతదయ గలారలు వారు.

## 14. మా.

రామకృష్ణారావుకుంగల రమ్య గుణగణములను బొగడగ
బ్రహ్మకేనియుఁ దరమ? యాతని భార్య భారతికి వశమగునా?
దానమున బలి దైత్యు మించును, ధర్మమున ధర్మజుని దాటును,
సత్యసంధత నాతఁడు హరిశ్చంద్రు సయితము క్రిందుపఱచును,
త్యాగబుద్ధి దధీచి యాతడు, దయను శిబిచక్రవర్తియతఁడు.
బుద్ధికి నతఁడు బృహస్పతి, సంబుద్ధి యందున శంకరుఁ డతఁడు
పరస్త్రీలను దల్లిపలె, దన భావమునఁ దిలకించు నాతడు;
పరద్రవ్యము పెంకు మాదిరి పరిగణించుచు నుండునాతడు;
"వాసుదేవస్సర్వమితి" యని వాణి సతతము పల్కుచుండును;
వాసుదేవుని హృదయ వనజనివాసునిగ ధ్యానించు చుండును;
అన్ని ప్రాణులయందు శ్రీ నరహరిని గాంచుచుండును సదా
అన్ని భూతగణంబులను దన యాత్మవలె భావించును గదా
సర్వవిధముల పరబ్రహ్మను. శరణు వేడుచు మసలుచుండును
పలము కోరక స్వీయ కర్మలు బ్రహ్మకే యర్పించు చుండును.

12 మా.

రామకృష్ణసతి పతినారాధించుచు నెపుడు వాని
ప్రేమ చూరగొనుచు బదులు ప్రియముల నందించు చుండు;
విజయలక్ష్మి యింటియందు విహరించుచు నున్నఁ గనిన
విజయమొసగ లక్ష్మి యిలకు విచ్చేసెనా యనగఁ దోచు;
సిరిసంపదలకు నా యిలు స్థిరనివాస మనగ నొప్పు,
కళకళలాడుచును గృహము కాంతులీనుచుండు నెప్పుడు,
అన్నార్థులకాదయాళు డన్నపూర్ణ యనిపించును;
శరణార్థుల కా యింటను స్వర్గసీమ కనుపించును;
భీదల కాయమ పెన్నిధి, భృత్యుల యెడఁ గరుణానిధి;
యతిథుల సత్కరించు నభ్యాగతులను నాదరించు;
క్షమ యందున నా వెలంది క్ష్మాదేవికి నెన యనఁ దగు;
దయను విచారించ మాతృదయ యాపె హృదయమునందు;
నిరాడంబరము రూపై నిల్చెను. నా ముగుద యందు;
ఆశలు చేరంగ నేరవామె పూర్ణకామ యగుట;
అనుకూలపు దాంపత్యం బవతరించె నా గృహమున
స్వర్గ సుఖము లెల్లను సాక్షాత్కరించినది యచ్చట.

16. మా.

సంస్కృతాంధ్రభాషలయం దాతఁడు సహజపండితుఁడు; నాళువుగఁ బూర్వ
సంస్కారంబున సాగును కవితాస్రవంతి సుందరగమనంబులతో,
కవిశేఖరుఁడనును బిరుదమ్మును ఘన గౌరవ సత్కారములఁ గూర్చి, యభి
నవపోతన వరదాచార్యుఁడు సన్మానించెను రామకృష్ణారావును.
మధురవిపంచియు, మనదేశంబన మధురఖండకావ్యములు రచించెను;
భద్రశైలాధిపా, కృష్ణా, గోపాల, రామగుండేశ, యాదగిరి
శ్రీ లక్ష్మినరసిం హేత్యాదులు చేసె శతకములు; దేవీ స్తోత్రము,
కృష్ణప్రేమ, పరమహంస రామకృష్ణ, గోదాస్తవములు రచించెను;
ఆంధ్రానువాదములు ముకుందమా లాదులకుం గృతికర్తగ వెలసెను,
భగవద్గీతాగాన సత్కృతికి భర్తగ శాశ్వత యశము గడించెను.
కృతిభర్తను కేరితి వరించు సత్కృతి నందుట మూలంబున జగమున;
గృతియును ప్రఖ్యాతిని గనుఁ దన భర్తృప్రాభవమున నారసి చూడగ.

16. మా.

సతీసుతసమేతుండు రామకృష్ణారావును శ్రీ గీతాచార్యుఁడు
సతతమాయురారోగ్యంబుల నైశ్వర్యంబు లొసగి రక్షించెడు; నా
చంద్రతారార్క మీ వంశీయులు స్వర్గతుల్య భోగములను బొందెడు;
చంద్రికాభసత్కీర్తులు నాకాశంబు వరకు వెలుగొందెడు గావుత
త్యాగబుద్ధి దానధర్మములలోఁ దాతలదంద్రుల మింతురు గావుత;
రాగవిహీనులు సంసారంబున రాజిలుదురు నలినీదళములవలె;
శ్రీహరిని భక్తి గొల్చుచును సదా చిత్తైకాగ్రతఁ జెన్నొందెద రిల;
నైహికాముష్మికపరమ సుఖముల నందెద రీ చెప్యాల వంశజులు.

14. మా.

అడిగిననె యిచ్చెదరు కొందఱు, నడిగినను నీను మఱికొందఱుఁ
అడుగకయ యిచ్చెడు మహామహులరుదు గద లోకత్రయంబున,
అట్టివారలలోన చెప్యాలాన్వయుఁడు రామకృష్ణారా,
విట్టి యుత్తమ వదాన్యునితో నెవడు సరి? యీ భూతలంబున,
ముద్రణవ్యయమంతఁ దానే ముదిత మానసుడై భరించెను,
భద్రతలు సమకూర్చు గీతాభగవతియు కావ్య పోషకునకు,
అందఁజేసితిఁ గృతిని గీతను నన్నివిధముల నర్హుఁడతడని,
యందు కొనియెను దాని నాతఁడు హరివలన నర్జునుని చందము,
జయము భగవద్గీతలకును, విజయము గీతాచార్యులకును, వి
జయమగుతఁ గృతికర్త కెపుడు విజయము సర్వత్ర కృతికర్తకు.

మంగళమ్ మహత్

# కృతి స్వీకార ప్రశంస

శా. ఆ వాత్సల్యము నీదరస్మితమునన్ వ్యక్తంబగున్ ప్రేమయున్
నీ వల్గుస్ఫురదక్షులన్ గనబడున్; నే నన్న నీ కెంత హా
ర్దావిర్భావము గల్గునో నుడువ శక్యం బౌనె? విద్వద్వరా!
నీవు స్నేనును వేఱుగా మొకరమే నిక్కంబు రాజేశ్వరా!

మ. ఎవరయ్యా? పరు లీమనస్థలమునందే గాని పొందేని ని
క్కువమే? వారలు నీవు నే ననుట లేకోకాన లేనట్టి బ్ర
హ్మవిదుల్ సెప్పినభంగి నిర్వ్యరకు తే దాంతర్య, మెంతేని క్రొం
జవు లూరించెడు నస్మదీయ మగు నీసఖ్యంబు నానాటికిన్

శా. వైరాగ్యామృతశీతలప్రభలు మాపైఁ బర్వ నిన్ జూడఁగా
నే రోచిర్మయశంభులింగము పయిన్ నీ చూడ్కితోఁ బాటు నీ
హారాద్రీశ్వర భక్తిపూర్ణసుమనోహరంబుగా నించు గం
గా రాజేశ్వర! నీమనం బమర గంగామాత నీకైతయున్.

గీ. పెద్దవాఁడ వయ్యును ప్రేమ పిన్న లనిన
పిన్నవాఁడ వైపోదువు పెద్దలకడ
నీ యుదాత్త చారిత్రము నే యమూల్య
భూషణంబుగాఁ గొందురు పో విబుధులు

సీ. నేర్చుకోవలె నేను నీదుకర్తవ్యపు
దీక్షను మెఱుఁగులుదిద్ది దాని
కలవాటుపడవలె నయ్యా! నీ యాంతర
నిశ్చలత్వమునకు నేనుఁ గూడ
నీ భగవద్భక్తి నిర్మలత్వమ్మును
స్వీకరింపవలయును లోక మెల్ల
స్నేహభరితము లౌ నీ మధురోక్తులు
చెవులారగా వినంగ వలె నయ్య

గీ. కరగి పోవలె నయ్య నీ కరుణలోనఁ
జొక్కిపోవలె నయ్య నీ చూడ్కిలోన
శాంతి గనవలె నయ్య నీ శాంతమందు
చింతల మరువవలెను నీ చిర్నగవున.

శా. నా యాత్మీయులలోన నీ వాకఁడవై నన్నుం గరంగించి చే
దోయిన్ మోడ్పఁగఁ జేసినా వనుట కించిన్మాత్రముం గల్లగా
దోయధ్యాపకరత్నమా! గురువుసం దుండుంగదా దేవుఁ డా
మాయానాథునిఁ జూతు నీ విమలప్రేమన్ మంత్రకూటాలయా!

క. ఈ నీ భగవద్గీతా
గానము నా హృద్విపంచికాస్వరగతులం
దానము లీనెడు రసవి
జ్ఞానదునిగఁ దలఁచి, వలచి కైకట్టితినే.

"కవిశేఖర"

శ్రీ చెప్యాల రామకృష్ణారావు
మేడిపల్లి

ఓం

శ్రీ గణేశాయనమః

శ్రీ కృష్ణ పరబ్రహ్మణేనమః

# శ్రీ మద్భగవద్గీతాగానము

## ప్రార్థన

శ్రీ యగజానన పద్మార్కా! యాశ్రితజనావనా! త్రిభువనపావన!
హే యనాథనాథా! లంబోదర యేకదంత ఘనమూషక వాహన!
విఘ్నరాజ! శశివర్ణ! చతుర్భుజ! శ్వేతాంబరధర! షణ్ముఖపూర్వజ!
విఘ్నవిదారణ! ప్రప్రథమంబున వేడుకొనెద నంజలి ఘటించి నిను
విఘ్నంబులు సర్వకార్యములు నిల నీ కద్రిజనయనానందా పా
పఘ్న! నీదునయచారుణిమయ సూ। పాఖ్రదోలు( గ్రామాదులను జాను
దఘ్న మగును భవసాగరంబు నీ దయాపాంగవీక్ష ప్రసారమున
అధ్యక్షుఁడ వీవు దేవగణముల కధికారివి యాదిపూజలకును, న
సాధ్య మైనకార్యము గలదే? నిను సంస్మరించి ప్రారంభించిన భువి
విద్యాధిదేవతవు ప్రసాదింపు వివేకవైరాగ్యంబులు, లోకా
రాధ్య! భక్తగణ యోగక్షేమపు బాధ్యత యంతయు నీవ వహింతువు.
బుద్ధీంద్రియ వాఙ్మనస్సుల కెపుడు బోధపడ నీవు, నాదుదేహాత్మ
బుద్ధి మాన్పి జ్ఞానవిజ్ఞానప్రబుద్ధుని గావింపు మనుచు వేడెద,
సిద్ధివినాయక సృష్టిగల సకల సిద్ధులు నీ వశము లని లోకప్ర
సిద్ధి గలదు, నాదుకావ్యరచనాసిద్ధి యొనర్పుము నీకు మ్రొక్కెదను.

# మ్రొక్కులు

అంబ నీకు వేలు మ్రొక్కులు, గ్రహియింపుము జగ
దంబ! భక్తజనుల మ్రొక్కులు-వెలిగింపు పృథుని
తంబ! ప్రభలనన్ని దిక్కులు-
అంభోరుహగర్భురాణి! బంభర సునీలవేణి!
కంబుకంఠి కల్యాణీ! బింబాధర! పికవాణీ!
అంబుజపాణీ! సంగీతంబును సాహిత్య మను స్త
నంబుల జాలువాఱు క్షీరంబులఁ దనుపుము వాణీ!
ముల్లోకంబులకుఁ గన్నతల్లివి
తెల్లనిమెయిచాయఁ బాలవెల్లివి-
మల్లెల నగుపల్లువరుస చల్లని నగువెన్నెల వెదఁ
జల్లుచున్న మోముజాబిల్లివి-
కల్లాకపటము లెఱుగక యుల్లము రంజిల్లగఁ గర
వల్లరులను జాఁచి, తల్లి! తల్లీ! యనుచున్ నీ మెడ
నల్లుకొనెడు నీదుబుల్లిపిల్లలపై కనికారపుఁ
జల్లులు గురియింపు నెనరుఁడల్లిపై కల్పకవల్లివి.

# నమస్కృతులు

శ్రీ రాజేశ్వర! గిరిజారమణీజీవితేశ! విశ్వేశ! పరమేశ!
గౌరీదేవీముఖపూర్ణశశిచకోర! నా నమస్కృతుల గైకొర
నేరము లెన్నో చేయుచు నుంటిని, మారునివలయందుఁ జిక్కుకొంటిని
దూరాతిదూరమునఁ బడియుంటిని, దారితెన్నుఁ గానకయుంటిని, వి
స్తారము నీ దయ యని వింటిని, నాధారము నీవని నమ్ముకొంటిని, కు
మారుని నీకని తెలిసికొంటి, నొడిఁజేరుచుకొ మ్మంటి నేడ్చుచుంటిని,
నీ రాజీవపదములు మదినుంచి, చేరి నీ ముందు శిరము వొంచి నీ
పేరులు ప్రప్రథమంబున స్మరించి, భారంబును నీ పైన నుంచి, సం
సారతారకం బగుననుచు నెంచి, శ్రీరస్తంచును సన్నుతించి నేఁ
ప్రారంభించితి గీతాగానము, పూరితి గావింపు మీ ప్రయాణము.

# వేడుకోలు

లింగా! నీ ప్రియగాఢాలింగన భాగ్య మివర, స్త్రీ
యాంగనకుం గూర్పు పరిష్వంగానంద మివర, శివ!
లింగదేహి నీదు విస్ఫులింగమ్ము మహజ్జ్యోతి
ర్లింగ! వేములపురిరాజలింగా! రాజేశ్వర! యా
లిం గామించుట విత్తాలిం గాంక్షించుటలో, గా
లిం గౌఁగిటఁ జేర్చుట, కేలిం గడపుట స్వప్నంబున
గంగకు నాశ్రయము నీదుఘన మైనజటాజూటము,
గంగాధర! యునికిపట్టు గౌరికి నర్ధాంగము, పొసఁ
గంగా భస్మమునకు సర్వాంగ మిరవు భస్మాంగా!
గంగాన్వయులకు నీ పదకమలంబులు శరణంబులు
జంగమ భక్తులకుఁ బ్రాణలింగము ప్రాణము, స్థావర
జంగమ సృష్టికి స్థావర సదనము నీ యుదరమ్ము, భు
జంగరాట్టునకు గంఠస్థలము నివాసస్థలంబు,
నంగజ సంహారా! దురహంకారవిదూరా! శివ!
మంగళాలయము నీ నామసంకీర్తనమ్ము, సర్వ
మంగళాప్రియా! భవభయభంగకరము నీ కథాప్ర
సంగము, క్లేశహరము సత్సంగము, గరలగళా! ని
స్సంగా! వృషభరాడ్వరతురంగా! కరుణాంతరంగ!

# సన్నుతి

ఏడుకొండలవాడ! నేలకు! నేలదిగవయ్యా?-నన్నేల దిగవయ్యా!
చూడముచ్చట గొల్పునది నీ సోయఁగపు జందంబు గన నీ
తోడ కొంచెము సేపు ముచ్చట లాడవలె నయ్యా యాటలాడవలెనయ్యా!
ఏడుమిద్దెలు గలది నీ యది మేడయం దుపరియంతస్తునఁ
జేడియలఁ గూడుకొని పాచిక లాడుదువటయ్యా! సరసాలాడుదువటయ్యా!
పాడుకొంపం దిగవిడిచి చనినాఁడ వే మనియందు నిను బసి
వాఁడ నే మొత్తుకొనినను నా గోడు వినవయ్యా! నీ కిదిపాడి గాదయ్యా!
ఏడుపులు విని యిప్పుడేనియు నెత్తుకొనిపొమ్ము నీ పీటికి,
బోడియొంటరితనము నాకిఁకఁ బొసఁగఁ బోదయ్యా!

యభ(యం)బొసఁగ రావయ్యా!

గూడునకు నే దూర మైతిని కూడ, నెగిరి తిరిగి చనుటకు
గూడ జాలదుశక్తి, చంకను గొనుచుఁ జను మయ్యాఁనీతో

నుణఁచుకొను మయ్యా!

# వందనంబులు

వందనమ్ములు పార్థసారథి! వందనమ్ములు ప్రేమశరనిధి!
వందనమ్ములు మహారథి! నా వందనము లివిగో
మందరోద్ధర! సుందరా! పూర్ణేందువదనా! నందనందన!
మందబుద్ధిని నా శరీరస్యందనమ్మున ముందు నుండుమ.
యింద్రియార్థపు మార్గముల దుష్టేంద్రియాశ్వము లురుకు చున్నవి;
యింద్రనీల ద్యుతిశరీర యుపేంద్ర! కళ్ళెమ్ములను లాఁగుమ
యండజాధిపయాన! బహుజన్మార్జితపువాసనల మహిమన్
బండయైనది మనసు చరణస్పర్శ యొసగుమ సత్స్వరూపా!
కానఁజాలను నిన్నుఁ, గనులను గప్పినది యజ్ఞానతిమిరము;
జ్ఞాననేత్రాంజనము దిద్దుమ చక్షువుల కో చిత్స్వరూపా!
మైలపడినది నాదుచిత్తము మలినవాంఛానిలయమై, ప్ర
క్షాళనము సేయుమా గీతాగంగతో నానందరూపా!

# ధ్యానము

భగవద్గీతా! భవద్వేషిణీ! భజింతు నద్వైతామృతవర్షిణి!
భగవతి! యష్టాదశాధ్యాయినీ! భక్తజన క్షేమసంధాయినీ!
భగవంతుఁడు నారాయణుండు నరవరుం డైన పార్థుని నిమిత్తముగ
నిగమశిరంబులఁ దెచ్చి గ్రహించెను నిను నవనీతంబును శుభదాయిని!
పంచమవేదం బైన యా మహాభారతేతిహాసంబున వ్యాసుం
డంచితముగఁ బ్రకటించెను నిను ధర్మార్థకామమోక్షప్రదాయినీ!
సంచితాగామి ప్రారబ్ధములు నశించును నిను సేవించ, శమించును
బంచమహాపాతకంబులును, తత్త్వజ్ఞాన రహస్య సముదాయినీ!
యాలుపనిషత్తు, లర్జునుఁడు వత్స, పాలు గీతామృతాలు, దోగ్ధ గో
పాలుఁడు, భోక్తలు భక్తులైన ధీశాలురు గద యార్షసాంప్రదాయిని !
తోలుకుఁ బట్టిన మైల జలస్నానాలవలనఁ దొలఁగుచు నుండుఁగాని
చాలును గీతాస్నానము, భవప్రక్షాళన కొకటియె త్యాగవిధాయిని!

# స్తవము

రామకృష్ణానంద స్వాములచే మంథెన నాఁబడు
గ్రామమున గీతాసమాజముచే-
క్షేమును సమకూర్చు గీతాక్షితిజ బీజము నాటఁబడినది:
నేమమునఁ బారాయణోదక నిత్యసేచన జరుగు చున్నది.
నామసంకీర్తనపు టెరువులు నాణ్యమైనవి వేయుచును బహు
ప్రేమతో దినదినము మొక్కను బెంచు చుందురు శ్రద్ధమీఱఁగ
నా సురీసంపత్తు కలుపు ప్రయత్నమునఁ దీయుచును సతతా
భ్యాసవైరాగ్యముల కంచెను భద్రతకు నేర్పఱచి యుంతురు.
ధ్యానధనువున కోమ్మనునిశితబాణము సంధించి యనిశముఁ
గామపక్షిగణములవలనను జ్ఞానఫలములఁ గాచు చుందురు;
పంచుచుందు రుచితముగా నీ మంచితరుణము మించకుండ భు
జింపుఁడీ గీతాఫలములు, రుచింప విఁక విషయభోజనములు.

శ్రీప్రమోదానంతగురుస్వామి! సర్వాంతర్యామి!-
యప్రమేయాఖండానంద! స్వప్రకాశా! తే నమామి-
యీ ప్రపంచము మోహనిద్రను నేమొస్వప్నము చూచు గీతా
సుప్రభాతము మేల్కొలుపు జ్ఞానప్రభాకర! తే నమామి-
నేను, నా దను భావమున చ్యుతు లైనవారల కెల్ల నాత్మ
జ్ఞానమార్గారోహణపుసోపానపాదా! తే నమామి-
మలినసత్వప్రకృతిలో బ్రహ్మంబు ప్రతిబింబంబు జీవుఁడు,
వెలుపలన్ విషయసుఖములఁ దా వెదుకుచుండును గాని పొందఁడు;
'మలుపు లోనికి దృష్టి యచ్చట వెలుగు చున్నది స్వస్వరూపము,
విలయ మొందని సౌఖ్య మయ్యది, తెలిసికొని యద్దానితోడం
గలసి సక్తుఁడు గాక తత్తత్ఫలము లాసింపకయ కర్మలు
సలుపు చుండిన నెట్టిదుఃఖము గలుగ' దంటివి, తే నమామి.

# అర్పణ

సర్పశయనునకుఁ దాపత్రయముల నార్పుకృపావృష్టి గురియు వానికి,
నేర్పు మిగుల కర్మకౌశలంబును నేర్పు నేర్పరికి, యోగేశ్వరునకుఁ
గార్పణ్యదోషపరిహరునకుఁ గందర్పదర్పహరహర సేవ్యునకు
న్నర్పింపుము నీ సర్వస్వం బేకాగ్రచిత్తనిష్కామయోగమున.
గృష్ణునకు, వాసుదేవునకు, దేవకీనందనునకు, గోవిందునకున్,
విష్ణువునకు, గీతాచార్యునకున్, విశ్వరూపునకుఁ బార్థసారధికి,
వృష్ణివంశజలధిచంద్రునకు, రిపుజిష్ణునకున్, భక్తివైరాగ్య వ
ర్ధిష్ణునకున్, శరణాగతభక్తులతృష్ణ మాన్పు రోచిష్ణునకున్ నీ
వర్పింపుము నీ సర్వస్వం బేకాగ్రచిత్తనిష్కామయోగమున
మందస్మితునకు నిందువదనునకుఁ, గెందామరలం గేరు హస్తునకు,
నందయశోదానందున కలకేందిందీవర నయనేందీవరునకు,
బృందావనసంచారికి, గోపీబృందాక్ష్యుత్సవసుందరాంగునకు,
బృందారకసిద్ధసాధ్యమునిగణ వందితశుభచరణారవిందునకు
నర్పింపుము నీ సర్వస్వం బేకాగ్రచిత్తనిష్కామయోగమున

# ఆర్తి

పాపినిరా యతిపాపినిరా నను గాపాడర యో శార్ఙ్గధరా!-
చూపులు నాయవి గోరు పరస్త్రీరూపరేఖలావణ్యము రా!-
నీ పాదాబ్జము లడ్డ మిడి వానివ్యాపారంబుల, నాపుమురా!-
వీనులు నాయవి లోకవార్తలను వినుటకు నువ్విళ్ళూరునురా!-
వానియందు నీ కథామృత మెపుడు వర్షించుచునే యుండుమురా!-
కరములు సదా పరద్రవ్యంబుల గ్రహించుచునే యుండునురా!-
హరి! నీ పేరిట ద్రవ్యం బంతయు నర్పణంబు సేయించుమురా!-
నాలుక వ్యర్థాలాపంబులకే యాలవాలమై యుండునురా!-
మే లగు నీ నామకీర్తన లన్నివేళ లందు బలికింపుమురా!-
మనసు విషయసాంగత్యంబున నే మరులుకొనుచు నెపు డుండునురా!
యనవరతము సత్సంగతి దానికి నలవడున ట్లొనరింపుమురా!
రసన తనదుతృప్తికి మాత్రమె యుదరమును బాధించు చుండునురా!-
విసము లనుచు మృష్టాన్నంబులపై విరక్తి నే గలిగించుమురా!

## మొఱ

సత్సంగ మొనఁ గూర్పుమా!- నన్ను నీ
యుత్సంగమునఁ జేర్పుమా!-
మాత్సర్య మెడఁ బాపుమా!- మతినిఁ గల
కుత్సితము పోకార్పుమా-
వాత్సల్యనిధి! సేవ లుత్సాహమునఁ జేయఁ
బ్రోత్సాహ మిమ్ము శ్రీవత్సకౌస్తుభవక్ష!
బుద్ధిలోని తమస్సు పోఁ గొట్టి జ్ఞానప్ర
బోధ గలిగింపుము ప్రబుద్ధు వ్యాసునివలెను
చిత్తశుద్ధి యొనర్చి చింతలను దీర్చి నీ
చింతలోనే ముంచు శ్వేతవాహనువలెను
మనసునం దున్న సంశయము లన్నియుఁ గడిగి
మనసు స్థిరపఱుచు సంయమి సంజయునివలెను.
నహ మడఁచి 'దాసోహ' మనెడుమంత్రము నేర్పి
యాదరంబునఁ బ్రోవు మాంజనేయునివలెను.

## ఆకాంక్ష

కృపకుఁ బాత్రునిఁగ న న్నెపుడు సేతువు? ప్రభూ!
కృపణుఁడను జపలుఁడను గించిజ్ఞుఁడను నేను.
నపరాధములు సేయు టయ్యె నైజము నాకు,
నెపము లెన్నక ప్రోచునేర్పు సాజము నీకు
జప మెఱుఁగ తప మెఱుఁగ శాస్త్రంబు లెఱుఁగ నేఁ
గపివోలె సంసారవిపినమున భ్రమియింతుఁ
గృపకుఁ బాత్రునిఁగ న న్నెపుడు చేతువు? ప్రభూ!
జనుషాంధునకు విలక్షణదృష్టి నిప్పించు,
మూగవానికి వా క్కమోఘముగ రప్పించు
కుంటివానినిఁ గూడఁ గొండలనుఁ బ్రాఁకించు,
నధమాధముని సయిత మందలం బెక్కించు
కృపకుఁ బాత్రునిఁగ న న్నెపుడు సేతువు ప్రభూ!
కన్నులన్ నీ రూపు గదలకుండఁగఁ నుంచు,
మనసులో నీ స్మరణ మానకుండఁగ నుంచు
జిహ్వపై నీ పేరు చెదరకుండఁగ నుంచు,
శ్రవణముల నీ కథాశ్రవణమ్ము జరిపించు,
హస్తములచేత సీ యర్చ నొనరించుఁ బా
దములచేతను నీ ప్రదక్షిణము చేయించు
రసనేంద్రియము సదా వశమునందే యుంచు,
దారాసుతులయెడలఁ దాదాత్మ్యమును ద్రెంచుఁ,
గామాదులకు లోను గాకుండ రక్షించు,
నాశాలతలను మొద లంటఁగాఁ బెకలించు
రాగాదుల న్నివారణము గావించు, ద్వం
ద్వంబులందు సమాన భావంబు గలిగించు
కృపకుఁ బాత్రునిఁగ న న్నెపుడుచేతువు ప్రభూ!

# వరము

భుక్తిఁ గోరను నేను ముక్తిఁ గాంక్షించ గురు
భక్తి తత్పాదసేవాసక్తి వాంఛింతు,
రక్తి యిహములఁద్రెంచుమా -నా కనా
సక్తియోగము పెంచుమా!-
వేదవిహితసుకర్మ సాదరమ్మున సల్పు
తాదాత్మ్యభావం బభేద బుద్ధి యొసంగి
భేదమును దొలగింపుమా!- సంపూర్ణ
మోదమును గలిగింపుమా!-
సర్వభూతములయెడ నిర్వైర భావమ్ము,
గర్వరహితమైన నిర్విరామపు సేవ
సర్వేశ్వరా! కూర్పుమా! నన్నెపుడు
సత్సంగమునఁ జేర్పుమా!-
దురితాత్మకుఁడ నేను, కరుణామయుఁడ వీవు,
వర మొకటి కోరెదను నిరయమందేని నీ
స్మరణ మనమున నిల్పుమా హృదిని నీ
చరణములు నెలకొల్పుమా!

# వినియోగము

మానవజన్మము వచ్చెను గీతాగానముచేఁ గృతకృత్యుఁడు వగుమా!
దీని సాధింపలేనివా డాత్మహానికారకుఁడు హీనుఁడే సుమా!
జ్ఞానభాస్కరుం డైనవ్యాసభగవానుఁడు ఋషి ఛంద స్సనుష్టుప్పు,
శ్రీనారాయణమూర్తి కృష్ణుండు ధ్యానగమ్యుఁ, డగుదేవతగ నొప్పు,
శోకింపం దగని వస్తువునకై శోకించుచు నుంటివి యిది బీజము
సర్వధర్మములు పరిత్యజించుము శరణుఁ బొందు నన్నే యిది శక్తియ
'సర్వపాపరక్షణ కల్పింతు విషాద మేల? నియ్యది కేలక మగు,
'మచ్చిత్తుఁడవై సర్వదుర్గములు మత్కృపఁ దరియింతు విద్ది కవచము
గదాధారునిఁ, గిరీటధరుని చక్రహస్తు నిది యస్త్రం, బనాది, మ
ధ్యాంతుని ననంతవీర్యుని నియ్యది ధ్యానంబు, జ్ఞానయజ్ఞమున భగవ
ధారాధనకై కృష్ణుని ప్రీతికిఁ బారాయణజపములు వినియోగము.

# సారము

శ్రీకృష్ణాంఘ్రియుగం బెదనిడుకొని చెప్పెద భగవద్గీతాసారము.
శ్రీకరములు యజ్ఞరూపకర్మలు సేయుఁడి పాయుఁడి యీ సంసారము.
లోకేశుం డచ్యుతుండు పుణ్యశ్లోకుని మఱుఁగునఁ జిత్తశుద్ధితో
స్వీకరించియు స్వధర్మ, మాసక్తి లేక తత్తత్ఫలంబు లేమాత్ర
మాకాంక్షించక కర్మ లెల్లను హృషీకేశున కర్పించుచు మది న
స్తోక దయాబ్ధిపదములు నిల్పుకొని, యేకాగ్రబుద్ధి నల్పుము ధ్యానము
శ్రీకాంతుని ప్రియనిజజన సేవా నౌకాధారమున నీ ప్రయాణము
గైకొని యతిసులభంబుగఁ జేరుము వైకుంఠము, నీ గమ్యస్థానము.

# కృతికర్త

శ్రీకృష్ణుని స్మృతిపథమున, గొనుచు రచించెను భగవద్గీతాగానము;
శ్రీకరంబు నిహకరసౌఖ్యంబుల కాకరంబు భవభయవిదారకము,
ప్రాకట మగుబ్రహ్మబోధకంబు నుపనిషత్సారము, యోగశాస్త్ర మిది,
శ్రీకృష్ణార్జునసంవాదంబు త్రిలోకంబుల కేకైకధర్మ్య మిది;
రాజేశ్వరాఖ్యుఁడు గంగాన్వయుఁడు, రాజేశ్వరి లక్ష్మణకవి పుత్రుఁడు
రాజయవేంకటరాజమపౌత్రుఁడు, రాజలింగలింగమల ప్రపౌత్రుఁడు
రాజవరపుశేనయ దౌహిత్రుఁడు. రాజిల్లిన యంబికాకళత్రుఁడు
రాజలక్ష్మణుఁడు, శంకరుండు, చంద్రశేఖరుండు, మనోహరాఖ్యుఁడును
రాజలక్ష్మియను, సంతానముతో రంజిలు కవిశేఖరుఁడు, పవిత్రుఁడు;
రాజేశ్వరకరుణాపాత్రుఁడు నారాయణగురువరు సచ్ఛాత్రుండును
పూజనీయగోదావరీతీర పుణ్యభూమి మంథెన క్షేత్రస్థుఁడు
శ్రీకృష్ణుని స్మృతిపథమునఁ గొనుచు రచించెను భగవద్గీతాగానము.

ఓం

శ్రీ గణేశాయనమః

శ్రీ శారదాయైనమః

శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

# శ్రీమద్భగవద్గీతాగానము

## ప్రథమాధ్యాయము

## అర్జున విషాదయోగము

శ్లో॥ 1-6 16 మాత్రలు

ధర్మక్షేత్రం బైన కురుక్షేత్రంబునందు నా వారు కౌరవులు
ధర్మరాజాదులు పాండవులు యుద్ధమునఁజేరి చేసి రేమి? చెపు మను
ధృతరాష్ట్రుని ప్రశ్నకు సంజయుఁడిటు
ప్రతివచనముగాఁ బలుక దొడంగెను.
పాండవ సేనానీకముఁ గని సం
భ్రమము దోఁప ద్రోణాచార్య గురుని
యండఁ జేరి దుర్యోధనరా జిటు
లని వక్కాణించెను నరవర్యా!
ద్రుపదసుతుఁడు మీ శిష్యుఁడు ధృష్ట
ద్యుమ్నుఁడు ధీమంతుఁడు రచించిన ని
రుపమ మగు మహా పాండవసైన్య
వ్యూహంబును గాంచుఁడి గురువర్యా!
శూరులును మహేష్వాసులు భీమా

ర్జున సము లగు సాత్యకియు, విరటుడు, మ
హారథి ద్రుపదుడు, ధృష్టకేతు కా
శిరాజన్యుడు చేకితానుడును
భూరి విక్రముడు పురుజి, త్కుంతీ
భోజుడు, నరపుంగవుడు శైబ్యుడును,
వీరు లుత్తమౌజ యుధామన్యులు,
విక్రము లుపపాండ వాభిమన్యులు,
వీరలందఱు మహారథు లింకను
వీరవరేణ్యుల వీక్షింపు మనఘ

శ్లో॥ 7-11 12 మాత్రలు

మనసైన్యమునందు వెలయు మహానాయకశ్రేష్ఠుల
వినిపించెద సంజ్ఞార్థము ద్విజోత్తమా! యవధరింపు;
మీరు భీష్మకర్ణులును సమితింజయుండైన మీ కు
మారుం డశ్వత్థామయు వీరుండు కృపాచార్యుడు,
భూరిశ్రవుడు వికర్ణుడు, వీరు గాక యెందఱొ రణ
శూరు లాహవక్రీడ విశారదు లసువులు నాకై
కోరి త్యజించుటకై యిటు జేరిరి శస్త్రాస్త్రవిదులు;
బలము భీష్మరక్షితంబపర్యాప్తము మనది; యెదుటి
బలము భీమరక్షితంబు పర్యాప్తము, వ్యూహమార్గ
ములలో మీ మీ నియతస్థలములలో దృఢముగాను
నిలిచి భీష్ము గావవలయు నేర్పుమెయిన్ మీ రందఱు

శ్లో॥ 12-13 16 మాత్రలు

కౌరవవృద్ధపితామహయోధుడు
కౌరవనాథునకున్ మోదంబును

గూరుపఁ జేసెను సింహనాదమును:
బూరించెను శంఖము భుంభు మ్మని
భేరీపణవానకగోముఖ శం
ఖారావమ్ములు వీరనినదములు
సేరి తుములమ్ములై దశదిశలన్
దూరెను గగనం బంతయు నిండెను

శ్లో॥ 14-20 12 మాత్రలు

వెలిగుఱ్ఱాలరథంబున వెలుగుచుఁ గృష్ణార్జునులును
బలముగఁ దమదివ్యశంఖములను బ్రపూరించి రపుడు,
పాంచజన్యమును గృష్ణుఁడు పార్థుఁడు దేవదత్తమును,
భీముఁడు పౌండ్రం బనియెడు భీమశంఖమును, ధర్మని
సుతుఁడ నంతవిజయమ్మును సుఘోషమణిపుష్పకములు
కవ లప్పుడు పూరించిరి: కాశీరాజు శిఖండియు,
ధృష్టద్యుమ్నుఁడు, సాత్యకి ధీరుం డభిమన్యుండును,
ద్రుపదుండు, విరాటనృపుఁడు ద్రుపదాత్మజసుతు లేవురు
దండిగాను బ్రమోగించిరి తమ తమ శంఖాల వారు.
ఆ రవంబు భూమ్యాకాశాంతరాళమం దిముడక
వైరుల గుండెలకొండల దూరి వానిఁ జీఱి వెడలె.
సమరమునకుఁ గురుబలములు సంసిద్ధముగా యుద్ధో
ద్యముఁడై గాండీవ మెత్తి యర్జును డనెఁ గృష్ణుని తోన్

శ్లో॥ 21-23 14 మాత్రలు

రెండు సేనలనడుమ నా యీ దండియరదము నిల్పు మచ్యుత!
భండనమునకు నుత్సహించెడు వారి నీక్షించెదను ముందుగఁ;
గౌరవులు ధూర్తులకుఁ బ్రియమును గలుగఁ జేయుటకొఱకు నాతోఁ
బోర నువ్విళ్ళూరు నీ యరివీరులఁ బరీక్షింప నిమ్మిక

శ్లో॥ 24-25 16 మాత్రలు

అర్థించెను నిటు లా గుడాకేశు డాహవప్రారంభమునకుఁ బూర్వము
పార్థసారథియు భీష్మ ద్రోణ ప్రముఖుల సమ్ముఖ మందును దదితర
పార్థివుల సమక్షంబునం, దుభయపక్షవాహినీ మధ్యదేశమున
బార్థుని యరదము నిల్పి యనియె నికఁ బరికింపుము కౌరవబలంబులను.

శ్లో॥ 26-27 8 మాత్రలు

తాతల గురువులఁ దండ్రులను హితుల,
దనయుల నన్నలఁ దమ్ములను, మేన
మామల, మామల మనుమలఁదదితర
బంధుల సుహృదుల బావమ అందుల,
సఖులను, నాహవ సంసిద్ధుల నిరు
వైపుబందుగులఁ బరికించి చూచి,
కరుణాహృదయుఁడు, కౌంతేయుఁడు గడు
విలపించుచు నిటు వలుకఁ దొడంగెను

శ్లో॥ 28-37 14 మాత్రలు

యుద్ధమును జేయుటకు నిట సన్నద్ధులైన స్వజనుల గాంచిన
బుద్ధి పరిపరి విధము లెటకో పోవుచున్నది తోఁచ కున్నది;
సడలు చున్నవి యంగములు తడఁబడెడు వాక్యము లుడుకు దేహము,
పిడుఁచ గట్టును నాల్క పులకలు పొడముఁ దొడగె శరీర మంతట,
నొడలు తెలియగ లేను నే నిలబడఁగ నోపను, జూడు మే నెటు
వడఁకు చున్నదో? చేతిగాండీవంబు జారుచు నున్న దకట
దుర్నిమిత్తము లెల్ల యెడలను దోఁచు చున్నవి కనుము కేశవ!
యాప్తులను గదనరంగంబున హతము సేయుట శుభము గూర్చునె?
యొల్ల విజయము నొల్ల రాజ్యము నొల్ల సంపద లెవరి కొఱ కివి

యెల్ల గాంక్షించితిమొ వారలు ప్రేల్లటకు నైయున్న వారలె
యట్టి రాజ్యవిభోగములు మా కెట్టి లాభము గూర్చుఁ? గృష్ణా!
తండ్రు లాచార్యులు తనయులు, బితామహులు మాతులులు మామలు,
మనుమలును బావమఱదులు సంబంధజను లగువారలను బర
లోకగతులను జేయఁ జావుకులోను గావించినను నన్నుఁ ద్రి
లోకరాజ్యం బిచ్చినను, భూలోకరాజ్యపు మాట యేటికి?
నాతతాయులు, ధార్తరాష్ట్రులు నైన హత మొనరింప నోపను;
స్వజనులను నశియింపఁ జేసిన సౌఖ్య మెట్టులు గల్గుఁ? జెప్పుమ
మీఁదు మిక్కిలి పాపఫలమే మిగులు మా కిది నిశ్చయము సుమ;
కాన నే యుద్ధంబు సేయుట కల్ల కలలో నైనఁ బొసగదు.

శ్లో॥ 38,39 16 మాత్రలు

దోషము కులనాశకృతము మిత్రద్రోహము పాతక మనెడు మాట యీ
లోభోపహతమనస్కులు కౌరవులు గానరు మే మెఱింగి యుండియును
తన్నివారణకుఁ బాల్పడ కుండుట ధర్మము తప్పుట ధర్మమ? మా కిల
నీకు మాత్ర మిది తెలియదా? నాదు నిశ్చయం బెఱింగించితిఁ గృష్ణా!

శ్లో॥ 40-46 12 మాత్రలు

కులనాశనమే మూలము కులధర్మవినాశనమునకు,
ధర్మము నష్టం బైన యధర్మం బంతట నిండునె,
యధర్మంబు ప్రబలుటచే నగుదురు దూషితలు స్త్రీలు,
స్త్రీలు దుష్ట లైనంతనె చెలఁగు వర్ణసంకరంబు,
వర్ణసంకరము నరకద్వారం బగుఁ గులము కెల్లఁ,
బితరులు పతితు లగుచుంద్రు పిండోదకములును లేక,
సంకరకారక మగు దోషముచే శాశ్వతములు కుల
ధర్మంబులు సర్వజాతిధర్మములు నశించి చెనును.

కులధర్మఘ్నులు పాపులు కోట్లకొలఁది వర్షంబులు
ఘోరనరకకూపంబులఁ గూలి యుందు రని విందుమె
యయ్యయ్యో! రాజ్యసుఖం బాపేక్షించి స్వజనులను
హత మార్చుటవంటి యీ మహాపాపము సేయ నుంటిఁ
బట్టను శస్త్రాస్త్రములను, ప్రతీకారమును దలఁపను,
కౌరవు లీ రణమున నను( గడతేర్చినను సుఖంబే.

శ్లో॥ 47 — 14 మాత్రలు

విజయుఁ డీ ట్లని శోకమున సంవిఘ్నమానసుఁడై వివశుడై
సశరచాపము జారి విడిచెను. చతికిలం బడె స్యందనంబున;
ననుచు ధృతరాష్ట్రునకు సంజయు డంత నాఖ్యానించ దొడఁగెను

## ద్వితీయాధ్యాయము

## సాంఖ్యయోగము

శ్లో॥ 1-3 — 12 మాత్రలు

అశ్రుపూర్ణనయనునకు దయార్ద్రి ఖిన్న మానసునకు
దుఃఖజలధిమగ్ననకు మధుసూదనుఁడిటుల పల్కెను
అపకీర్తికరము క్లైబ్య మనార్య యోగ్య మ స్వర్గ్యము
పార్థ! విషమ సమయంబునఁ బ్రాప్తించెను నీ కక్కట!
గాండీవి! యుచితమ యిట్టి క్లైబ్య మ్మాశ్రయించి యుంట
క్షుద్ర హృదయ దౌర్బల్యము కూడదు లెమ్ము పరంతప!
అన విని కృష్ణున కయ్యర్జునుఁ డిట్టులు బదులు సెప్పె.

శ్లో॥ 4-6 12 మాత్రలు

పూజార్హులు భీష్మాదులు పుణ్యుల రణభూమియందుఁ
బూజించుట బాణంబులఁ బురుషోత్తమ! పురుషార్థమ?
కోరి యర్థకామంబుల గురువరుల మహాభాగుల
రక్తసిక్తమైన యట్టి రాజ్యభోగములు గుడుచుట
కంటెను భిక్షము శ్రేయస్కర మని భావింతుఁగృష్ణ!
కాన నింక నే యుద్ధము గావింపం జాల నయ్య!
యుద్ధము సేయుట మానుట యుచిత మెద్దొ తెలియరాదు,
యుద్ధమున జయ మెటువైపు నుండునొ? యూహింపరాదు,
యుద్ధము సేయుటకై యుద్యుక్తులగు నీ కౌరవ
యోద్ధుల హతమార్చి బ్రతికియుండం జాలము మే మిఁక.

శ్లో॥ 7,8 8 మాత్రలు

శరణు శరణు శ్రీ గురువర్యా! మీ
చరణంబే రక్షణ మాచార్యా!
కరుణానిధి! నే కార్యాకార్యా
చరణవిచక్షణ చాలని కృపణుఁడ
నిరవుగ నిఁక బోధింపుము శ్రేయ
స్కరమార్గము శిరసా వహియించెద.
నింద్రియముల శోషింపం జేసెడు
నీ శోకము శాంతింపదు కేశవ!
యింద్రపదము లభియించినఁ గైకొన
నీ రాజ్యపుసుఖ మెంతది? యారయ!

శ్లో॥ 9-10 14 మాత్రలు

కేశవున కీ విధమున గుడాకేశుఁ డని యిఁక నేను యుద్ధము
సేయ నంచును మిక్కిలి యుదాసీనుఁడై కూర్చుండి యుండెను.

భరతవంశశ్రేష్ఠ! యిట్టు లుభయచమూమధ్యమందున దుః
ఖించు పార్థునిఁ గూఱిచి హృషీకేశుఁ డనె నవ్వెడు విధంబున.

శ్లో॥ 11-18 16 మాత్రలు

శోకింపం గూడని వారలకై శోకించెదు పల్కెదు ప్రాజ్ఞునివలె;
లోకమునఁ జావుబ్రతుకులు సమ మాలోకింతురు విజ్ఞానచక్షువులు.
నేనును నీ వీ రాజు లందఱును నెన్నటి కుండేవారము సుమ్మా!
పూని విచారించినచో రాకడ పోకడ లెఱుఁగని నిత్యులము సుమా!
బాల్యాదిదశలు దేహమ్మునకుం బ్రాపించెడు క్రియ దేహాంతరమును
కాలము కొలఁదియుఁ గల్గుచు నుండును గావున ధీరులు మోహము జెందరు.
విషయేంద్రియసంయోగజములును వివిధసుఖదుఃఖదములు
ద్వంద్వమ్ములు
క్షణమాత్రములు వినాశశీలములు గావున వానిని సహియింపం దగు.
ద్వంద్వాతీతుని ధీరవరేణ్యునిఁ దాఁక నేర వివి పురుషవరేణ్యా!
యఖండాత్మనే చేరఁ గల డతం డమృతత్వంబున కర్హుఁడు కావున.
సద్వస్తువునకుఁ ద్రికాలములలో సత్త కలిగియే యుండును గదా య
సద్వస్తువెపుడు లేని దను రహస్యము తత్త్వజ్ఞులు మాత్ర మెఱుఁగుదురు
అవినాశియ యని యెఱుఁగుము పార్థా! యంతట నిండిన యాత్మపదార్థం
బిది యవ్యయ మగు కతమున దీని నశింపం జేయ సమర్థు లెవ్వ రిల?
నిత్యం బవినాశ మప్రమేయము, నిర్వికార మగు నాత్మ యనేకా
నిత్యము లగు దేహములను దాల్చును నిశ్చయమతివై యుద్ధము సల్పుము

శ్లో॥ 19-24 12 మాత్రలు

చంపఁ బోదు చంపఁ బడదు సాక్షిరూప మైన యాత్మ;
చంపును జంపఁ బడు ననుట సమ్మూఢాత్ములకె చెల్లు.
సర్వకాల సర్వావస్థలయం దీ యాత్మ యుండుఁ
జావుపుట్టుకలు లేనిది శాశ్వతము పురాణ మజము

నాశ మొందు దేహముల వినాశ మొఱుంగక వెలుఁగును.
అజుఁడు శాశ్వతుం డవ్యయుఁ డంచు నాత్మ నెఱుఁగు నట్టి
జ్ఞాని యెట్టి వాని నైనఁ జంపింపఁడు తాఁ జంపఁడు.
ప్రాఁతబట్ట విడిచి నూత్నవస్త్రధారణము సేసెడు
రీతి దేహి దాల్చెడును శరీరములను గ్రొత్తవాని.
యాయుధంబులు ఖండింప, వగ్ని దాని మండింపదు,
వారి దానిఁ దడపలేదు, వాయువు శుష్కింపలేదు,
సర్వగతము సనాతనము స్థాణు వచల మది నిత్యము.

శ్లో॥ 25-30 16 మాత్రలు

అర్థముగాదయ్యా! నీ కర్జున
నిర్హేతుకముగ నిటు శోకించుట యర్థము గాదయ్యా!
వ్యక్తము గా దాత్మ చింతించుటకు,
వశముగా దెట్టివారల కైనను,
షడ్వికారములు దానిని స్పృశింప
జాలవు వినవయ్యా! శోకించుట- యర్థము గాదయ్యా!
ఆత్మకు జన్మంబులును మరణంబు
లనివార్యములని తలంచినను నరె
సహజం బై నది చావుపుట్టుకల
చక్రంబుగదయ్యా! శోకించుట- యర్థము గాదయ్యా!
జన్మించినవానికిఁ జావుస్థిరము,
చచ్చినవానికిఁ దప్పదు పుట్టువు,
పరిహరింపరానట్టిది! యీ పని
పరికింపఁ గదయ్యా! శోకించుట- యర్థము గాదయ్యా!
భూతజాలములకు విశ్వమందున
భూతభవిష్యత్తులు గనరానివి

వర్తమానమాత్ర ప్రాణుల కిటు
వగచు టేలనయ్యా! శోకించుట- యర్హము గాదయ్యా!
కొందఱాశ్చర్యమునఁ గాంతురు మఱి
కొంద ఱాశ్చర్యమునఁ జెపు చుందురు
కొందఱు వినుచుండు రెఱుఁగు వారలిం
కెందఱు గల రయ్యా! శోకించుట- యర్హము గాదయ్యా!
దేహము లనిత్యములు గాని సర్వ
దేహధారి యాత్మ నిత్యము సుమా!
మరణశీలమ్ములు భూతమ్ము లీ
మాత్ర మెఱుఁగు మయ్యా! శోకించుట యర్హము గాదయ్యా!

శ్లో॥ 31-38 12 మాత్రలు

క్షత్రియవరులకు శ్రేయస్కరము ధర్మయుద్ధము నీ
క్షాత్రధర్మ మనుసరించి జడియ వలదు పోరుటకై.
స్వర్గద్వారము దెఱపం జాలెడు నాహవము రాజ
వర్గమునకుఁ బూర్వపుణ్యవశమున సమకూరుఁ గాదె.
ధర్మబద్ధ మగు నీ యుద్ధంబు సల్ప కున్న నిన్ను
ధర్మము కీర్తియు వీడును దండపాణి దండించును.
వార్త యిద్ది యపయశస్సు వాహినియై ప్రవహించును;
కీర్తిమంతునకు నీ యపకీర్తి మరణమును మించును.
పోరునుండి భయమువలనఁ బాఱితి వందురు వీరులు;
శూరవర్య! వారిముందుఁ జులుకన మయ్యెదవు చుమ్మి!
యరు లనరానివి వాక్యము లందు రయ్య యెన్నియొ
పరిపరివిధముల నిందింతురు సహ్యమే? యీ దుఃఖము
వచ్చిన వీరస్వర్గము జయముగొన్న రాజ్యసుఖము;
తెచ్చిపెట్టు సంగరమున ధీరుఁడవై ప్రవేశింపు.

సుఖదుఃఖద్వాంద్వాదులఁ జూచుచు నుండుము సమముగ;
సఖ! నిన్నంటదు పాపము సమర మింక సల్పు మయ్య!

శ్లో॥ 39-41 16 మాత్రలు

జ్ఞానమార్గమునఁ దెల్పినట్టి యీ సమబుద్ధిని కర్మమార్గమున విను;
దీని యాశ్రయమునఁ గర్మబంధము తెగును సబీజముగా నశియించును.
ఆరంభించిన యోగబీజమ్ము, లవినాశము, లప్రత్యవాయములు
ఘోరం బగుసంసారభయము నివి కొంచెము త్రైనను ద్రుంచివేయు సుమ.
నిశ్చిత మగుసమబుద్ధి యొక్కటే నిర్మలమానసు లందుఁ బొసఁగు గద!
యనిశ్చితాత్మలబుద్ధు లనంతము, లనేకముఖములు, పరిపరివిధములు

శ్లో॥ 42-44 14 మాత్రలు

వేదచోదితకర్మకాండను విశ్వసించెడువారు భూస్వ
ర్గాదిలోకసుఖంబులే పరమావధి యని భ్రమించి చెపుదురు.
జన్మయే కర్మలకు, భోగైశ్వర్యములు జన్మకు ఫలము లని,
తన్మయస్థితి గర్మలను తత్తత్ఫలము లాసించి చేతురు.
నిశ్చలం బగుబుద్ధి లేమిని- నిత్యభోగాసక్తు లగునవి
పశ్చితుల, కల్పబుద్ధులకును బ్రవేశము యోగమున గల్గున?

శ్లో॥ 45-53 16 మాత్రలు

త్రిగుణాత్మకములు వేదకర్మ లవి, త్రిగుణద్వంద్వాతీతుఁడవు, నిత్య
యుక్తుఁడ వాత్మజ్ఞాని వగుమ! నీ యోగక్షేమపుఁజింత మానుమా!
పరిపూర్ణములై ప్రవాహము లుండఁ బ్రయోజన మేమి? నీటిగుంటతోఁ
బరబ్రహ్మనిష్ఠుఁ డగుజ్ఞానికిఁ బని యే మున్నది? కర్మకాండతోఁ
గర్మ సేయుటందే యధికారము కలదు నీకు, ఫలమున లేదు కామ్య
కర్మలయం దాసక్తియును విహిత-కర్మలం దనాసక్తి యనుచితము.

యోగస్థితిని స్వకర్మ సేయుమా, భోగములం దాసక్తివీడుమా,
సిద్ధ్యసిద్ధులం దేకరససమ-స్థితి మాత్రమె యోగం బనఁబడు సుమ!
బుద్ధియుక్తకర్మలు శ్రేష్ఠంబు ల-బుద్ధియుక్తకర్మలు నికృష్టములు,
బుద్ధి నాశ్రయించి కర్మ సల్పుమ, మూఢులు గద కామ్యకర్మకర్తలు.
పుణ్యపాపములు రెండును దొలఁగును పురుషుఁడు సమబుద్ధిని జరించిననఁ
గణ్యకర్మఫల మంటనట్టి యీ కర్మకౌశలమె యోగ మనంబడు
సమబుద్ధినిఁ జరియించు మనీషులు సమస్తకర్మఫలములు విడనాడి
యమృతత్వంబును బొంది వారు పున-రావృత్తిరహిత్యపదమును
గాంచెద
రెప్పుడు నీ యజ్ఞానబుద్ధి తరి-యించునొ మోహమలంబు పూర్ణముఁగ,
నప్పుడె యిహపరవిషయభోగంబులందు దృఢవిరాగం బేర్పడు సుమ!
వివిధశాస్త్రవచనములు వినుటచే- విక్షేపము చెందిన నీ బుద్ధిని
ప్రవిమలబ్రహ్మమందు స్థిరముగా భద్రపఱుచుటే యోగ మనంబడు.

శ్లో॥ 54-72 12 మాత్రలు

స్థితప్రజ్ఞుఁ డెవఁడు? వాని స్థిరసమాధి యెటువంటిది?
స్థితమతిభాషణ మెట్టిది? స్థితియెట్టిది? గతియెట్టిది?
యతివిధేయతను నిటు లని యర్జునుండు ప్రశ్నింప, న
మితదయార్ద్రహృదయుఁడు స-స్మితవదనుఁడు, కృష్ణుఁడనెను
వెతలమూలకములు వేన-వేలు కోర్కె లన్నింటిని
నతినిర్దాక్షిణ్యంబున- నవతలకుం గెంటువాఁడు,
సతతము తనలోనఁ దాను సంతుష్టినిఁ జెందువాఁడు,
స్థితప్రజ్ఞుఁ డనఁబడు సు-స్థిరమగుబుద్ధి గలవాఁడు.
సుఖదుఃఖప్రాప్తియందు సుతరాం పొంగఁడు క్రుంగఁడు,
నిఖిలరాగభయక్రోధ-నివారణము గాంచు వాఁడు,

సఖుఁడుగాఁడు శుభములకు వి-ముఖుఁడుగా దశుభములకును,
నఖిలభూతగణములందు నాత్మదృష్టి గలుగువాఁడు. ॥స్థి॥

కచ్ఛపంబునేర్పున నం-గములు మరల్చు విధంబున,
తుచ్ఛవిషయములలోనం జొరనీయక యింద్రియముల
స్వేచ్ఛను నరికట్టి తాను జేరి యాత్మతత్త్వంబున
స్వచ్ఛమనోబుద్ధులతో సంయమియై యొప్పు వాఁడు ॥స్థి॥

ఆహరించని విషయంబు- లవతలనే యుండుఁ గాని
యూహమాత్ర మా పురుషుని నెన్నఁటికిని వీడి యెఱుఁగ,
దూహాతీతం బైన మ-హోన్నత మగు నా యాత్మ
స్నేహంబున నద్దానిని- శిథిలం బొనరించు వాఁడు ॥స్థి॥

ప్రయత్నంబునం దేమఱు-పాటును గని దుష్టేంద్రియ
చయము మనసు నపహరించి- చనుఁ, గావున సాధకుండు
రయమున దానిని సంపూర్ణముగా స్వాధీనపఱిచి,
జయమును సంపాదించి య-భయము వొందఁ గలడు వాడు ॥స్థి॥

ధ్యానించిన కొలఁదియు విష-యాసక్తి జనించు చుండు,
దానఁ గామ మది పూరితి కానితఱిని క్రోధంబును,
దానివలన మోహం, బ-ద్దాన స్మృతిభ్రంశ మగును,
హీనమగును బుద్ధి యంత హేయ మగును వానిజన్మ.
రాగద్వేషస్వేచ్ఛా-రహితేంద్రియములద్వారా
భోగించెడు నైన విషయ-భోక్త గాఁడు వశ్యాత్ముఁడు,
త్యాగపూర్వకముగ దేహ-ధారియై చరించు నీ వి
రాగిదరికి నే దుఃఖము రాదు, ప్రసన్నాత్ముఁ డతఁడు
లే దయుక్తునకు బుద్ధియు-లే దాత్మవిచింతనయును,
లేదు శాంతి వానికి రాఁబోదు సుఖం బింద్రియముల
నేది మనస్సును బట్టి గ్రహించు నా యది ప్రజ్ఞఁ గూడ

స్వాధీనము చేసికొనును వాయువు నౌకను వోలెను.
సర్వవిషయములనుండియు సంపూర్ణముగా నెవండు
సర్వేంద్రియముల గ్రహించి స్వాధీనము చేసికొనునొ,
సర్వకాలసర్వావస్థలయందుఁ బ్రశాంతుఁ డతఁడు;
నిర్వివాద మీ యంశము నిశ్చయ మిది నమ్ము పార్థ!
సర్వప్రాణులు గాంచం జాలని బ్రహ్మముఁ గన్నులఁ
బర్వముగాఁ జూచు చుండుఁ బగలుగ సంయమివరుండు,
నుర్విని నజ్ఞాని చూచు చుండు సత్యముగ దృశ్యము;
నిర్వికారిదృష్టికి నది నిశివోలె నగోచరంబు
నీరంబులు బహుముఖముగఁ బూరించుచు నున్నఁగాని
మేర దాట దచలపూర్ణవారిధి, యా చందమునఁ
గోరిక లన్నియును వచ్చి చేరిన నా పూర్ణకామి
మాఱఁడు తనస్థితియందు వికారంబును జేర నీఁడు.
సదా సర్వకామములను సంపూర్ణముగాఁ ద్యజించి,
యుదాసీనబుద్ధితోడ నూఱక యుండును వాఁడు,
ఇది నే నిది నాది యంచు మది భావన లేని వాఁడు
పదిలంబుగ నాత్మయందుఁ బ్రశాంతత వహించు వాఁడు.
కుంతీతనయా! యియ్యది కోరదగిన బ్రాహ్మిస్థితి
చెంతకు రా దిఁక మోహము చేరిన యీ సుస్థితిలో,
నంతకాల మందేనియు నాస్థితుఁడై దీనియం ద
నంతన్ బ్రహ్మానందం బందుకొన గలం డాతఁడు.

# తృతీయాధ్యాయము

## కర్మయోగము

శ్లో॥ 1-9 14 మాత్రలు

జ్ఞానమే కర్మకును బరము, ప్రధాన మని మదిలోఁ దలంచెద
లేని నన్నీ ఘోరకర్మకుఁ బూను మను టెందులకుఁ గేశవ!
వీనిరెంటినిఁ గలిపి చెప్పకు దేనివలనను నాదుశోకము
మానునో నిశ్చయముగా నద్దానినే దెల్పు మనఁగా భగ
వానుఁ డయ్యర్జునునిఁ గూఁజిచి పూని యిటు చెప్పందొడంగెను.
జ్ఞానయోగము సాంఖ్యులకు నజ్ఞానులకునై కర్మయోగము
నేను చెప్పితి జగతిఁ బూర్వమె యీ విధం బగు రెండునిష్ఠలు
మానినంతనె కర్మలను నేమాత్రమును సన్యాస మబ్బదు
పూని చేయక యున్న నాతఁడు వొందునా? నైష్కర్మ్యసిద్ధిని
మానవుఁడు కర్మసల్పక యొక మాత్రకాలము నిల్వఁడు వరా
ధీనుఁడై ప్రకృతిచోదితుఁడై తెలియకయ కార్యములు సేయును
తాను గర్మేంద్రియముల నడఁచి జ్ఞానివలె నటియించు మూఢుఁడు
మానసంబున విషయచింతన మానఁ డాతఁడు డాంబికుఁడు సుమ!
మనసు బుద్ధీంద్రియము లన్నిఁటిఁ దనవశంబున నునిచి నియతఁపుఁ
బను లనాసక్తియోగంబున నొనరించెడు వాఁడు శ్రేష్ఠుఁడు గద!
కర్మ మానుటకన్న యోగ్యము కర్మ సలుపుట నియత మైన స్వ
కర్మచేయుము, చేయ కుండినఁ గడచునా? శారీరయాత్రయు
యజ్ఞభావమునఁ గర్మలు సేయంగ వలె నాసక్తి లేకయ
యజ్ఞబాహ్యపుఁగర్మ యంతయు వ్యర్థ మయ్యది బంధహేతువు.

శ్లో॥ 10-13 16 మాత్రలు

ప్రజలను యజ్ఞంబులను సృష్టించి ప్రజాపతి యిట్టు లనియె వారలకు
యజనంబులు సేయుం డిష్టంబుల నందుకొనుఁడి యభివృద్ధులు గాంచుఁడి
దేవతలను భావించిన వారలు తిరిగి మిమ్ము సంభావింతు రిటులు
పరస్పర స్నేహభావమున నగుఁ బ్రాప్త ముభయులకుఁ బరమశ్రేయము
యజ్ఞతృప్తు లగుదేవత లిచ్చెద రర్థసంపద లనేకంబులు త
ద్దత్తంబులు వారికి నొసఁగకయే తాను భుజించిన దొంగయ వాఁ డగు
యజ్ఞశిష్టములు సర్వపాపపరిహారకంబు లని కుడుతురు సంతులు
వండుకొంద్రు తమకొఱకే పాపులు పాపపుఁగూడును దామే తిందురు

శ్లో॥ 14-28 12 మాత్రలు

అక్షర మగుబ్రహ్మనుండి యావిర్భవ మొందె వేద,
మావేదమువలనఁ బుట్టె నఖిలకర్మ కర్మయందు
సర్వశుభప్రదయజ్ఞము సంభవించె, యజ్ఞంబున
వర్షం బుద్భవ మయ్యెను, వర్షంబున నన్నం బా
యన్నము నుండియ భూతము లన్నిజనించెను గావున
సర్వగతుఁడు బ్రహ్మము దా సదా యజ్ఞమం దుండును
విషయభోగలాలసుఁ డీ విధపుసృష్టి చక్రంబును
పాటింపఁడు పాపాత్ముఁడు వ్యర్థపఱుచుఁ దనబ్రతుకును
తననే దాఁ బ్రేమించుచుఁ దనయందే సంతృప్తినిఁ
గొను సంతతసంతోషికి విను కార్యము లేనెలేదు.
పనిచేసినఁ జేయకున్నఁ బ్రయోజనము లే దతనికిఁ
బనిలే దాతనికి నెట్టిప్రాణితోడ నిసుమంతయుఁ
గావున నాసక్తి విడిచి కర్తవ్యపుఁగర్మ లెపుడుఁ
గావింపుము దానివలనఁ గల్గును మోక్షమ్ము నీకు
కర్మమూలమున సిద్ధినిఁ గాంచిరి జనకాదు లిలను

కర్మలోక సంగ్రహమునకై యైనను సలుపవలయు
శిష్టజనులఁ బ్రమాణముగ స్వీకరించి యవ్వారల
చేష్టలనే యనుసరించి చేయుదు రితరులు కర్మలు
పొందిన దేదియును లేదు, పొందవలసినది లే దిల
యం దేకర్తవ్యములే దైనను సల్పుదు కర్మలు
నేను జగతియందు సావధానమతినిఁ గర్మసేయ
నేని నన్నుఁ గాంచి జనులు మానఁ గలరు తమ కర్మలు
దాన భ్రష్టు లగుదురు లోకాన సంకరం బగు నీ
హానికి నేఁ గారకుండ నౌదుఁ గాన కర్మ సేతు
సక్తు లగుచు సల్పుదు రజ్ఞానులు తమకర్మ, లనా
సక్తు లగుచు లోకులకై జ్ఞానులు సేతురు కర్మలు.
కర్మాసక్తునకు భ్రమలు గలుగకుండ జూచుటకు స్వ
ధర్మ విహితకర్మ సల్పుఁ దగువిధి బ్రహ్మనిష్ఠుఁడును.
సర్వకర్మ ప్రకృతివలన జరుగుచుండ నహంకారి
గర్వవిమూఢాత్ముఁడు దాఁ గర్త నంచు భావించును.
గుణకర్మలతత్వంబును గుర్తించిన తత్త్వజ్ఞుడుఁ
గుణములు వర్తించును దమగుణముల నని మమత గొనఁడు.

శ్లో॥ 29-30 14 మాత్రలు

ప్రకృతిగుణసంబద్ధు లా యా పనుల యందాసక్తు లగుదురు
ప్రాకృతులు; తన్మందమతులను బ్రాజ్ఞు లెపుడు భ్రమింపఁ జేయరు
అన్ని కర్మలు నాకొఱకు నధ్యాత్మబుద్ధిని సమర్పించి ప్ర
సన్నచిత్తముతోడ మమతాశలు వదలి యాహవ మొనర్పుఁమ!

శ్లో॥ 31-35 16 మాత్రలు

ఈ నా మత మనసూయాపరు లే మానవుల లతిశ్రద్ధాభక్తులతో
ననుసరింతురో కర్మబంధముల నంటరు వారలు నిత్యవిముక్తులు.
ద్వేషభావమున నీ మత మేయవివేకి మన్నింపఁ డిహపరసుఖసం
తోషముల కెల్ల దూరుఁ డగు వాఁడు దూషితము లతని బుద్ధులు కర్మలు
స్వభావజము లగుకర్మలనే విజ్ఞానులు సహితం బాచరించెదరు
ప్రకృతి ననుసరించి భూతజాలము ప్రవర్తింప నిగ్రహము వొసఁగునా?
యింద్రియములరాగద్వేషము లా యింద్రియార్థముల దాగియుండునో
యింద్రతనయ! వీనికి వశపడకుము! యివియే నీ కిల బద్ధశత్రువులు
చక్కని పరధర్మాచరణకంటె స్వధర్మంబు గుణహీనము శ్రేష్ఠము
మిక్కిలి భయ మిచ్చును బరధర్మము మే లొసఁగును స్వీయధర్మ
మరణము

శ్లో॥ 36-43 16 మాత్రలు

ఇష్టము లే కున్న బురుషు లిలలో నేదో బలవంత మన్నట్టు లే
దుష్టశక్తి ప్రేరేపణచేఁ జేతురు పాపంబులు? తెల్పు మనుచు వి
శిష్టగుణుం డర్జునుఁ డడిగిన నా శిష్టరక్షకుఁడు బదు లిటు చెప్పెను
కామక్రోధంబులు రెండు పాపకారణంబులు మహాశనంబు నేవి
బుద్ధికి బాధాకరములు రజసోద్భూతంబులు వీని నెఱుఁగు మర్జున!
ధూమ మగ్ని మావి గర్భమును భూధూళి దర్పణము మఱుఁగు
పఱుచుక్రియఁ
గామక్రోధంబులు నెల్లప్పుడుఁ గప్పివేయు గద జ్ఞానజ్యోతిని
మనోబుద్ధీంద్రియంబులే కామమందిరంబు లవ్వానిబలంబున
దేహిని సమ్మోహితుఁ జేసి వానితెలివికి నావరణం బగు నియ్యది
మొదట యింద్రియంబులపై విజయము పొంది జ్ఞానవిజ్ఞానబాధకము
పాపమూలకం బైనకామమును బాఁఱ ద్రోలవలె భరతశ్రేష్ఠా!

పరము లింద్రియము లింద్రియంబులకుఁ బరముమనం బా మనమున
కంటెను

బరము బుద్ధి యా బుద్ధికి మిక్కిలిఁ పర మాత్మయ యదియే పరమాత్మ
పరమపరం బగునాత్మ శరణు గొని పదిలపఱిచి యాత్మయందు నాత్మను
పరమదుస్సాధ్యకామశత్రువును బరాభవింపుము మహాబాహుబల.

# చతుర్థాధ్యాయము

## జ్ఞానయోగము

శ్లో॥ 1-3 16 మాత్రలు

ఈ యోగము భాస్కరున కేను వినిపించితిఁ బూర్వము నాతఁడు వైవ
స్వతమనువున, కాతఁడు తనసుతుఁ డిక్ష్వాకునకుఁ దెల్పెఁ బరంపరగా రా
జర్షులు దీని నెఱుంగుచు వచ్చిరి; చాలకాలం బతీత మగుటచే
లోకంబున నీ యోగము దఱచుగా లుప్తమయ్యె; భక్తుండవు సఖుఁడవు
బోధించెద నుత్తమము రహస్యము పురాణమును నగుదానిని నీ కిపు
డనఁ గృష్ణుం డర్జునుఁడును సందేహము వొడమిన నిట్టులు ప్రశ్నించెను

శ్లో॥ 4-12 14 మాత్రలు

నీవు గన నేఁటివాఁడవు రవిదేవుఁ డన సృష్ట్యాదివాఁ డా
దిత్యునకు బోధించితి ననెడు తెలియ కున్నది యీ రహస్యం
బనుచు ననుమానించుపార్థుని ననునయించుచుఁ బల్కె శ్రీహరి,
నీకు నాకును గడచిపోయె ననేకజన్మలు వాని నన్నిటి
నే నెఱుంగుదు వాని గూఱిచి; నీవు మాత్రము తెలియ నేరవు

అజుఁడ నే నవ్యయుఁడ నీ భూతాళి కంతయు నీశ్వరుఁడ సుమ!
యైన నా ప్రకృతిని వశముఁ గొని యవతరించెద నాత్మమాయను,
ధర్మమున కత్యంతహాని యధర్మమున కభివృద్ధి గలిగిన
తరుణమున నేఁ బృథ్వియందునఁ దాల్తు దేహము స్వేచ్ఛచేతను
సాధువుల రక్షించుటకును నసాధువుల శిక్షించుటకు నే
సారెకును వచ్చెదను ధర్మస్థాపనం బొనరించుటకు భువి
దివ్యములు నా జన్మకర్మలు తెలిసికొందురు వాని నెవ్వరు
పుట్టఁ బో రిఁక వారు నన్నే పొందుదురు తత్త్వజ్ఞులు ఘనులు.
వీతరాగభయక్రోధులు విస్మరింపక నను శరణు గొని
పూతు లగుదురు, వారు నన్నే పొందు చుందురు జ్ఞానతపమున
నేవిధంబున మానవులు నా సేవ చేయుచు నుందురో వా
రావిధం బగుఫలము గొని న న్నన్ని విధముల ననుసరింతురు.
కర్మఫలకాంక్షతో నా యా కర్మదేవతలను భజింతురు
కర్మసిద్ధిని శీఘ్ర మీలోకంబునందే వారు గాంతురు.

శ్లో॥ 13-22 16 మాత్రలు

చాతుర్వర్ణ్యం బేర్పడియెను నాచేతను గుణకర్మానుసారముగ
నేతన్మాత్రంబునఁ గర్తను నేనే మాత్రము గానవ్యయుఁడఁగనుక
కర్మఫలంబులఁ గాంక్షించను నా కర్మలు నన్నంట వింకెన్నఁడు సుమ!
కర్మచేత బంధింపఁ బడ డిట్టికర్మరహస్యం బెఱిగిన యాతఁడు
పూర్వులు ముముక్షువులు జనకాదులు పొనరించిరి యీ విధమునఁ గర్మల
నుర్విని వారల యడుగులజాడల నొనరింపుము నిష్కామకర్మలను
కర్మాకర్మలకాతత్త్వరహస్యము గాంచలేరు పండితుసయిత మా
కర్మమర్మ మిపుడు నీకుఁ జెప్పెదఁ గాఁగల విఁక భవబంధ ముక్తుఁడవు.
నియతకర్మలు తెలిసికొన వలయును నిషిద్ధకర్మ లెఱుంగవలె మఱియు
కర్మ సలుప కుండుటయును గనవలెఁ గర్మగతి గ్రహించుట యతికష్టము

కామసంకల్పవర్జితములుగాఁ గర్మలు సల్పుచు నుండెడివారలు
జ్ఞానాగ్నిదగ్ధకర్ములు, వారిని జ్ఞానులు పండితు లని పేర్కొందురు
కర్మఫలాసక్తి విడిచి యెన్నఁడుఁ గాంక్షించక యితరాశ్రయంబులను
కర్మలెల్లఁ జేయుచు నుండియు నైష్కర్మ్యఫలము గాంచు నిత్యతృప్తుఁడు
నాశలన్నియును వీడి చిత్తమును స్వాధీనమునం దుంచి కేవలము
దేహధారణార్థకృతకర్మ బంధింప దెన్నఁ డపరిగ్రహదీక్షునిఁ
దృప్తి యదృచ్ఛాలాభంబుల నిర్లిప్తత ద్వంద్వంబుల విమత్సరత,
సిద్ధ్యసిద్ధులందు సమత యెవనికి సిద్ధించునా కర్మ లతని నంటవు

శ్లో॥ 23, 24 14 మాత్రలు

సంగరహితుఁడు నిత్యముక్తుఁడు జ్ఞానసంస్థితుఁడై యొనర్చిన
యజ్ఞరూపసుకర్మ యంతయు నంత మగు నిస్సంశయంబుగ
బ్రహ్మ యగ్నియు హోత, హవ్యార్పణము లన్నియు బ్రహ్మయేయని
బ్రహ్మకర్మసమాధి సల్పెడు బ్రహ్మనిష్ఠుఁడు వొందు బ్రహ్మనె

శ్లో॥ 25-30 10 మాత్రలు

కొంద ఱిల దేవతలకొఱకు యజ్ఞమొనర్తురి
కొంద ఱాత్మను బ్రహ్మమం దర్పణ మొనర్తురి
జ్ఞానేంద్రియంబులను సంయమాగ్నులను శ
బ్దాదివిషయము లింద్రియాగ్నులను వ్రేల్చెదరు
సర్వేంద్రియప్రాణ సముదాయకర్మలను
జ్ఞానదీపిత మాత్మసంయమాగ్నిని వ్రేల్తురి
ద్రవ్యయజ్ఞంబులను తపోయజ్ఞంబులను
నొనరింతు రితరులను యోగయజ్ఞంబులను
స్వాధ్యాయ మనుజ్ఞానయజ్ఞంబు సంశ్రిత
వ్రతులు యతివరులు సమ్మతి సల్పుచుందు రిల

ప్రాణంబు నందున నపానం బపానమునఁ
బ్రాణంబు వేల్చెదరు ప్రాణావరోధకులు
ప్రాణముల వేల్చెదరు ప్రాణముల నాహార
నియమంబు గలవారు నిష్కల్మషులు వీరు

శ్లో॥ 31-42 16 మాత్రలు

యజ్ఞశిష్టామృతము భుజించి బ్రహ్మను సనాతనునిఁ బడయుదురు వారు
యజ్ఞవిముఖునకు నిహసుఖమే లేనప్పుడు పరలోకసౌఖ్యమెక్కడ?
బహుముఖములు యజ్ఞంబు లన్నియును బ్రహ్మముఖప్రకటితములు
సుమ యీ
రహస్య మెఱిఁగినవారె మోక్షసామ్రాజ్య మేలుటకు నర్హు లయ్యెదరు
ద్రవ్యయజ్ఞంబుకంటెను శ్రేయోదాయకంబు జ్ఞానయజ్ఞ మర్జున!
కర్మవాహినులు జ్ఞానజలధిలో గడకు వచ్చి చేరి విశ్రమించును.
ప్రణిపాత పరిప్రశ్న సేవలను ప్రసన్నులుగ గురువులఁ జేసికొనిన
వానికి నుపదేశింతురు జ్ఞానము జ్ఞానులు తత్త్వజ్ఞులుబ్రహ్మవిదులు
ఇట్టిపరోక్షజ్ఞానము వడసిన నింక వ్యామోహమెన్నఁడు జెందవు
భూతముల నెల్ల గాంచు చుండెదవు పూర్ణముగా నాత్మను నాయందును.
పాపాత్ముల కందఱకును మించిన పాపి వైన నౌదువు గాక వినుము,
జ్ఞాననౌక నాశ్రయించి పాపపుఁ గడలి ననాయాసముగఁ దరింతువు.
మండు నగ్ని యింధనమ్ములను భస్మ మొనర్చెడు విధమున జ్ఞానాగ్ని
సర్వకర్మలను దత్క్షణమే భస్మముగాఁ జేయును నిశ్శేషముగా
జ్ఞానతుల్య మగుపవిత్రవస్తువు జగతియందుఁ గానరాదు దానిని
స్వీయముగఁ గనఁ దగుఁ దనయందే యభ్యాసయోగ బలమునఁ
దగువ్యవధిని
తత్పరుండు సంయతేంద్రియుఁడు శ్రద్ధావంతుండే పొందును జ్ఞానము
జ్ఞానము పొందిన వెంటనే పరమశాంతియుఁ జేకూరును నిశ్చయ మిది

జ్ఞానవిహీనులు శ్రద్ధారహితులు సంశయాత్ములు వినాశ మొందెదరు:
సంశయాత్ములకు నిహపరములలో సౌఖ్యములే దిఁక శాంతి యెక్కడిది?
సన్యసించి కర్మలు యోగంబున సంశయముల ఛేదించి జ్ఞానమున
నాత్మయందు నిలుకడ గలవానిని నంటవు కర్మలు బంధింప వెపుడు
జ్ఞానాసి న్నిహృదయస్థము, లజ్ఞానసంజనిత సంశయంబులను
ఛేదించుమ యోగం బాశ్రయించి శీఘ్రంబుగ లే! లెమ్ము! భారతా!

## పంచమాధ్యాయము

## కర్మసన్యాసయోగము

శ్లో॥ 1. 14 మాత్రలు

కర్మలను త్యజియించు మందువు కర్మయోగము ప్రశంసింతువు
సాంఖ్యయోగంబులను శ్రేయస్కరసుమార్గం బొకటి చెప్పుమ
యనుచుఁ బ్రాధేయపూర్వకముగ నడుగు పార్థున కిట్లనెను హరి

శ్లో॥ 2-7 16 మాత్రలు

కర్మయోగమును సాంఖ్యయోగమును గల్యాణమునే గూర్చుచుండు నిఁక
కర్మసాంఖ్యయోగోభయములలోఁ గర్మయోగమే విశిష్టము సుమా!
రాగద్వేషంబులు రెంటిచే విరహితుఁడు వాఁ డెపుడును సన్యాసియ
నిర్ద్వంద్వుఁడు బంధంబులనుండి వినిర్ముక్తుం డతిసులభంబుగ నగు
మూఢులు సన్యాసకర్మయోగంబులు వేర్వేరుగ (గాంతురు, జ్ఞానులు
తద్భిన్నులు, రెంటిలోన నే యొకదాన స్థిరపడిన ఫల మొక్కటియే
సాంఖ్యయోగమునఁ బొందుఫలంబే సంప్రాప్తం బగు కర్మయోగమున

కర్మయోగజ్ఞానయోగముల నొక్కటిగఁ గనువాఁడె నిజము గనువాఁడు
యోగసిద్ధిలేనివాని కెన్నఁడు నొనఁగూడదు సన్న్యాసము పూర్తిగ
యోగయుక్తుఁ డగుమౌని పరమాత్మయొద్ద కేఁగఁ గలఁ డతిశీఘ్రంబుగ
విశుద్ధచిత్తుండును జితేంద్రియుఁడు విజితాత్ముండును యోగయుక్తుఁడును
సర్వభూతముల నాత్మదృష్టిఁగను సజ్జనుఁడు కర్మ నల్పుచు నంటఁడు.

శ్లో॥ 8–10 10 మాత్రలు

చూచుచును, వాసనలు చూచుచును, నడచుచును,
వినుచును, స్పృశించుచును, దినుచు, శ్వాసలు గొనుచు,
మాటలాడుచు, నిద్ర మఱుగుఁ జేరుచు, నిచ్చి
పుచ్చుకొనుచును, గనులు మూయుచును దెఱచుచును,
నింద్రియార్థములందు నింద్రియంబులు దిరుగు
చున్న వవ్వానినేఁ జూతు నని సుజ్ఞాని
యాసక్తి లేక బ్రహ్మార్పణంబుగఁ గర్మ
లాచరించుచు నంటఁ డబ్జ మంబువులవలె

శ్లో॥ 11–14 16 మాత్రలు

మనోబుద్ధికాయేంద్రియములచే మమకారము విడిచి యాత్మశుద్ధికి
యోగులు దమకర్మల నన్నింటిని నొనరింతురు కేవల మనంగులై
యోగికర్మ ఫలములు విడిచి శాంతియుక్తుఁడై పరబ్రహ్మను గాంచును;
కాముకుడుకి కర్మఫలము లాసించు కారణమున బంధమునఁ దగుల్కొను
జితేంద్రియుం డగుదేహిమనసున త్యజించి కర్మలు నవద్వారపురిని
సౌఖ్యంబుగ నుండును గర్మలు దా సల్పక యితరులఁ బ్రేరేపింపక.
ప్రభువుచేత నెన్నఁడు సృష్టింపం బడ వీలోకులకర్మలు, కర్తృ
త్వం బా కర్మలఫలసంయోగము, స్వభావవశమునే గల్గును నవి.

శ్లో॥ 15-16 14 మాత్రలు

బుద్ధి యజ్ఞానంబు వలన విమోహ మొందెడు కారణంబున
పుణ్యపాపఫలంబు లొసఁగెడు పురుషుఁ డింకొకఁ డని భ్రమింతురు.
జ్ఞానమే యజ్ఞానమును నాశనము సేయును నట్టియాత్మ
జ్ఞాన మాదిత్యునివిధమునఁ బ్రకాశ మొందగఁ జేయు బ్రహ్మను.

శ్లో॥ 17-26 16 మాత్రలు

ఆత్మకు బుద్ధింద్రియము లర్పించి యాత్మనిష్ఠ లా యాత్మవరులు పున
రావృత్తిరహితపరమపదంబును నందెద రా నిర్ధూతకల్మషులు
విద్యావినయంబులతో నొప్పెడు విప్రునందు గోవున, నేనుంగున,
శ్వానమునందును, శ్వపచునియందును సమదృష్టినిఁ గలవారు పండితులు
సామ్యావస్థస్థితమానసు లీ జన్మమునంద జయింతురు భవమును
బ్రహ్మమునందే స్థితులై యుందురు, బ్రహ్మ సమము నిర్దోషమగుటచే
ప్రియము చేకుఱిన సంతసింప రప్రియము వాటిలిన దుఃఖము గాంచరు
విజ్ఞానులు స్థిరబుద్ధులును బ్రహ్మవిదులు బ్రహ్మనిష్ఠ లైనవారలు
విషయసుఖాసక్తి సంపూర్తిగా విడిచి యాత్మయందే రమియించుచు
నక్షయానంద మనుభవింత్రు బ్రహ్మయోగయుక్తుల నవరతమువారు
విషయభోగసంజనితసుఖంబులు విపరీతంబులు దుఃఖజనకంబు
లాద్యంతంబులు గలవి వానియం దానందము గాంచరు విద్వాంసులు
శరీరంబు రాలక మునుపే తనసామర్థ్యంబునఁ గామక్రోధోఁ
ద్భవవేగముల సహించి సుఖ మొందువారె నరవరులు పుంగవులు
అంతస్సుఖు లంతరారాములును, నంతర్జ్యోతులు, బ్రహ్మనిష్ఠులును
బహ్మనిర్వాణమును బొందెద రా బ్రహ్మీభూతులు యోగివరేణ్యులు
సర్వభూతహితరతులు జితాత్ములు సంశయరహితులు క్షీణకల్మషులు

బ్రహ్మనిర్వాణమును బొందెద రా బ్రాహ్మీభూతులు ఋషివరేణ్యులును
కామక్రోధరహితులు బ్రహ్మసాక్షాత్కారము గాంచిన యతచిత్తులు
బ్రహ్మనిర్వాణమును బొందెద రా బ్రాహ్మీభూతయతివరేణ్యులు(ను

శ్లో॥ 27-29 10 మాత్రలు

విషయభోగాసక్తి వెలుపల నిరోధించి,
భ్రూమధ్యమందు( జూపును స్థిరముగా నుంచి,
నాసికాపుటముల న్నడుచు ప్రాణాపాన
వాయువుల, బట్టుకొని వాని సమముగ నుంచి
సర్వాశుభంబులకు స్థానమైనట్టి యి
చ్ఛాక్రోధభయములను సర్వదా త్యజియించి,
బుద్ధీంద్రియమనముల( బూర్తివశమున నుంచి,
మునిముముక్షువు సదా ముక్తి కౌగిలి నుంచి
సర్వయజ్ఞఫలంబు, సర్వము తపఃఫలము
సాంతముగ భుజియించు సర్వభూతంబులను
సస్నేహముగ( జూచు, సర్వలోకేశు(డుగ
సజ్జను(డు న న్నెఱి(గి శాంతిధామము పొందు.

# షష్ఠాధ్యాయము

## ఆత్మసంయమయోగము

శ్లో॥ 1-6 10 మాత్రలు

అగ్నికార్యము వదలు నతఁడు సన్న్యాసి కాఁ
డన్నికర్మలు విడిచి నంత యోగియుఁ గాఁడు
కర్మఫలముల నెల్లఁ గాంక్షించకయ యెవఁడు
కర్మ సల్పునొ వాఁడె గద యోగి సన్న్యాసి
సన్న్యాసయోగముల సంజ్ఞ లొకటే సుమా!
సంకల్పరహిత మగుస్థానంబె యోగంబు
సాధకుఁడు మౌని నిష్కామకర్మ యొనర్చు:
సాధించి సంయమియు సంకల్పశూన్యుఁ డగు
నింద్రియార్థము లెల్ల నిచ్ఛగించనివాఁడు,
కర్మలన్నిటియందుఁ గాంక్షతీఱినవాఁడు,
సర్వసంకల్పములు సన్న్యసించినవాఁడు
నారూఢయోగి యని యనిపించుకొను సుమా!
ఉద్ధరించంగ వలయును నాత్మచే నాత్మఁ
బతన మెన్నఁడు చేయవలదు తన్నుదాను
నాత్మయే బంధు వగు నభ్యున్నతిం గొన్న
నాత్మయే శత్రు వగు నది క్రిందపడి యున్న
నాత్మను జయించుచో నది మిత్ర మగు నీకు
విజయ మది పొందెనా వేధించు శత్రు వై
యాత్మసంయమము నీ కధికకర్తవ్యంబు
యది సిద్ధి యైన నీ కన్నిసిద్ధులు గల్గు.

శ్లో॥ 7-17 16 మాత్రలు

జితాత్మకుఁడును ప్రశాంతచిత్తుఁడును శీతోష్ణంబుల సుఖదుఃఖముల
మానావమానములయందేని సమాహితుఁడై బ్రహ్మముననే నిల్చు
జ్ఞానవిజ్ఞానపరితృప్తుండును సమలోష్టోపలకాంచనుండు, విజి
తాత్ముండును కూటస్థుండును నగునట్టివాఁడు యోగారూఢుఁడనంబడు
సజ్జనులను బాపాత్ముల, మిత్రుల, శత్రుల, సుహృదుల మధ్యస్థుల ను
దాసీనుల బంధువుల ద్వేషుల సదా సమముగఁ గను యోగియ శ్రేష్ఠుఁడును
నాశాపరిగ్రహములు విడిచి యేకాంతంబందు రహస్యస్థలమున
ననవరతముగాఁ జేయవలెను నాత్మానుసంధానమును యోగివరుఁడు
నత్యుచ్చము నీచంబుగాని చేలాజినకుశోత్తరంబు స్థిరంబగు
నాసనంబు స్థాపించి శుద్ధప్రదేశంబున నాసీనుండై చి
త్తైకాగ్రత నింద్రియనిగ్రహుడై ధ్యానింపవలె మనఃశుద్ధికి నై
చక్కఁగఁ గాయము శిరము కంఠం బచలముగాను ధారణఁ జేసియుఁదన
ముక్కుకొనను జూచుచు స్థిరముగనే దిక్కుఁ గనక సంసారవిషయముల
చింత లెల్ల వీడి నిర్భయుండై స్థిరబ్రహ్మచర్యవ్రతస్థుఁడై
చిత్తము వశపఱిచి దాని నాకే దత్తపఱిచి నన్నే ధ్యానించెడు
సంతతంబు నాయందే నిల్చి నిరంతరంబు నన్నే ధ్యానించుచు
శాంతము నిర్వాణరూప మగుమత్స్థానము వొందును నియతమానసు
డతిగాఁ దినువానికి ననశనునకు నతినిద్రాపున కతిజాగరునకు
నలవడ దీ యోగ మెంత చేసిన, నబ్బ దేకాంత మెప్పు డాతనికి
మితాహారునకు గర్మలయందును మితాచరణఁ గల్గినట్టివానికి,
మితనిద్రయుఁ గల్గినవానికిని స్థిమితమతి కీ యోగము దుఃఖహరము

శ్లో॥ 18, 19 14 మాత్రలు

ఎపుడు చిత్తము స్వవశమగునో, యెల్లకోరిక లుపశమించునో,
యెప్పు డాత్మస్థితి లభించునో, యప్పు డాతఁడు యోగి యనఁబడు

గాలి లేని స్థలమున దీపపుఁగళికవిధమున నియతచిత్తుఁడు
గదలకయ తనయాత్మయందునఁ గ్రాలువాఁడే యోగి యనఁబడు.

శ్లో॥ 20-23

12 మాత్రలు

ఆత్మకు నుపరతి యోగాభ్యాసమున లభించు నెచట
నాత్మయందు నాత్మనుఁ గని యాత్మయ రమియించు నెచట,
నాత్యంతికసుఖానుభవ మతీంద్రియు దెలిఁగు నెచట
నిత్యస్థితి గల్గిన వానికిఁ జ్యోతిలే కుండు నెచట,
లాభంబుల కెల్ల బరమ లాభము సమకూరు నెచట,
దుఃఖము లొక్కుమ్మడిఁ బై దొరలినను జలింపఁ డెచట,
నట్టిదుఃఖహరము యోగ మని చెప్పం బడు, దానిని
నభ్యసింపవలయు నిశ్చయాత్ముఁడు ధీరమనస్కుఁడు.

శ్లో॥ 24-30

16 మాత్రలు

సంకల్పజనితకాంక్షలు నిశ్శేషముగా సర్వమ్ములును ద్యజయించి
మనసుచేత నాయింద్రియములకు సమస్తవిషయములనుండి
ధైర్యయుక్తబుద్ధిచేత నా చేతస్సును గ్రహియించి మెల్లమెల్లన
నాత్మయందు స్థిరపఱిచి యేమియును నాలోచింపకయే యుండవలయు
నస్థిరచంచలమానసంబు బాహ్యముఖంబై పరుగెత్తఁ జూచుతఱి
నా వెంటనె దానిని నిరోధించి యాత్మవశము గావింవవలయు నిఁక
విక్షేపకల్మషంబు లన్నియును విడిపోవును చిత్తము ప్రశాంత మగు
బ్రహ్మకారుం డైన నా యోగి పరమోత్తమ మగుసుఖమును బొందును
సతతం బాత్మధ్యానమువలన విగతకల్మషుఁడై బ్రహ్మయుక్తుఁడై
యతిసులభంబుగఁ బరమానందం బనుభవించు నా యోగిపుంగవుఁడు
సర్వభూతములయందుఁ దన్ను నా సర్వప్రాణిసమూహంబును దన
యందును వీక్షించుచు నుండెడు నాతఁడు సమదర్శనుఁ డతఁడే యోగియు

నన్నే యంతటఁ దిలకించు నతఁడు నాయందే యంతయుఁ జూచు నతఁడు
ననుఁ గూడియ యెపు డుండువాని నెన్నండును నే విడిచి యుండ నోపఁను

శ్లో॥ 31-32 14 మాత్రలు

అన్ని భూతంబులను వెలిఁగెడు నన్ను నేకస్థునిగఁ గొల్చుచు
నన్ని వ్యవహారములు సేయుచునున్న నాయం దాతఁ డుండును.
సుఖము దుఃఖము తనకువలెనే చూచు నితరులయందు సమభా
వమున నెవ్వం డట్టియోగియ వఱలు సర్వశ్రేష్ఠుఁడై యన
వాసుదేవునిఁ గూర్చి సంశయవాక్యములఁ బార్థుఁడిటు లనియెను.

శ్లో॥ 33-36 12 మాత్రలు

నీవు చెప్పు నీ సమత్వభావయోగమున మనంబు
నిలువ దయ్యా! స్థిరముగఁ జంచలత్వమున మధుసూదన!
వశముగాదు నిగ్రహింప వాయువుఁ బోలెడుదానిని
బలమైనది దృఢ మతిచంచలము ప్రమాథి యది కృష్ణ!
యను కుంతీతనయునకా హరి యిట్టులు బదు లాడెను.
నిస్సంశయము మనము దుర్నిగ్రహ మతిచంచలంబు
వైరాగ్యాభ్యాసంబుల వశ మగు నది మహాభుజా!
యాత్మను గెలువని వానికి నతికష్టం బీయోగము
ప్రయత్నమున జితాత్మునకుఁ బట్టువడు నుపాయంబున
నని చెప్పెడు కృష్ణు మరల నడిగె నర్జునుం డిట్టులు
శ్రద్ధ కలదు కాని మనసు జయింపంగ నేర డట్టి
యోగభ్రష్టుఁడు విచలితుఁ డొందు నెట్టిగతినిఁ? గృష్ణ!
బ్రహ్మభావమున సుస్థిరపడని విమూఢాత్మకుఁ డీఁక
నిహపరంబులకుఁ గాక నశించున? ఛిన్నాభ్రమువలె
నీ నా సంశయమును దొలగింపుము సంపూర్ణంబుగ

నీవు గాక యితరు లెవరు నివారింపఁ గలరు దీని
నని యను విజయునిఁ గూఱిచి యనెఁ గృష్ణుం డీ విధమున

శ్లో॥ 40-47 16 మాత్రలు

కల్యాణముఁ గూర్చునట్టి యీ యోగమార్గమునఁ బయనించు నాతనికి
నేలోకంబున లేదు వినాశం బిఁక దుర్గతిమాట చెప్ప నేటికి?
పుణ్యలోకముల వేలయేండ్లు సుఖభోగంబుల ననుభవించి చివరకు
శ్రీసంపదలం దులదూఁగునట్టి శిష్టాచారునిగృహమునఁ బుట్టును.
అథవా బ్రహ్మజ్ఞులు యోగులకుల మందే నేరుగ జననం బొందెడు
నీ లోకంబందు వెదకి చూచిన నిట్టిపుట్టు వతిదుర్లభంబు గద!
పూర్వజన్మవాసనవలన యోగబుద్ధి తనకునై తానే పుట్టును
పూర్వసంస్కార బలమున నాతఁడు పూర్ణసిద్ధికిఁ బ్రయత్నము సల్పును.
పూర్వాభ్యాసవశంబుచేతనే భోగవశుండును గాక జిజ్ఞాసు
వతిక్రమించును గర్మమార్గము నందుకొనును జ్ఞాననిష్ఠ వెంటనె
విజితమానసుఁడుఁ, బ్రయత్నశీలుఁడు విగతకల్మషుడు, యోగివ
రేణ్యుఁడు
బహుజన్మార్జితకృషివలన సిద్ధివడసి బ్రహ్మపద మందుకొను దుదకు
తాపసు లందఱికంటెను నధికుఁడు దాటిపోవుజ్ఞానులను సహితంబు
కర్మిష్ఠుల నుత్తముండు నాతఁడు కావున యోగివి కమ్ము ధనంజయ!
సర్వవిధంబుల మనోబుద్ధులను సమర్పించి శ్రద్ధతోడ నన్నే
భజియించెడువాఁడు యోగిగుణమున వరిష్ఠుఁడని నేఁ దలంతు నర్జున!

## సప్తమాధ్యాయము

## జ్ఞానవిజ్ఞానయోగము

శ్లో॥ 1-3 12 మాత్రలు

నా ప్రాపుననే నిల్చియు నన్నే మనమున నిల్పియు
సమయోగమునఁ గొల్చి నిస్సంశయముగ సమగ్రముగ
ననుఁ గనుగొనుమార్గ మిపుడు వినిపించెద నవధరింపు;
మని భగవానుం డపు డర్జునునకై ప్రబోధించెను
దేనినెఱింగిన నింకేదెని యెఱుఁగఁ బనిలే దా
యనుభవసహితజ్ఞానంబంతయు నీ కెఱిఁగించెద.
యత్నించును సిద్ధికై సహస్రంబులలో నొకఁడా
సాధకులం దేయొకఁడో సాధించును నా తత్త్వము

శ్లో॥ 4-6 16 మాత్రలు

పరావరము లని రెండుగ నాయీ ప్రకృతి విభజితం బని తెలిసికొనుమ;
భూమ్యాదిసూక్ష్మభూతపంచకము, బుద్ధిమనోహంకారములు మూడు
నపరా ప్రకృతిగ వ్యవహరింపఁ బడు నన్యము పరాప్రకృతిజీవం బది
ప్రాణుల నెల్లను ధారణ సేయును ప్రాణరూపమున మహానుభావా!
భూతము లన్నింటికినిం గారణభూత మ్మా ప్రకృతి యని యెఱుంగుమ!
యీ ప్రపంచసృష్టిప్రళయములకు నేకైక కారణుఁడ నేనే సుమ!

శ్లో॥ 7-11 10 మాత్రలు

ముత్యములు దారమును బొంది యున్నటు లెల్ల
భూతముల కాధారభూతుఁడను నేను సుమ!
నేనే సుమా యంత నేనే సుమా! వినుమ
నేను గానిది యెద్ది లేనిది యనుచుఁ గనుమ!
రసము జలములఁ, గాంతి రవిశశాంకులయందుఁ,
ప్రణవంబు వేదములఁ బౌరుషము నరులందు,
నాకాశమున శబ్ద, మగ్నిఁ గల తేజంబు.
మట్టిలోపల నున్న మంచిదగు గంధంబు,
జీవరాశుల నున్న జీవంబు, తాపసుల
యందు వెలిఁగెడి తపము నన్ని భూతంబులకు
నాదియు సనాతనం బైనట్టి బీజంబు,
బుద్ధిమంతులయందుఁ బొడము బుద్ధిని నేఁ బ
రాక్రములలోఁ గల పరాక్రమంబును నేను
ధర్మావిరుద్ధమై తనరు భూతసమూహ
కామంబు నేను సుమ! కామరాగవిరహిత
బలవంతులం దున్న బలమంతయును నేను.

శ్లో॥ 12-15 14 మాత్రలు

సత్త్వరాజసతామసంబులు సంభవించును నావలననే
యవ్వి నా వశమందు వర్తిలు నైన వశ్యుడఁ గాను వానికి.
మూఁడు గుణముల భావములచే మోహితంబై యున్నది జగతి
మూఢు లెట్లెఱుఁగుదురు నను సంపూర్ణ నవ్యయు, బరమపురుషుని?
దాటరానిది మాయ నాయది దైవి, యర్జున! త్రిగుణమయి యది;
నన్ను శరణముఁ బొందువాఁడే నాదుమాయ దరింపజాలును.
నాసురీభావాశ్రితులు, మాయాహృతజ్ఞానులు, విమూఢులు
దుష్కృతులును, నరాధములు నను దూఱుదురు పొందఁగల రెట్టులు?

శ్లో॥ 16-23 16 మాత్రలు

ఆర్తులు జిజ్ఞాసులు జ్ఞానులు నర్థార్థులు నలుతెఱఁగులు సుకృతాత్ములు
కీర్తింతురు నను నా భక్తులు మత్కృపకుఁ బాత్రు లైన మదనురక్తులు
సతతయుక్తుఁ డవిరళభక్తుండగు జ్ఞాని వార లందఱ శ్రేష్ఠుం డగు,
నతఁడు నాకు నత్యంతప్రియుఁడు నే నాతనికిం బ్రియతముఁడను సుమ్మా!
వీర లందఱు నుదారులే యైన వేఱులేదు సుమ జ్ఞానికిని నాకు:
నా యుక్తాత్ముం డుత్తమోత్తమం బైనగతి యనుచు నాశ్రయించు నను
బహుజన్మాంతమ్మున జ్ఞాని దలఁచు వాసుదేవుడే సర్వంబనుచును
నట్టిమహాత్ముం డతిదుర్లభుఁ డని యభిప్రాయపడియెద నే నెప్పుడు
స్వభావానుకూలేష్టకామ్యముల సంసిద్ధికినై ప్రకృతిచోదితులు
నజ్ఞానులు నా యా నియమమ్ముల నారాధించెద రితలదేవతల
నెవ రెవ రే యే రూపంబుల భజియింతురో భక్తులు శ్రద్ధోపేతులు,
నచల మైన యా శ్రద్ధ వారలకు నందఁ జేయువాఁడను నేనే విను
మాయా దేవతలను శ్రద్ధ మిగుల నర్చించు నెడలఁ దగుకాలంబున
నీడేర్తును వారల సద్వాంఛల నెల్లవిహితముల, హితముల నేనే
యల్పజ్ఞుల కామ్యకర్మఫలముల నన్నియు నంతములౌఁ బాండవ దే
వతార్చకులు దేవతలఁ గాంత్రు నా భక్తవరులు నన్నే పొందఁగలరు

శ్లో॥ 24-30 16 మాత్రలు

అవ్యయము పరం బుత్తమోత్తమం బవ్యక్తభావ మెఱుగను నేరక
వ్యక్తిత్వముఁ బొందిన వానివలెను వ్యవహరింతు రజ్ఞులు నాయెడలను
నందఱ కగుపడ నేను యోగమాయాచ్ఛాదితుండ నై యుండుటచే
నాకారణమున నీ మూఢలోక మఱుఁడ నవ్యయుఁడ నగు నన్నుఁగాంచదు
భూతవర్తమానభవిష్యంబుల భూతంబుల నెల్ల నే నెఱుంగుదు,
నన్నెఱుంగ గలయట్టివాఁ డర్జునా! లే డీరేడుజగంబులలో,
రాగద్వేషంబులకు మూలకారణము లైన ద్వంద్వములకు వశమై

సర్వభూతములు పుట్టుకతోనే సమ్మోహము చెందును పరంతపా!
పుణ్యకర్మలను జేయుచు సుకృతులు పోనాడి పాపపుంజ మంతయును
ద్వంద్వమోహములనుండి ముక్తులై భజియింతురు న న్నాదృఢవ్రతులు
జరామరణమోక్షార్థు లగుచు మచ్ఛరణాగతులై ప్రయత్నశీలురు
ప్రత్యగాత్మను సమస్తకర్మ నా పరబ్రహ్మయే యని గ్రహియించెద
రధిభూతము నధిదైవంబును నధియజ్ఞంబును నేనే యని యెఱిఁగిన
నిత్యయుక్తుఁ డంత్యకాలమందున నిశ్చయముగ నన్నే పొంద గలఁడు.

# అష్టమాధ్యాయము

## అక్షరపరబ్రహ్మయోగము

శ్లో॥ 1-7 12 మాత్రలు

మధుసూదన! తెలుపుము బ్రహ్మం బెయ్యది? యధ్యాత్మం
బన నెయ్యది? యధిభూతం బన నెయ్యది?
యధిదైవం బనఁగ నేమి? యధియజ్ఞం డన నెవ్వం?
డంత్యకాలమం దెట్లు నియతచిత్తుఁడు నినుఁ గన నగు;
నని యడిగిన నీ విధమున నర్జుననకుఁ గృష్ణుఁ డనియె.
నక్షరంబు పరబ్రహ్మ మధ్యాత్మము ప్రత్యగాత్మ
కర్మభూతభావోద్భవకరస్సృష్టి యనుచు నెఱుఁగుము.
అధిభూతము క్షరభావం బధిదైవము పురుషుం డగు
నధియజ్ఞుఁడ నే నంతర్యామిని దేహభృతాంవర!
మరణకాలమందున నన్ను స్మరించుచుఁ దనువు విడుచు

వానికి లభియించును నా స్వరూపంబు నిశ్చయ మిది
భావ మెద్ది కలదో కళేబరము విడిచి చను నపుడా
భావపు సంస్కారముచే వచ్చును తను వా రీతిది
సర్వకాలముల మ దనుస్మరణ పీడకయు యుద్ధము
సేయుమ; మత్పరులు నన్నుఁ జేరుదు రిది నిజము నిజము

శ్లో॥ ౯-10 16 మాత్రలు

సర్వజ్ఞుని, సూక్ష్మాతిసూక్ష్మునిన్ సర్వనియామకు చింత్యరూపుని,
సర్వాధారునిఁ బురాణపురుషుని, సకలసృష్టిసంరక్షణతత్పరు,
నజ్ఞానాంధతమనస్సున కందక నవ్వల వెలిఁగెడు సూర్యప్రకాశు,
నంత్యకాలమున భక్తియుక్తుఁడై, యనన్య మనమున యోగబలంబున,
భ్రూమధ్యంబునఁ జక్కఁగఁ బ్రాణము పొందుపఱిచి సంస్మరించు
చుండునా
పొందు నతఁడు సర్వశ్రేష్ఠుం డగుపురుషుని, దివ్యుని, నా పరమాత్మను

శ్లో॥ 11-13 12 మాత్రలు

అక్షర మని వేదవిదులు ననుచుందురు నెద్దానిని,
వీతరాగులును యతులు ప్రవేశించెద రెద్దానిని,
బ్రహ్మచర్యదీక్షఁ గాంత్రు పడయుట కెద్దానిని, యా
పరమపదము సంగ్రహముగ, బ్రవచించెద వినుము దాని
నింద్రియముల నిరోధించి, హృదయంబున మనం బుంచి,
ప్రాణములు శిర మెక్కించి, వరబుద్ధి సమాధిఁ బెంచి,
పరబ్రహ్మవాచక మగు ప్రణవంబును జపియించుచు,
దేహము త్యజియించి వెడలుదేహి పొందుఁ బరమగతిని
సంతతము నంతసమున స్మరియించెడు స్థిరచిత్తుఁడు
నిత్యయుక్తుఁ డగుయోగికి నేను సులభముగఁ జిక్కుదుఁ

బరమసిద్ధిపురుషులు మత్ప్రాప్తిని వడసినమహాత్మ
లశాశ్వతము, దుఃఖాలయ మైన పునర్జన్మ గనరు.
బ్రహ్మాదులు భువనంబులు వచ్చుచుఁ బోవుచు నుండును;
పునర్జన్మలేదు నన్నుఁ బొందువాని కెన్నఁటికిని
చతుర్ముఖబ్రహ్మకు యుగసహస్ర మొకపగ లంతయు
రాత్రిఁ దీనిఁ గనిన దివారాత్రంబుల స్థితి దెలియును.
అవ్యక్తము నుండి వత్తు రందఱహము రాఁగానే
కాంతురు ప్రళయంబు రేయి కాఁగా నవ్యక్త మద్ది.
భూతగ్రామం బియ్యది పుట్టు గిట్టు మరల మరల;
జన్మించును దినమున నాశన మొందును రాత్రియందు
నవ్యక్తాతీతుఁ డతం డనజ్ఞానసగోచరుఁడు,
సనాతనుం డాద్యుండును సత్స్వరూపుఁడును శ్రేష్ఠుఁడు
సర్వభూత సర్వనాశ సాక్షియై సదా వెలుంగు.
నవ్యక్తం బవ్యయ మది యక్షరము పరమగతి యా
పరంధామమును బొందినఁ దిరిగి వచ్చుట లే దింక
నెవనియందు భూతవితతి యిమిడి యున్నదో సర్వం,
బెవనిచేత వ్యాప్తమైన దీవిశ్వం బెల్ల నట్టి
పరమపూరుషుం డనన్యభక్తికి మాత్రము లభ్యుఁడు.

శ్లో॥ 23-26 14 మాత్రలు

యోగి కావృత్యనావృత్తుల యోగములు సమకూర్చు మృత్యువు
వేళలను నీకు భరతర్షభ! వివరముగ దెల్పెదను విను మిఁక,
నగ్ని దివసము శుక్లపక్షం బాఱుమాసము లుత్తరాయణ
కాలమునఁ గాలంబు చేసిన జ్ఞాని బ్రహ్మంబునే పొందును
పొగయు రాతిరి కృష్ణపక్షంబు షాణ్మాసికదక్షిణాయన
సమయమున సమయ యోగిజనము చంద్రుఁ జేరి తిరిగి జనింతురు

శాశ్వతము మారద్వయం బీ జగతిలో శుక్లకృష్ణం బని
యొకటి పునరావృత్తిరహితం బొకటి పునరావృత్తిసహితము

శ్లో॥ 27,28 16 మాత్రలు

ఈ మార్గము లెఱిగిన యోగివరుం డెన్నండును సమ్మోహము జెందఁడు
గాన సదా సర్వకాలముల యోగమార్గమున బయనింపుము పార్థా!
వేద యజ్ఞ దాన తపములకంటెను విలక్షణ మైన దీ పుణ్యఫలం
బాదికారణం బైనపరమపద మందుకొనును యోగి యీ జ్ఞానమున

## నవమాధ్యాయము

## రాజవిద్యా రాజగుహ్యయోగము

శ్లో॥ 1-6 16 మాత్రలు

బోధించెద నీ కిప్పుడు కుంతీపుత్రా! గుహ్యతిగుహ్యమును వి
జ్ఞానసహిత జ్ఞానంబును నది సంసారభేదక మసూయారహితా!
రాజవిద్య రాజగుహ్యము పవిత్రం బుత్తమోత్తమం బవ్యయ మది
సాధనకున్ సుఖకరంబు ప్రత్యక్షానుభవయోగ్య మైన ధర్మ్యంబు
ఈ ధర్మ్యంబున శ్రద్ధాభక్తు లొకించుకేనియును లేని పూరుషుఁడు
మృత్యుసంసారమార్గమునందే మిక్కిలి వ్యథపడు నన్నుఁ బొందఁ డెపుడు
నవ్యక్తాకారుండ నీ జగం బంతయు నావలన నిండియున్నది.
భూతరాశి కాధారుఁడ నా కా భూతము లాధారంబులు కా విఁక
భూతంబుల సృజియింతును నే నా భూతంబుల భరియింతుఁ బోషింతు

భూతంబులలో మాత్రము లే నా భూతంబుల నాయందును లే వీఁకఁ
జూడు మిదియ నా యీశ్వరీయ మగు చోద్యకరం బగు యోగమహిమ

శ్లో॥ 7-10 12 మాత్రలు

కల్పాంతమున మత్ప్రకృతిగత మగు సర్వభూతములుఁ
గల్పాదిని సృష్టింతును గౌంతేయా మరల వానిఁ
బ్రకృతిని మద్వశమునఁ గొని పదే పదే సృజియింతును
బ్రాణికోటి, జగమంతయుఁ బ్రకృతివశంబై యుండును.
అసక్తుండ నగుటచేత నంట వెట్టికర్మలు న
న్నుదాసీనబుద్ధితోడ నుందును గర్మలయెడలను
చరాచరంబు మదధ్యక్షతయందే కనును బ్రకృతిః
బ్రపంచ మీ హేతువునం బ్రవర్తించుఁ గౌంతేయా!

శ్లో॥ 11-15 16 మాత్రలు

ప్రాణు లందఱకు మహేశ్వరుఁడ నా పరమభావం బెఱుంగని మూర్ఖులు
మానుషరూపము దాల్చిన నను సామాన్యుఁ డంచు నవహేళన సేతురు.
ఆసుర రాక్షస సంపద మూఢు, లాశ్రయించి సమ్మోహమును గాంచి
వ్యర్థపుటాశలు, వ్యర్థపుఁగర్మలు వ్యర్థజ్ఞానము గల్గి భ్రమింతురు,
సర్వభూతకారణు, నను, దైవీసంపదుపేతులు నైనమహాత్ముల
నన్యమనస్కులు నాద్యునిఁగను నవ్యయునిఁగ గ్రహియించి భజించెద రిల
ప్రయత్నశీలురు, దృఢవ్రతులు, నా భక్తులు నా గుణములఁ గీర్తించుచు
నమస్కరించుచు నిత్యయుక్తులై నన్నే ధ్యానింతురు నిరంతరము
కొందఱు న న్నద్వైతభావమునఁ గొందఱుద్వైతంబున, మఱికొందఱు
వేఱు వేఱు దేవతలభావమున విశ్వతోముఖునిఁగను సేవింతురు.

శ్లో॥ 16-19 10 మాత్రలు

క్రతువు నేనే యజ్ఞకర్మయును నేనే సుమ!
స్వధ నేనె సుమ్మ యోషధులు నేనే సుమా!
యగ్ని నేనే సుమా! యాజ్యంబు నేనే సుమ!
మంత్రంబు నేన హోమక్రియయు నేన సుమ!
తల్లియు జగత్తునకుఁ దండ్రియును నేన సుమ!
ధాతయును నేనే పితామహుఁడ నేన సుమ!
వేద్యుండ నేనే పవిత్రుండ నోంకార
రూపుండ వేదస్వరూపుండ నేన సుమ!
భర్తయు గతియు నేన ప్రభువు సాక్షియు నేన,
సుహృదుడ శరణ్యుఁడను సుమ, నివాసము నేన,
సృష్టిస్థితిలయములఁ జేయువాఁడను నేన,
శాశ్వతం బైనబీజముఁ నిధానము నేన;
తపనుండ నై జగముఁ దపియింపఁ జేసెదను,
వర్షమును గురియింతు వారింతు నద్దాని;
మృత్యువును నేనే, యమృతము నేనే సుమా!
సత్తు నేనే మఱి యసత్తు నేనే సుమా!

శ్లో॥ 20, 21 14 మాత్రలు

వేదచోదితకర్మకాండను వెఱ్ఱిగా నమ్మికొని మనుజులు
సోమపానముచేసి పాపవిశుద్ధులై స్వర్గతినిఁ గోరుచు
యజ్ఞములు సేసి పుణ్యంబున నమరలోకము చేరఁ బోదురు;
దివ్యములు దేవభోగంబులు దీర్ఘకాలం బనుభవింతురు;
పుణ్య మొడిసినఁ దిరిగి వారలు భువికి వత్తురు మరల మరలను
గామ్యకర్మ లొనర్చును రాకలును పోకలు గలిగి యుందురు

శ్లో॥ 22-29 16 మాత్రలు

త్యాగబుద్ధితోఁ గూడి సదా నను ధ్యానించుచుఁ గొల్చుచుచునున్న నిత్య
యుక్తుల ననన్యచిత్తుల, భక్తుల యోగక్షేమము వహింతు నేనే.
యితరదేవతల శ్రద్ధమీఱ భజియించెడు భక్తులు సహితము నన్నే
యథావిధిపూర్వకముగాఁ గౌంతేయా యారాధించిన వా రౌదురు సుమ!
సర్వయజ్ఞముల స్వామిని నేనే సర్వయజ్ఞఫలభోక్తను నేనే
తత్త్వం బెఱుఁగని యెడనాశ మొందెదరు భక్తివిహీనులు
దేవతలఁ గొల్చి దేవతలను బితృదేవతలఁ గొల్చి పితృదేవతలను,
భూతములఁ గొల్చి భూతములఁ గాంత్రు, పొందెదరు నన్ను నను గొల్చు వారు

పత్ర పుష్ప ఫల తోయము లైనను భక్తినిఁ బ్రియతాత్మ దర్పించిన
ప్రేమపూరితంబులు వానిని నే బ్రియముతోడ స్వీకరింతు వినుమా
నీ కృత్యంబులు, నీ భోజ్యంబులు, నీ యజ్ఞంబులు, నీ దానంబులు
నీ తపంబులును నా కర్పింపుమ ని న్నవి బంధింప జాలవెపుడు
బంధరూప మగు శుభాశుభకర్మఫలముల నీ తెఱఁగున ద్యజియించి,
సన్న్యాసయోగయుక్తాత్ముం డగు సజ్జనుండు నన్నే పొందఁ గలఁడు
ప్రియులు లేరు ద్వేషులు లేరు నాకు వీక్షించెద నందఱను సమముగా
నన్ను భక్తి సేవించువా రుంద్రు నాయందున నే వారియం దుందు,
నతిదురాచారు డైనను సరె వాఁడనన్యభక్తిని నన్ను భజించిన
సాధు వనుచు నే యనఁబడును నిశ్చయబుద్ధి గలఁ డాతఁడు కావున

శ్లో॥ 31-34 12 మాత్రలు

ప్రతినఁ జేసి చెప్పుదు నా భక్తుఁ డెపుడు నశియింపఁడు.
శీఘ్రమె ధర్మాత్ముఁ డగును జెందును శాశ్వతశాంతిని.
పార్థా! న న్నాశ్రయించి పాపయోను లగువారును,

స్త్రీలు, వైశ్యులు, శూద్రులును చెందెదరు పరమ సద్గతి,
పుణ్యులు విప్రరాజర్షిపుంగవులను జెప్ప నేల?
నశాశ్వత మసుఖము జగం బందుచేత నను భజింపు
నాయందే మనసు నిల్పు! నను( గూర్చి భక్తిసల్పు,
నన్నె యారాధింపుము, నాకు( బ్రణామంబు లిడుము.
నాతోడనె చరియించుము, నను నీ జతగా( గూర్పుము,
నన్నె పొందెదవు సుమ్మ నమ్మ మిదియ నిశ్చయమ్మ

## దశమాధ్యాయము

## విభూతియోగము

శ్లో॥ 1-3 10 మాత్రలు

ప్రేమపాత్రుడవు నీ ప్రియము గోరియ మరల(
బల్కెద మహాభుజా! పరమవచనములు విను;
మాదిదేవతలకు మహర్షులకు నెల్ల నే(
గాన నా పుట్టుకలు గానజాలరు వారు
నిట్లజు, ననాది లోకేశు నను( గనునరుడు
సర్వాఘములు వాసి జ్ఞానియై వెలుగు నిక

శ్లో॥ 4-7 8 మాత్రలు

సత్యము, జ్ఞానము, క్షమ, బుద్ధి, తుష్టి
యసమ్మోహమును, నహింస, సమతయు,

సుఖదుఃఖములు, యశోఽయశంబులును,
జన్మమరణములు, శమదమమ్ములును,
భయాభయములు, తపములు, దానము లి
వన్నిటికి మూల మగుకారణమును;
నావలన గలుగు నానావిధములు
భావములు, సకలజీవరాశులకు
సప్తమహర్షులు, సనకాదులు పూ
ర్వులు నలువురు, మనువులు పదునలువురు
మద్భావులు మన్మానసపుత్రులు,
జగములు వారలసంతానంబులు.
నావిభూతులును నా యోగతత్త్వ
మెఱిఁగిన వారికి నిత్తు నచంచల
సమ్యగ్దృష్టిని, సరగున వారలు
ననుపొందెద రిది నమ్ముము నిజమని.

శ్లో॥ 8-11 16 మాత్రలు

సృష్టికి నే నాదికారణుండను సృష్టిని నడిపించువాఁడ నేనే
యని భావించుచు బుధులు శ్రద్ధతో నారాధించుచు నుందురు నన్నే
నాయందే చిత్త ముంచువారలు ననుఁ బొందిన ప్రాణములు గలవారు
పరస్పరము నా కథలు చెప్పుకొని పరితృప్తు లగుచు నానందింతురు
నన్ను మఱువకుండ నెల్లప్పుడును నన్నే ప్రీతి భజించు భక్తులకుఁ
దత్త్వజ్ఞానం బుపదేశించెద దాన వారు నన్నే పొందఁ గలరు.
వారలయంతఃకరణంబులలోఁ జేరి జ్ఞానదీపములు వెలిఁగించి
యజ్ఞానాంధతమస్సుఁ బాపి నే ననుగ్రహించెదఁ బ్రేమ వారి నన,
విని శ్రీకృష్ణుని యీ ప్రియవాక్కులు వినయ మొల్కఁ బార్థుఁడు వల్కెనిట్లు

శ్లో॥ 12-13 14 మాత్రలు

పరబ్రహ్మవు, పవిత్రుండవు, పరంధాముండవు సుమా! నీ
వాదిపురుషుఁడవు, శాశ్వతుఁడవు, నవ్యయుఁడవు, విభుఁడవు, దివ్యుఁడ,
వజుఁడ వని ఋషు లెల్ల రనియెద రదియ దేవర్షి నారదుఁడును,
నసిత దేవల వ్యాసు లని రిఁక నట్టులే నీవునుం జెప్పితి;
నీవు చెప్పిన దంత కేశవ! నిజ మనుచు నమ్మెదను నే, నీ
దివ్యవ్యక్తిత్వం బెఱుంగరుదేవతలు దానవులు నయితము
భూతపతి పురుషోత్తమా! యో భూతభావన దేవదేవా!
యాత్మచే నాత్మ నెఱుఁగుదువు స్వయముగ నీవే జగన్నాథా!
దివ్యమైనవి నీ విభూతులఁ దెల్ప సంపూర్ణముగ నీవే
యర్హుఁడవు, వానిమూలముననె వ్యాప్తిఁ జెందితి వీ జగంబుల
నెట్లు యోగీశ్వర యెఱుంగుదు నెల్లవేళల నిన్ను? నే యే
భావములఁ జింతింపవలె భగవంత! నా కిప్పు డెఱిఁగింపుమ;
విస్తరంబుగ జనార్దన! నీ విభూతులు యోగసహితంబులు
దనరఁ దెలుపుమ యమృతవాక్కులు వినిన నెంతకుఁ దృప్తి గలుగదు
పార్థుఁ డి ట్లని వేఁడఁగా భగవానుఁ డంతటఁ జెప్పఁ దొడఁగెను

శ్లో॥ 19-20 16 మాత్రలు

అంతులేదు నా దివ్యవిభూతుల కలవి గాదు విస్తరించి చెప్పుట;
కైన నెఱింగింతుఁ గురుశ్రేష్ఠ! ముఖ్యములు గొన్ని విను సావధానమున
సర్వభూతహృదయాంతరాళముల సంస్థితం బైనయాత్మ నేను సుమ!
యఖిలప్రాణుల సృష్టిస్థితులకు నంతమునకుఁ గర్తను నేనే సుమ!

శ్లో॥ 23-24 8 మాత్రలు

ఆదిత్యులయందాది విష్ణువును
తిమిరారిని జ్యోతిర్మండలముల
మరుద్గణంబున మరీచిని నేను

చంద్రుఁడను నక్షత్రంబులలో,
వేదముల సామవేదము నేనే,
వాసవుఁడను దేవతలలోన నే,
నింద్రియముల షష్ఠేంద్రియమును నేఁ
మనస్సు నింద్రియగణమున నేనే
ప్రాణులందుఁ గల ప్రాణము నేనే;
రుద్రులను శంకరుండను నేనే;
యక్షులందున ధనాధిపతి నష్ట
వసువులలోఁ బావకుఁడ నేను, భూ
ధరముల మేరుకుధరమును నేనే,
పురోహితులలో ముఖ్యుఁడు తారా
పతియైన బృహస్పతి నేనే సుమ!
సైన్యాధిపతుల స్కంధుఁడ నేను,
సరస్సులందున సాగరుఁడ నేను,

శ్లో॥ 25-30 10 మాత్రలు

శబ్దముల నోంకారశబ్దంబు నేనే, మ
హర్షు లందఱ భృగుమహర్షి నేనే సుమా!
యజ్ఞంబులందు జపయజ్ఞంబు నేనే సుమ!
యచలంబు లందున హిమాచలంబును నేను;
వృక్షముల నశ్వత్థవృక్షమును, దేవర్షి
గణమందు నారదుఁడ, గంధర్వులం దెల్ల
చిత్రరథుఁడను నేను, సిద్ధులను గపిలుండ,
నుచ్చైశ్రవ మను నమృతోద్భవం బైనట్టి
యశ్వమును, గజములం దైరావతము నేన.
నరులయందఱిలోన నరపాలకుఁడ నేన,
యాయుధంబులను వజ్రాయుధంబును నేన,

ధేనువులలోఁ గామధేనువును నేన, సం
తానకారకుఁడఁ గంధర్వుఁడను నేన సుమ!
సర్పముల వాసుకిని సర్పరాజును నేను,
నాగుల ననంతుఁడను నాగేంద్రుఁడను నేను,
వారిదేవతలయందు వరుణుండ నేను సుమ,
నర్యముఁడ బిత్రుదేవతాళియందున నేను.
యముఁడ నే సుమ్మ సంయముల యందున నేను
బ్రహ్లాదుఁడను దైత్యవంశజులలో నెల్లఁ
గాలంబులకుఁ బరమకాలంబు నేన సుమ!
మృగములన్నింటిలో మృగరాజు నేన సుమ!
పక్షిగణముల నెల్ల వైనతేయుఁడ నేను

శ్లో॥ 31, 32 8 మాత్రలు

వాయువులందునఁ బవనుఁడను శస్త్ర
ధారులందునే శ్రీరాముండను
ఝషములలోన మొసలిని నేనే మ
హానదులన్ జాహ్నవి నేనే సుమ!
యాది నేన మధ్యంబును నేనే,
యంతము సృష్టుల కన్నిఁటికిని నే,
విద్యలం దాత్మవిద్యయు నేనే
వాదులలో సద్వాదము నేనే

శ్లో॥ 33-38 10 మాత్రలు

అక్షరసమామ్నాయ మం దకారం బేను
సమాసములను ద్వంద్వ సమాసము నేన, య

క్షయమైన దగునట్టి కాలంబు నేన, విధి
విధించువాఁడ నే విశ్వతోముఖుఁడ సుమ!
రూపుమాపెడు మృత్యురూపుండ నర్జునా!
పుట్టఁ బోయెడివారి పుట్టుకయు నేనె సుమ!
స్త్రీల రాణించు కీర్తి క్షమా ధృతియు, స్మృతి,
శ్రీ, వాక్కు బుద్ధి, యను శ్రీకరగుణము లేన,
సామములలో బృహత్సామమును ఛందస్సు
లన్నిటను గాయత్రి యనుడు ఛందము నేను
మాసములలో బుణ్యమార్గశీర్షము నేన,
ఋతువులందు వసంత ఋతువు నేనే సుమా!
ఛలములను జూద మనుఛలము నేనే సుమా!
తేజోనిధులయందుఁ తేజమును నేన సుమ!
సత్త్వవంతులయందు సత్త్వంబు నేన సుమ!
వాసుదేవుఁడ వృష్ణివంశంబునం దేను
పాండవులలోననేఁ బార్థుఁడ ధనంజయా!
మునుల వేదవ్యాస మునివరుండను నేను,
గవులందు శుక్రుఁ డను కవిపుంగవుఁడ నేను
దండించు వారిలో దండనీతిని నేను,
జయకాంక్షు లందఱను జయనీతి నేన సుమ,
గోప్యముల మౌన మనుగోప్యంబు నేన సుమ,
జ్ఞానుల దున్నతజ్ఞానంబు నేన సుమ.

శ్లో॥ 39-42 12 మాత్రలు

సర్వభూతసృష్టికి బీజస్వరూపుఁడను వినుమా
చరాచరప్రాణిసృష్టి సకలంబును మద్రూపము

నా విభూతులకు నంతము నాస్తి యంచుఁ దెలిసికొనుమ
యిపుడుఁ గొన్ని నీకు విస్తరించి చెప్పితిఁ బరంతప
యైశ్వర్యోత్సాహకాంతు లధికంబుగ నున్న వస్తు
చయమంతయు మత్తేజోఽంశం బని యెఱుఁగుమ పార్థా!
బహుళముగా నెంతఁ జెపిన ప్రయోజనం బేమి? నీకు
నఖిలసృష్టియందున నే నంశమాత్రమున నిండితి.

## ఏకాదశాధ్యాయము

## విశ్వరూపసందర్శనయోగము

శ్లో॥ 1-4 17 మాత్రలు

ప్రసాదింప నన్ను నీవు చెప్పిన పరమగుహ్యమధ్యాత్మతత్త్వమును
విన్న పిదప నా మోహం బంతయు విచ్ఛిన్నం బైనది పురుషోత్తమ!
విస్తృతముగ సృష్టిప్రళయంబులు వింటినయ్య కమలాక్ష! నీ వలన
విశేషావ్యయమహాత్మ్యంబు నదేవిధముగ గ్రహించితి నే నిప్పుడు
నీవు వర్ణించి చెప్పినట్టులే నీ రూపంబు యథార్థము దానిని
ప్రత్యక్షంబుగ వీక్షించుటకై పరంధామ! కాంక్షించుచు నుంటిని;
చూచుట కర్హత నాకుఁ గలదంచుఁ దోఁచెనేని నాయందు దయయుంచి
చూపుము యోగేశ్వరా! నీ విశ్వరూపము పరమైశ్వర్య మవ్యయం
బని ప్రార్థించెడు పార్థుని గూఱిచి యనియెఁ బార్థసారథి యీ విధమున

శ్లో॥ 5-8 12 మాత్రలు

వీక్షించుము పార్థా! నా వేన వేలు రూపంబులు
వివిధంబులు దివ్యంబులు వివిధాకృతులు వర్ణములు
నాదిత్యులను, వసువులను, నశ్వినులను, మరుద్గణము,
నదృష్టంబు లనేకంబు లాశ్చర్యకరములు గనుమి
సచరాచర జగము సమస్తము. సం కే మైనను నీ
కిష్టంబగు నితరంబును నీక్షించుమి నాయందునఁ
చర్మచక్షువుల ననుగన శక్యము గాదయ్య! దివ్య
దృష్టిని నీ కిపుడు ప్రసాదించెద నా మహిమలు గను.

శ్లో॥ 9-14 16 మాత్రలు

సంజయుండు ధృతరాష్ట్రున కింకను సంగ్రామము సంగతిఁ జెప్పఁదొడగె.
మహారాజ! వెల్లడించి యిట్టులు మహాయోగయోగేశ్వరుండు హరి
విజయునకుఁ బరం బీశ్వరీయ మగు విశ్వరూప సందర్శన మొసగెను.
అనేక వక్త్రము, లనేకనేత్రము లనేకాద్భుతసుదర్శనీయములు
ననేకదివ్యాభరణములతో, ననేకదివ్యోద్యతాయుధంబులు,
దివ్యమైనమాలాంబరంబులును, దివ్యగంధానులేపంబులతో,
సర్వాశ్చర్యమయంబు, దివ్యంబు, సర్వతోముఖం బనంతంబు నగు,
వేయిసూర్యు లొక్కమారు నభమున వెలిగినఁ దోచెడుఁ గాంతిసమం బగు
ప్రకాశమానం బైనతనవిరాడ్స్వరూపదర్శన మొసఁగె మహాత్ముఁడు.
నేకస్థం బైనసకల జగం బనేకవిధములగు రూపములు గల్గి

దీపించెడి దానిని పాండవుండు దేవదేవుని శరీరంబునఁ గని హర్షంబునఁ బులకితగాత్రుండై యాశ్చర్యచకితుఁడై ధనుంజయుఁడు ముకుళితకరుఁడై శిరస్సునువొంచి మ్రొక్కి విశ్వరూపున కిట్లనియెను.

శ్లో॥ 15-19 8 మాత్రలు

విశ్వరూపమును వీక్షించుచుంటి
విశ్వేశ్వరుఁడవు విలసితివంతట;
సర్వ భూతముల, సర్వదేవతల,
సరసిజాసనుని, సకలవిధాతను,
సకల మునీంద్రుల సర్పప్రముఖుల,
దేవదేవ! నీ దేహమున గాంతు,
ననేకబాహుఁడ, ననేకనేత్రుఁడ
వనేకోదరుఁడ వనేకముఖుఁడవు,
నాదిలేదు మధ్యంబులేదు నీ
కంతంబును లే దనంతరూపా!
గదాధరుని, జక్రధరు, గిరీటిని
నంతట వెలిగెడు నఖండతేజుని
నప్రమేయు ననలార్కప్రకాశు
దుర్నిరీక్షుఁ జూతును నిన్నంతట
నక్షరుఁడవు పరమాత్ముఁడ వీవే,
వేదితవ్యుఁడవు, విశ్వనిలయుఁడవు,

సనాతనధర్మ సంరక్షకుఁడవు,
పురుషోత్తమ! నిను బుద్ధిఁ దలంచెద
నాదిశూన్యమధ్యాంతవిహీనా।
యనంతవీర్యా! యనంతభుజ! దీ
ప్తానలముఖ చంద్రాదిత్య నయన।
స్వతేజమున విశ్వ మంతయును దపి
యింపఁజేతు, వీక్షించెదను నిన్ను.

శ్లో॥ 20-25 16 మాత్రలు

వ్యాపించితి వీ వొక్కఁడవే భూమ్యాకాశంబుల నన్నిదిక్కులను;
భీతిఁజెందుచున్నవి త్రిలోకములు భీకరాద్భుతస్వరూపు నినుఁ గని.
సురసంఘంబులు సేరును నీలో, స్తుతిఁ జేతురు కొందఱు భీతాత్ములు,
స్వస్తి యనుచుఁ బల్కెదరు ఋషులు, ఋష్కలముగ సిద్ధులు సన్నుతిఁజేతురు
రుద్రాదిత్యవసువులు, సాధ్యులు, మరుత్తులు, పితరులు, విశ్వాశ్వినులును,
గంధర్వయక్షరాక్షసగణములు గాంతు రెల్లరును విస్మితముఖులై.
బహుబహూదర పాదనేత్రోరు వక్త్రకరాళవిదంష్ట్రలు గల నీ
మహద్రూపమును గని లోకు లేను మహాభయవిహ్వలుల మైతిమిఁ సుమ
యనేక వర్ణంబులు దెఱచిన దీప్తాననములు దీప్తనేత్రములు గల
యాకాశమునంటు నిన్నుఁ గని నే నతి ఖిన్నుఁడనై ధృతిశమలు విడితి
కాలానలసన్నిభంబులగు నీ కరాళదంష్ట్రాననములు గాంచిన
దిక్కు దోఁచదు సుఖముఁ గాన! దేవదేవా! జగన్నివాస! కావు మిఁక.

శ్లో॥ 26-31 12 మాత్రలు

ధరణీపాల సంఘములు ధార్తరాష్ట్రులును భీష్మ
ద్రోణకర్ణు, లస్మదీయదోర్బలవీరవరేణ్యులు
మండునగ్నియందు మిడుతదండు ప్రవేశించు విధము,
సముద్రాభిముఖముగఁ జను సరిజ్జలంబుల పోలికఁ
దమతమనాశముకొఱకై త్వరత్వరగాఁ బరుగెత్తుచు,
దంతంబులలోఁజిక్కిన తలలు చూర్ణమై పోఁగా,
భయంకరకరాళదంష్ట్ర ప్రజ్వలవదనంబులలో
ప్రవేశించుచున్నారలు ప్రముఖులు కౌరవయోధులు.
మండుచున్నముఖములన్ సమస్తలోకములు మ్రింగుచు
నాలుకలను జాఁచి యంత నాఁకుచు నుంటివి స్వామీ!
యిట్టి యుగ్రరూపులు మీ రెవ్వరో తెలియంజెప్పుఁడీ!
ప్రసన్నులగుటకు మీ కివె ప్రణతు లనేకము లొనర్తు
మీ యీ వ్యవహారం బేమియో?నాకు బోధపడదె;
యాదిపురుష మీ సంగతి యంతయు నా కెఱింగింపుఁ
డని సన్నుతి చేయుచున్న యర్జునునకు హరి యి ట్లనె.

శ్లో॥ 32-34 16 మాత్రలు

సవ్యసాచి! లే లెమ్మా! యింక యశమ్ము నీ వశమ్ము చేసికొమ్మా
శత్రువులను దునిమి రాజ్యసుఖములు సమృద్ధమ్ము లనుభవించుకొమ్మా
నిహతులైరి నాచేత నీ వఱకె నిమిత్త మాత్రుండ వీవు గమ్మా!

ాలుఁడ క్షయకరుఁడను, సమస్తలోకనాశమునకును బూనిన వాఁడఁను.
వుపేక్షించి విడిచిన వీరలు నిలువలేరు ప్రాణములతోఁ బోర
ిష్మద్రోణజయద్రథకర్ణులు, వీరులు నాచేఁ జచ్చినవారలు;
ంపుమ దుఃఖంబు మాని వారల, సల్పుమ కదనము గెలుతువు వైరుల.

శ్లో॥ 35-36 14 మాత్రలు

ౌరవపతికి సంజయుం డింకను వచింపగఁ దొడఁగె నిట్టులు;
ేశవుని యీ వచనములు విని కేలుమోడ్చి కిరీటి వడఁకుచు
పణామం బొనరించి కృష్ణునిఁ బల్కె గాద్గదికస్వరంబున.
ేదుకీర్తుణ్ణ జగమునందున నింపె హర్షప్రేమలు, హృశీ
ేశ! యిది నీ మహత్త్వమునకు నెంతయును యోగ్యంబుగాదే!
ియముచే రక్కసులు దిశలను బరువు లెత్తుచు నున్నవారలు;
ద్ధు లెల్లరు సాఁగిలి నమస్కృతు లొనర్చుచు నున్నవారలు.

శ్లో॥ 37-40 12 మాత్రలు

మ్మి చూలికాదివి; పెద్దలకుం బెద్దవు మహాత్మ!
కు నమస్కరింపకయ నిలువఁ గలరః యెవరైనను.
క్షర సదసత్పరా! మహాత్మా! దేవాధిదేవ!
యనంతస్వరూపా పరమాత్మ యో జగన్నివాస!
వు పురాణపురుషుఁడవు, నీవే యాది దేవుఁడవు.
వే యీ విశ్వమునకు నిధానమై యున్నాఁడవు;
ేద్యంబును నీవ సర్వవేత్తవు నీవే స్వామీ!

నీచే నీ విశ్వమంత నిండినది యనంతరూప!
వాయు వగ్ని యముఁడ వీవు, వరుణుండవు, శశాంకుఁడవు,
ప్రజాపతివి నీవే సుమ! ప్రపితామహుఁడవు నీవే
వేనవేలు నమస్కృతు లివియ జగన్నివాస! కృష్ణ!
పదే పదే నే ననేకప్రణామములు సేతు నీకు,
వందనంబు లెదుటినుండి వందనములు వెనుకనుండి
సర్వదిశలవందనములు సర్వస్థిత! సర్వరూప!
హరి యనంతవిక్రమా! యనంతవీర్య శ్రీకృష్ణా!

శ్లో॥ 41-46 16 మాత్రలు

క్షమియింపుమయా! దయామయా! నే సల్పితి నపరాధానేకమయా!
హే!కృష్ణా యాదవ! సఖా! యనుచు నెఱుఁగక నీ మహిమలు ప్రమాదముఁనఁ
బ్రియమునఁబిలచితి నప్పుడు నిను నా ప్రియుఁడ వనుచు నేఁ దలంచితినఁయా!
క్షమియింపుమయా! దయామయా! –
విహారశయ్యాసనభోజనముల వేళలందు నీదు సమక్షంబున
నపహసించి తెన్నెన్నిమారులో యసత్కృతు లెన్నియొ చేసితినయా
క్షమియింపుమయా! దయామయా! –
చరాచరజగంబులకు జనకుఁడవు గురువులకును గురుఁడవు పూజ్యుండవు!
సములులేరు నీ కధికుఁ డెవడు భువ సాటిలేని ప్రతిభాశాలివయా!
క్షమియింపుమయా దయామయా! –
పిత తనపుత్రుని, సఖుఁడు దనసఖుని; ప్రియుఁడుఁ ప్రియురాలి మన్నించెడు
ప్రకియ

దయతో నాయెడఁ బ్రసన్నుఁడ వగుమ దండవత్ప్రణామము సేతునయా
క్షమియింపుమయా! దయామయా! —
అపూర్వరూపము గాంచి మొదట నే హర్షమానసుఁడ నైతిని యిప్పుడు
భయమున వ్యథపడుచుంటిని గావుమి ప్రసన్నార్తిహరుఁడ వీవేనయా!
క్షమియింపుమయా! దయామయా! —
చక్రగదలును కిరీటము గల్గిన చతుర్భుజుని నినుఁ గనఁ గాంక్షించెద
నా రూపంబుననే దర్శనము సహస్రభుజా నా కిప్పింపు మయా
క్షమియింపుమయా! దయామయా!
యనివేడుచున్న నర్జునునకు బదులాడె నిట్టు భగవానుఁడు ప్రియమున

శ్లో॥ 47-51 16 మాత్రలు

దర్శన మొఁసగితి నర్జున! పూర్వ మితరు లెవ్వరుఁగనని విశ్వరూపము
నా మాయచేఁ బరమ మనంతతేజోమయ మాద్య మగువిశ్వరూపము
దర్శన మొసఁగితి నర్జునా!
వేదాధ్యయనము యజ్ఞతపోదానాదిసత్క్రియలచే గనరానిది,
యీవు దప్ప నిం కేనరునకు భువినీక్షింపజాలని విశ్వరూపము
దర్శనమొసగితినరున!
ఇట్టిఘోరరూపంబును గని దుఃఖింపకు సమ్మోహితుఁడవు గాకుము
చతుర్భుజరూపమును గాంచుమ యిదె సంప్రీతుఁడ వగుమ భయముదక్కుమ
సంజయుఁడు బల్కసాగెను ధృతరాష్ట్రమహారాజునకు నింక నిట్టుల;
వాసుదేవు డర్జునునకు నిటులు ప్రదర్శించెను జతుర్భుజరూపం

బాశ్వాసించెను భీతు, సౌమ్యదేహంబు మానుషంబు మరల దాలిచి
మానుషరూపము, మనోహరము సౌమ్యం బైనది దర్శించితిఁ గృష్ణా!
సచేతనుఁడ నైతి మరల నిప్పుడు స్వస్థమానసుఁడ నైతి జనార్దన!
యని పల్కిన యర్జునునకుఁ గృష్ణుఁడు హర్షసమాధాన మిటు లొసంగెను,

శ్లో॥ 52-55 — 12 మాత్రలు

చూచితివి గదా! పార్థా! సుదుర్దర్శ మగురూపము;
దేవతలును దేనిని గనఁ దీవ్రకాంక్షతో నుందురో!
వేదదానతపముల, యజ్ఞాదుల వలనను దేనిని
గాంచు శక్యముగాదో, కన్నులపండువుగ దానిఁ జూచితివిగదా! పార్థా!
ఎఱుగుట, చూచుటయు, ననుభవించుట నాయం దుండుట
యనన్యభక్తునికే తగు ననుభవైకవేద్యుఁడ సుమ!
యసక్తుఁడు నిర్వైరుం డర్పించుచుఁ గర్మ నాకు
నా భక్తుఁడు మత్పరుండు నన్నే పొందును పార్థా!

## ద్వాదశాధ్యాయము

## భక్తియోగము

శ్లో 1 ॥-5 — 12 మాత్రలు

ప్రవిమలభక్తిని నన్నెడఁబాయక కొల్చెడు వారలు,

నవినాశిని నక్షరుఁ దమయాత్మల భావించువార
లెవరు యోగవిత్తములో యెఱిగించుము నాకుఁ గృష్ణ !
యని యడిగిన నర్జునకు ననె భగవానుం డిట్టులు.
నాయ దే మనసునిల్పి, నన్నే స్మరియించు చెపుడు
న న్నతిశ్రద్ధను గొల్చెడు నా భక్తుఁడు శ్రేష్ఠుఁ డు సుమ !
సర్వభూతహితరతులును. సంయములును, సమబుద్ధులు,
సర్వగతుని, కూటస్థు నచంచలుని, ననిర్దేశ్యుని,
నవ్యక్తు, నచింత్యుని, ధ్రువు, నక్షరు ధ్యానింతు రెవ్వ
రట్టివారలును సహితుం బర్థాలు ననుఁ బొందుటకై;
యవ్యక్తోపాసన దేహాభిమానులకుఁ గష్టం,
బవ్యక్తపు మార్గగాము లతిదుఃఖములు వడయుదురు.

శ్లో॥ 6-12 16 మాత్రలు

పరమగతిగ నన్నే దలచుచు, సర్వకర్మలను నాకే యర్పించుచు,
నాయందే చిత్త ముంచి యెప్పుడు నన్నే యనన్యయోగబలంబున
ధ్యానించుచు, నేకాగ్రబుద్ధిని సతత ముపాసించు భక్తుల నెల్లర
నుద్ధరింతు నతిశీఘ్రంబుగ మృత్యు సంసారసాగరమునుండి నీ
మనసును నాయందే నిల్పుము, బుద్ధిని నాయందే ప్రవేశ పెట్టుము,
నివసింతువు నాయందే పిమ్మట; నిస్సంశయమిది నమ్ముము పార్థా !
స్థిరముగఁ గేవలము నాయందు నీ చిత్తము నిల్పఁగఁ జాలని యెడలన్
నభ్యాసయోగమున కై ననుసరె యాకాంక్షించుమ నను బొందుటకై;

యభ్యాసము సేయుట కేనియు నీ వ సమర్థుఁడ వని యనుకొనెదేనియు
జేయుము కర్మలునాకై మాత్రము; చేరగలవు నన్నీ విధంబునను;
అట్లు కర్మ నాకొఱకు సల్పుటకు నశక్తుండ వని యనుకొనెదవేని
సర్వకర్మఫలము లన్ని న న్నాశ్రయించి విడుమ ప్రయత్నించి యైనఁ
నభ్యాసంబున కధికము జ్ఞానము, జ్ఞానముకంటెను ధ్యానము శ్రేష్ఠము;
ధ్యానమునకు మిన్న కర్మఫలసన్యాసము దానను శాంతి లభించును.

శ్లో॥ 13-20 12 మాత్రలు

నా భక్తుడు నాకుఁ బ్రియుడు, నన్నే సేవించు, నతఁడు
ద్వేష మన నెఱుంగఁడు మైత్రికిఁ గరుణకు నాటపట్టు.
అహంకార మమకారము లంటవు వానిని సంతత
సంతుష్టుడు, క్షమగలాడు, సముఁడు దుఃఖ సుఖాదులను,
నిర్జితేంద్రియుం డతిధృఢనిశ్చయుండు, యోగివరుం,
డాత్మమనోబుద్ధులు నా కర్పణంబు జేయువాఁడు
నా భక్తుడు నాకుఁ బ్రియుఁడు
లోకము జంకదు వానికి, లోకులు జంకింప రతని,
హరామర్షభయంబుల కతఁ డెపుడు వివశుఁడు గాడు;
ఆశారహితుఁడు, దక్షుం, డతిశుద్ధు డుదాసీనుడు,
వ్యథల నెల్ల దాటినాడు, వ్యవహరింపఁ బోఁ డాతడు:
నాభక్తుడు నాకుఁ బ్రియుఁడు,
రాగద్వేషములు లేవు రంజిల్లఁడు శోకింపఁడు

శుభాశుభఫలముల కతఁడు సుతరాం పొంగడు క్రుంగఁడు
శత్రుమిత్రులను, శీతోష్ణంబుల సుఖదుఃఖంబుల
మానామానములను సమమనస్కుం, డసంగుఁ డతఁడు,
నాభక్తుఁడు నాకుఁ బ్రియుఁడు
నిందాస్తుతుల సముడు మౌని, సంతుష్టు డెల్లయెడల,
స్థిరమతి యనికేతనుండు, శ్రేష్ఠభక్తుఁ డతిప్రియుఁడు.
శ్రద్ధాభక్తుల నీధర్మ్యామృతంబు గ్రోలువాఁడు,
సర్వస్వము నా కొసంగు సజ్జనుఁ డత్యంతప్రియుడు.

## త్రయోదశాధ్యాయము

## క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగము

శ్లో॥ 1-3 16 మాత్రలు

కేశవా తెలియ బఱచుమ నాకుఁ బ్రకృతి పుఱుషులఁ, క్షేత్రక్షేత్రజ్ఞుల,
జ్ఞాన జ్ఞేయమ్ముల, వానివిశేషమ్ముల నెల్ల విస్తరమ్ముగను
వినిపింపు మనుచు వేడ గిరీటికి వివరింపఁ దొడంగెను భగవానుఁడు
ఈ శరీరంబు క్షేత్ర మని వ్యవహరింప బడును; దీని నెఱుఁగు వానిని
క్షేత్రజ్ఞుఁ డంద్రు తత్వజ్ఞులు, తెలిసికొనుము దీనినిఁ గూలంకషముగ,

క్షేత్రములన్నిటిలోన వెలింగెడు క్షేత్రజ్ఞుడ నేనే సుమ భారత!
క్షేత్రక్షేత్రజ్ఞులజ్ఞాన మనిశ్చితజ్ఞాన, మిది నా మత మెఱుగుమ.
ఈ క్షేత్రం బెట్టిది? యెటువంటి? ద దెట్లు దేనివలన రూప మొందెను?
యెవ్వఁ డా క్షేత్రజ్ఞుఁడు వాని మహిమ యెటువంటిది క్లుప్తముగఁ జెప్పెదను

శ్లో॥ 5-12

12 మాత్రలు

ఋషు లనేకము ల గీర్తించిరి ఛందోగణములు,
బ్రహ్మసూత్రములు నిశ్చిత వాక్యంబుల వర్ణించెను
అహంకారఁబుద్ధులును, మహాభూతము లవ్యక్తం,
బింద్రియములు పదకొం డా యింద్రియార్థములు నైదును,
రాగద్వేషములు, ధృతియుఁ, బ్రాణము సుఖదుఃఖంబు లి
వన్నియుఁ గలసిన క్షేత్రం బనబడు నిది సవికారము
అమానిత్వ, మదంభిత్వ, మార్జవం, బహింసయు, క్షమ,
యాచార్యోపాసన, స్థైర్యం, బాత్మ వినిగ్రహంబు,
నహంకారమును, వైరాగ్యము విషయమ్ముల, శౌచము,
జన్మమరణములయందును, జరావ్యాధులందు గల
దుఃఖమూలకములు గుప్తదోషంబులు గ్రహించుట,
దారాపుత్రగృహాదులఁ దాదాత్మ్యము లే కుండుట,
యనాసక్తి, సమత్వ మిష్టానిష్టప్రాప్తియందు,
నచంచలం బైనభక్తి, యరతి జనసమూహంబుల,
నధ్యాత్మజ్ఞానము, తత్త్వార్థదర్శనం బియ్యవి

యన్నియు జ్ఞాన మనఁబడు దదన్యం బజ్ఞానమగును

శ్లో॥ 13-18

16 మాత్రలు

జ్ఞేయంబును గూర్చి నీ కిప్పుడు జెప్పెదఁ గౌంతేయా-త
జ్ఞానంబువలన బొందెద వమృతత్వంబు బుధవిధేయా !—
అనాదియగు నా పరబ్రహ్మము సదసత్తులకుఁ బరము, —
సర్వతఃపాణిపాదశిరం బది సర్వతోఽక్షిముఖము—
సర్వదిశల శ్రవణంబులు గల దది సర్వసృష్టియందు నిండి యున్నది
అసక్త మన్నిటిభర్త గుణభోక్త యైనను నిర్గుణము, —
సర్వప్రాణుల బహిరంతరములఁ జరియించు నచరము, —
సర్వేంద్రియ గుణాభాస మయ్యును సర్వేంద్రియవర్జితమై యున్నది
దూరస్థం బతిసామీప్య మైనఁ దోఁచ దతిసూక్ష్మము
అన్నిభూతముల విభక్తక మైనది యవిభక్తకము—
భూతంబులఁ బోషించుచు నుండును, భూత సృష్టి లయకారణమైనది.
జ్యోతులన్నిటికి జ్యోతియై తమస్సునకును నది పరము —
జ్ఞానము జ్ఞేయము జ్ఞానగమ్యమది సర్వభూత హృదయస్థితమైనది
క్షేత్రంబును గూర్చి చెప్పితి సంక్షిప్తముగా నీకు । —
జ్ఞానంబును జ్ఞేయంబును క్లుప్తముగాఁ దెల్పితి నీకు । —
మద్భక్తుఁడు దీని నెఱింగినచో మద్భావమునే పొందును పార్థా !

శ్లో॥ 20-24

14 మాత్రలు

ప్రకృతి పురుషు లుభయు లనాదులు ప్రకృతి సంభవములు గుణాదులు

కార్యకారణములకుఁ బ్రకృతియ కర్తయై వ్యవహరించును సుమ
పురుషుఁడే సుఖదుఃఖ ఫలముల భోక్తయై వర్తిల్లు చుండును
ప్రకృతి గుణయుక్తుడై జీవుడు ప్రభవమొందు సదసద్యోనుల
ప్రకృతిగత సుఖదుఃఖములనను భవించుచునుండు సుమ యర్జున!
దేహమున నీ పురుషుఁడు పరుఁడు దేహ, పరమాత్మయును, భర్తయు,
సాక్షిమాత్రుఁడు, భోక్త, పరమేశ్వరుఁడనుచు బ్రఖ్యాతిఁగాంచెను
ఇట్లు ప్రకృతి పురుషుల గుణముల నెవ్వడెఱుగ గలండో యాతఁడు
సర్వవిధ వర్తనుఁడును పునర్జన్మ మొందఁడు ముక్తుఁడై చను

శ్లో॥ 25-27 12 మాత్రలు

ఆత్మను సాక్షాత్కరింతు రాత్మయందు నాత్మచేత
ధ్యానయోగు, లన్యులు సాంఖ్య కర్మయోగముల ద్వార,
యజ్ఞాను లితరుల వలన నాలకించి, యుపాసించి
య మృతులై చరింత్రు శ్రుతి పరాయణులగు నాభక్తులు
స్థావర జంగమ రూపము సర్వసృష్టియును క్షేత్ర
క్షేత్రజ్ఞుల సంయోగము చేతజరుగ భరతర్షభ!

శ్లో॥ 28-31 16 మాత్రలు

నశ్వరంబులగు ప్రాణులయందు ననశ్వరుండు సముఁడై వెలసిన పర
మేశ్వరు నీక్షించువాఁడు నిజముగ నీక్షణములు గలవాఁడని యెఱుఁగుమ
సర్వత్ర నిండియున్న యీశ్వరుని సమభావముతోఁ గాంచుచు దనఁదు
సర్వకార్యములు ప్రకృతిమూలమున జరుగుచుండు నను సత్యముగ్రహించి

యాత్మ నకర్తగ గనువాడేకద యశులు గలవాడని చెప్పందగు
అనేకరూపులదోచు సృష్టిపరమాత్మ విస్తరం బేకస్థంబను
నిశ్చయ జ్ఞాన మబ్బిన యాతఁడు నిల్చుబ్రహ్మమునఁ దద్రూపుండై

శ్లో॥ 32-35 12 మాత్రలు

అవ్యయుండు నిర్గుణుం డనాదియు పరమాత్మ కాన
శరీరస్థుఁడయ్యుఁ గర్మ సల్పఁడు ఫలములనంటఁడు
అంతట వ్యాపించియు సూక్ష్మాకాశం బంటనట్లు
దేహమంతటను నిండియు దేహికర్మలను నంటఁడు
ఒక సూర్యుడు లోకంబుల నొకేసారి ప్రకాశింపఁ
జేయురీతి క్షేత్రజ్ఞుఁడు క్షేత్రంబుల వెలిగించును
ప్రకృతి పురుష భేదంబును ప్రకృతి బంధమోక్షముఁగను
జ్ఞాన చక్షువునకు బ్రహ్మసాక్షాత్కారము లభించు

## చతుర్దశాధ్యాయము

## గుణత్రయ విభాగయోగము

శ్లో॥ 1-4 12 మాత్రలు

పరమోత్తమమైన జ్ఞానము - వినిపింతుఁ గమ్ము

పరంతపా సావధానము—

పరమసిద్ధి గాంచిరి ముని వరులు దానిఁ గనిన యంత
ఈ జ్ఞానంబున మద్సాదృశ్యులు నరులగుదురు మఱి
సృష్టికాలమున బుట్టరు, చేటుగనరు ప్రళయ మందు
బ్రహ్మ మహద్యోని యందుఁ బదిల పఱుతు గర్భంబును
సర్వభూత సముదాయము సంభవమొందును దానను
సర్వయోని సముద్భవము సంసారంబంతటికిని
ప్రకృతి తల్లియగు బీజప్రదుఁడను తండ్రిని నేనే.

శ్లో॥ 5-8 16 మాత్రలు

సత్వరజ స్తమములు మూఁడు ప్రకృతి సంభవంబులు గదా -
ప్రకృతి సంభవంబులు గదా
దేహి యీ మూఁడు గుణములచే బంధింపబడును గదా -
బంధింపబడును గదా
సత్వంబు వినిర్మలంబును ప్రకాశక, మనామయంబు—నందు సు
ఖంబు జ్ఞానంబు పుట్టి శరీరినిఁ గట్టివేయును గదా —
శరీరినిఁ గట్టివేయును గదా
రజము తృష్ణవలన సంభవించును, రాగదూషితంబు-నయ్యది
కర్మ చేయించుచును జీవాత్మను గట్టి వేయునుగదా
జీవాత్మను గట్టి వేయును గదా
పుట్టును దమమజ్ఞాన వశంబున, మోహ కారణంబు—నయ్యది
నిద్రాలస్యప్రమాదముల బంధించునాత్మనుగదా-యది
బంధించు నాత్మనుగదా

శ్లో॥ 9-10

14 మాత్రలు

సత్త్వము సుఖంబులనుగనును రజంబుకర్మలకు జననియగును
జ్ఞానమాచ్ఛాదించి తమము ప్రజనన మొసగు బ్రమాదములఁకును
సత్వతమముల నడఁచిరజమును. సత్త్వరజముల నడచి తమముఁను
రజస్తమముల నడఁచి సత్త్వము రాజిలును సుమ ప్రథానంబై.

శ్లో॥ 11-13

16 మాత్రలు

సర్వద్వారమ్ములు ప్రకాశక స్థానములైయున్నపుడు దేహమున
జ్ఞానంబభివృద్ధి గాంచునయ్యది సత్వ గుణంబని యెఱుగుము పార్థా!
కర్మారంభ ప్రవృత్తి లోభము కర్మఫలాసక్తియు నశాంతియును
బ్రవృద్ధంబు లగుచుండెడు నాస్థితి భారత! రజోగుణంబని తెలియుము
అప్రకాశ ప్రమాదమోహములు, నప్రవృత్తి వృద్ధిపొందు నప్పుడు
తమోగుణము సంచరించు నంచును దలంపు మాస్థితినిఁ గురునందనా!

శ్లో-14-16

12 మాత్రలు

ప్రయాణ కాలమున గుణ ప్రకోపంబు ననుసరించి
దేహి పొందు గతులు నీకుఁ దెల్పెద నిక వినుము పార్థా!
సత్వంబ బభివృద్ధిగాంచు సమయంబున మరణించిన
నూర్ధ్వ లోకగతులు గాంచి యుత్తమ కులమునఁ బుట్టును
రజోవృద్ధికాలమున మరణము పొందు నట్టిఁడు గ
ర్మరుల వెంటగాంచును జన్మంబు మరల గర్మ సల్పు.

సాత్విక కర్మలకు ఫలము సంతోష సుఖంబులు రా
జసఫలంబు దుఃఖం బజ్ఞానము తామస ఫలంబు

శ్లో-17-20 16 మాత్రలు

సాత్విక గుణమున జ్ఞానంబు రాజసంబున లోభము సంభవించు సుమ
ప్రభవించును దామస గుణము వలన బ్రమాద మోహాజ్ఞానములర్జున!
ఊర్ధ్వంబున కేగుదురు సాత్వికులు, నుందురు రాజసులు మధ్యమందున
అధోగతుల పాలగుదురు తామసు లంతయునిది త్రిగుణ ప్రభావమే.
గుణములకంటెను వేరుకర్త లేఁడని విశ్వసించి గుణాతీతుఁడై
సాక్షిమాత్రుడై తానిలచి బ్రహ్మ సాక్షాత్కారము వడయగలఁడతడు
దేహోద్భవములు త్రిగుణంబులనే దేహితాదాత్మ్యమొందకయుండు
జన్మమరణములు జరాదుఃఖములు జయించి జీవన్ముక్తుఁడగు నతఁడు
గుణాతీతు లక్షణాచారములు వినిపింపుము ప్రభువర్యా! వాఁడా
గుణముల నతిక్రమించు విధానము గూడ నాకెఱింగింపుము దయఁతో
ననిప్రశ్నించిన పార్థునకు హరి సమాధానంబుగఁ బల్కె నీ విధము

శ్లో॥ 22-27 12 మాత్రలు

సత్వరజస్తామస గుణ సంప్రాప్తి నివృత్తు లెపుడు
ద్వేషింపక కాంక్షింపక ధీరుఁడై నిలచు నాతఁడు.
గుణములు వర్తించును దమ గుణముల నని చలియింపక
యుదాసీన భావంబున నుండు వాని నంటఁడతఁడు.
సమలోష్టాశ్మ కాంచనుఁడు సమదుఃఖసుఖుఁడు నిందా

స్తుతులందుఁ బ్రియాప్రియములఁ దుల్యుఁడు ధీరుస్స్వస్థుండాతఁడు
సర్వారంభ విరాముఁడు, సర్వగుణాతీతుండు స
మానుడు మిత్రాదులందు మానా మానములయందు
నన్న చంచల దృఢభక్తి నను సంధించుచు నను సే
వించుచు గుణముల నతిక్రమించి బ్రహ్మ భూతుఁడగును
అవ్యయంబు శాశ్వతంబు నమృతము కేవల సుఖంబు,
ధర్మరూప బ్రహ్మకు నా ధారము నేనే యర్జున

## పంచదశాధ్యాయము

## పురుషోత్తమ ప్రాప్తియోగము

శ్లో॥ 1-6 10 మాత్రలు

పైన మూలముక్రిందు వైపు శాఖలు గల్గి
వేద పత్రములచే వృద్ధియగు సంసార
మశ్వత్థ భూరుహం బవ్యయంబద్దాని
నెఱుగు వారలె పరమ మెఱుక గల్గిన వారు
మూడు గుణములచేతఁ బోషింపఁ బడుచుండు
విషయ ప్రవాళముల వికసితంబగు చుండు

క్రిందు మీదను వ్యాప్తిఁ జెందుశాఖల నిశము
భూలోకమున దీని మూలంబులన్నియును
గర్మపాశములచేఁ గట్టంబడుచునుండు
దీని నిజరూపంబు తెలియరాదీ జగతి
నాద్యంతములు స్థితియు నగుపడదు పరికింప
లోతుగా దృఢముగాఁ బాతుకొన్నవి వ్రేళ్ళు
సంగరాహిత్య దృఢ శస్త్రంబు చేఁబూని
గట్టిగా ఛేదింప గావలసి యున్న దిది.
అంత దత్పదము పునరావృత్తి రహితంబు
నన్వేషణంబు సేయంగ వలయును సుమ్మి
యే బ్రహ్మ సంజనితమీ యనాది ప్రకృతి
యా యాది పురుషునే యాశ్రయించగ వలయు
మాన మోహంబులను మానువారలు, సంగ
దోషముల దరిగొనక తొలఁగి చనియెడు వార
లధ్యాత్మయందు నిత్యము వసించెడు వారు,
సంతోష దుఃఖ సంజనన కారకములగు
ద్వంద్వంబులం దెపుడు దగులకుండెడు వారు
లవ్యయంబగు పదం బందెదరు జ్ఞాను లిల
చంద్ర సూర్యాగ్ను లెచ్చట ప్రకాశింపరో,
చని పరమ భక్తులెచ్చటికి, దిరిగియు రారో,
ఆ పరమ పదము దివ్యంబు నాధామంబు

నద్దాని( బొందను ప్రయత్న మొనరింప వలె.

శ్లో॥ 7-11 12 మాత్రలు

నాయంశము జీవుండు సనాతనుండు సర్వభూత
దేహియై మనః షష్ఠేంద్రియముల నాకర్షించును
శరీరంబు దాల్చువేళ, శరీరము త్యజించు నపుడు
వానిని గ్రహియించి చనును వాయువు వాసనను వోలె
మానస సహితంబులైన జ్ఞానేంద్రియముల ద్వారా
విషయ భోగచయము లన్ని వేళల భుజియించుచుండు
నుత్క్రమించువానిని, స్థితు, నుపభోగించు గుణాన్వితు
జ్ఞాననేత్రుఁడే కను నజ్ఞాని గాంచఁ జాలఁడతని,
ఆత్మసితుని, గుణా వ్రతు యత్నముచే జ్ఞానిగనుఁ బ్ర
యత్నము చేసైన నెఱుఁగ డజ్ఞుండ కృతాత్మకుండు

శ్లో॥ 12-15 10 మాత్రలు

సూర్యచంద్రాగ్నులను జుక్కలను గలయట్టి
విశ్వప్రకాశకము వెలుగు నాదే సుమ్మి ।
భూమిలో శక్తినై భూతముల ధరియింతు
నమృతరూపమున శశి యందుఁడి నేన స
ర్వౌషధులఁ జక్కగాఁ బోషణము సేసెదను
జఠరాగ్నినై నేన జఠరమున నుండి ప్రా
ణ-పాన యుక్తుండనై పచన మొనరించి,

భక్షభోజ్యాదులను బంచివేసెద నేస
సర్వ భూతముల హృద్ధ్యాన మందు వసించి
స్మృతియు, జ్ఞానంబు విస్మృతి గలుగఁ జేసెదను
వేదార్థముగ్రహింతు, వేదాంతము సృజింతు,
సర్వవేదములు నా సంగతియ చెప్పుచుండు

శ్లో॥ 16-20 14 మాత్రలు

పురుషలీ లోకమున నిద్దఱు క్షరుఁడు నక్షరుఁడనెడు వారలు.
క్షరము భూతంబులన్నియు నక్షరుఁడు కూటస్థుఁడగు జీవుఁడు
పురుషుఁ డింకొకఁ డుత్తముఁడుభువి వఱలు పరమాత్మయను పేరన
నీశ్వరుండవ్యయుండాతఁడు విశ్వమంతయుఁదాభరించును.
అతీతుండను క్షరాక్షరముల కందుచేఁ బురుషోత్తముఁడ నని
వేదములను, త్రిలోకముల నే విశేషము ప్రఖ్యాఁతి గాంచితి.
ఇట్లు పురుషోత్తముఁ డనుచు ననెవ్వఁ డెఱుగునో యట్టి జ్ఞానియె
సర్వవిధముల నన్ను, గొల్చుచు, సర్వవిదుడై చెలగు భారత !
అతిరహస్యంబైన శాస్త్రం బందఁజేసితి నీకు నర్జున !
యభ్యసింపుము బుద్ధిమంతుఁడవ య్యెదవు కృతకృత్యుడవు సుమ

# షోడశాధ్యాయము

## దైవాసుర సంపద్విభాగయోగము

శ్లో॥ 1-3 12 మాత్రలు

దైవీ సంపద్యుక్తులు ధన్యాత్ములు మద్భక్తులు,
దేవతా సములు, వారల దివ్య గుణములు వర్ణింతు,
నని వివరింపఁ దొడఁగె నయ్యర్జుననకు భగవానుఁడు
అభయము సత్వసంశుద్ధి, యార్జవమ్ము, జ్ఞాననిష్ఠ,
దానము, తపము యజ్ఞమ్ము, దమమును, స్వాధ్యాయమ్మును
సత్యము, త్యాగ, మహింసయు, శాంతి, యపైశునము, సిగ్గు,
భూతదయ, మృదుత్త్వము, స్థిరబుద్ధి, యలోలత్త్వంబును,
క్షమయు, దేజమును, ధృతి, శౌచ, మద్రోహ, మక్రోధం,
బమానిత్వ మీ యిరువది యాఱు దైవ సంపత్తులు.

శ్లో॥ 4-5 16 మాత్రలు

దంభము, పరుషత్వం, బభిమానము, దర్పము, క్రోధం, బజ్ఞానంబును,
నాసుర సంపదతో జన్మించిన యధముల లక్షణములని గ్రహింపుమి
దైవీ సంపద మోక్షమిచ్చు, బంధంబు దెచ్చు నా సుర సంపదసుమి,
దుఃఖింపకు మిఁక దైవీసంపదతోఁబుట్టితీవీవు పాండునందన !

శ్లో॥ 6-10 14 మాత్రలు

భూత సృష్టులు రెండు విధములు భువిగలవు దైవాసురములని,
దైవసంపదఁ జెప్పితిని, విస్తారముగా విను మసుర సంపద
సత్యశౌచారములు గనఁజాలరా మూఢులెన్నఁటికిని,
ప్రవృత్తిని వృత్తుల నెఱుఁగరు వార లజ్ఞానమున మునుగుచు
జగదనీశ్వర మప్రతిష్ఠ, మసత్యమును, స్త్రీపురుషజనితము,
కామహైతుకమాత్రమనుచును గల్పనలు సేయుదురు వారలు.
నాస్తికులు దుష్టమానసులు వినష్ట బుద్ధులునిట్లు దలచుచు
నుగ్రకర్ములు జగదహితులై యుద్భవింతురు నాశమునకై
దంభమాన మదాన్వితులును విదగ్ధ బుద్ధుల పూర్ణకాములు,
సత్యమార్గావలంబకులై సంచరింతుర శుచివ్రతులై

శ్లో॥ 11-16 16 మాత్రలు

బుద్ధి నిట్లు నిశ్చయ పఱిచి, కామభోగంబులలో మునిఁగి తేలుచును
ప్రళయాంతా పరిమిత బహు చింతా వలయమునఁజిక్కి కామక్రోధ
స్వాధీనులు, నాశాపాశశత నిబద్ధులు, మూఢ వినేతస్కులు, న
న్యాయార్జితద్రవ్యంబులనే వారాశ్రయింత్రు కోరికల తృప్తికై
ఈ వాంఛలు నా కీడేరినవిక నీ మనోరథంబులు దీరవలయు,
నీ ధనము సంపాదించితి నే నింకను విత్తంబులు కూర్చవలయు
నీ నా శత్రువులను హత మార్చితి, నీ రిపువర్గము దునుమాడవలయు,
నే నీశ్వరుఁడను, భోగిని, సిద్ధుఁడ, నేను సుఖిని, బలవంతుఁడ నేనే,

సంపన్నుండను, సత్కు లీనుఁడను, సరితూగ గలండెవ్వఁడు నాకిల
యజ్ఞదానములు సేసి మోదింతు, నని యజ్ఞానాంధకారమగ్నులు
విమోహజాలంబందుఁ దగుల్కొని, వివిధచిత్త విభ్రాంతికిలోనై,
కామభోగములకై పడిచచ్చుచుఁ గడకశుద్ధ నరకమునఁ గూలెదరు.

శ్లో॥ 17-20 12 మాత్రలు

దాంభిక జనములు, స్తబ్ధులు, ధన మానమదాన్వితులును,
కామక్రోధ బలాహం కారదర్ప వశవర్తులు,
నాత్మస్తుతి పరనిందల నలంకారముగ గైకొని, యా
యీర్ష్యాళువు లెంతయు ద్వేషించుచు నన్ని ఖిలాత్మను
విధివిరుద్ధ యజ్ఞంబులు పేరునకై సలుపు చుందు;
రట్టిద్వేషభావుల క్రూరాత్మకుల నరాధములను
బట్టి యసురయోనులలో వేయుచుందును నే
నాసుర యోనులలోఁ బడియనేక జన్మమము లెత్తుచు,
నజ్ఞానులు ననుఁ బొందక యధఃపతితులగు చుందురు

శ్లో॥ 21-24 16 మాత్రలు

కామము, క్రోధము, లోభము, లివినరకద్వారము లాత్మ వినాశకరము
లీమూఁడింటి ద్యజింపవలయు నెంతేనిఁ బ్రయత్నము సేసియైన, నీ
కామాదుల వలనుండి తన్నెవఁడు కాపాడు కొనంగలడో వాడే
పరమశ్రేయస్కరంబైన నా పరమపదం బందుకొనును శీఘ్రమె.
శాస్త్రవిధినిఁ బాటించక కామాసక్తుండు స్వతంత్రించి నడచుచో,

సిద్ధినిఁబొందఁడు సుఖముఁగాంచడిక(ఁ జేరుకొనుట యెట్టులు పరమగఁతిని
కావున శాస్త్రంబే ప్రమాణంబు కార్యాకార్యంబులు తెలుపుటకై,
శాస్త్రవిధినిగని కర్మల నెల్లను సల్పవలసియున్నది కౌంతేయా !

## సప్తదశాధ్యాయము

## శ్రద్ధాత్రయ విభాగయోగము

శ్లో॥ 1-4 12 మాత్రలు

శాస్త్ర విధిని విస్మరించి శ్రద్ధమీఱ గొల్చెడు భ
క్తతతి నిష్ఠ సత్వరజస్తమములలో నెట్టిది; యని
యడిగిన నర్జునకిట్లు నుడివెను శ్రీ భగవానుడు.
శరీరధారులకుం గల స్వభావజంబైన శ్రద్ధ
మూడు విధంబులు సాత్వికము, రాజసము తామస మని
శ్రద్ధ సర్వజనులకు సంస్కార రూపమున నుండును;
శ్రద్ధామయుఁడు పూరుషుఁడు శ్రద్ధకు ననుగుణముగుణఁము
సురలను సాత్వికులు, రాజసులు యక్షుల రాక్షసులను,
దామసు లిల భూతప్రేత గణంబులఁ బూజింతురు.

శ్లో॥ 5-10 16 మాత్రలు

కామరాగబలులును దంభాహంకారంబులతోఁ గూడినవారలు
శాస్త్ర విరుద్ధంబగు ఘోరతపము సల్పుచునుందురు విమూఢ చిత్తులు
పీడింతురు నన్నంతర్యామిని, వేధింతురు భూతరాశి నంతయు;
నట్టివారి గుర్తింపుము పార్థా! యాసుర సంపద గల వారినిఁగా
ఆహారయజ్ఞదానతపంబు లివన్నియు మూడు విధమ్ములుప్రియమ్ము
లవధరింపు నీ కిప్పుడు తెల్పెద నవ్వాని పశేష విభేదంబులు
ఆయు స్సత్త్వ సుఖప్రీతికరము, లారోగ్య బల వివర్ధ నంబులును,
స్నిగ్ధంబులు, రస్యములు, హృద్యములు స్థిరాహారప్రియులు సాత్వికులిల
కట్వామ్లము, లత్యుష్ణంబులు, తీక్ష్ణరూక్షములు, లవణదాహకంబులు,
దుఃఖశోకప్రదంబులు, నామయ దోషయుక్తములు రాజసేష్టములు
ఉచ్ఛిష్టంబు లమేధ్యంబులు, పర్యుషితంబులు గతరసోపేతములు,
పూతి గంధములు, యాతయామములు, భోజనములు తామస ప్రియంబులు

శ్లో॥ 11 22 12 మాత్రలు

విధిదృష్టము ఫలాపేక్ష విరహితమ్ము, కర్తవ్యము,
సమాధాన బుద్ధి సల్పు జన్నము సాత్విక మనఁదగు:
ఫలములగాంక్షించుచు డంభమునఁ జేయు యజ్ఞమ్ము భ
రతశ్రేష్ఠ! తెలియవలయు రాజసమనియ దానిని;
విధి విరుద్ధమును, శ్రద్ధావిరహితం, బదక్షిణంబు,
నన్నదాన, మంత్రహీనమైనది తామసమన బడు;

దేవద్విజగురు ప్రాజ్ఞసేవ, బ్రహ్మ చర్యంబును,
శౌచ, మార్దవం, బహింస శారీరక తప మనబడు;
ప్రియము హితము, సత్య, మనుద్వేగకరంబగు భాషణ,
స్వాధ్యాయాభ్యసనంబును వాచక తపమనబడు సుమ,
సౌమ్యత్వము, మౌనమ్ము, ప్రసన్నత, యాత్మ నిగ్రహము,
చిత్తశుద్ధియుక్తము మానసతప మని పేర్కొనఁబడు
త్రిగుణంబుల ననుసరించి త్రివిధంబు తపంబు మరల,
ఫలాపేక్ష శూన్యంబు, తపంబు, సాత్త్వికం బనబఁడు;
గౌరవ పూజార్థము, సత్కారార్థము గావించెడు
దంభోపేతంబైనది తపము రాజసంబనబడు,
శరీరపీడాకరంబు, శత్రునాశ హేతుకంబు,
మూఢ బుద్ధి నొనరుచు తపము తామసంబని పరఁగును
దేశకాల పాత్రంబులు తెలిసి చేయఁబడెడు విధి వి
హితమ్ము ప్రత్యుపకార రహితమ్ము సాత్త్విక దానము,
ప్రత్యుపకారాపేక్షను ఫలము కోరి యీయం బడు
పరిక్లిష్ట దానంబును పరిగణింత్రు రాజసమని,
దేశకాల పాత్రములను ధిక్కరించి సల్పు నదియు
దూషణావ మానంబులతోఁ గూడినది తామసము.

శ్లో॥ 23-28 16 మాత్రలు

ఓమ్ తత్సత్తని బ్రహ్మంబును యుగయుగాలనుండియు స్మరించుచుండిరి.
ప్రశస్తమ్ములయ్యె వేదమ్ములును బ్రాహ్మణులును వేదములు దీనిచే;

నందువలన నోమ్మని మొదలిడుదురు యజ్ఞమ్ములు దానములు
తపమ్ములును

బ్రహ్మవాదు లీస్థితి ననుసరించి ప్రవర్తించుచుందు రెల్లప్పుడును.
మోక్షకాములిక యజ్ఞదాన తపములు వివిధంబు లొనర్చుచునుందురు
ఫలాపేక్షలేక వానిని తదర్పణముచేసి తృప్తిగాంచుచుందురు
సాద్భావ సాధుభావంబుల కీ సచ్ఛబ్దముగూర్చం బడుచుండును
ప్రశస్త కర్మల శబ్దములకెల్ల ప్రారంభ బున సత్ చేర్చంబడు
యజ్ఞదాన తపములు సహితము సత్తనియే చెప్పంబడుచుండువాని
సంబంధంబగు క్రియాకలాపము సత్తనియే వ్యవహరింపబడుగద
యజ్ఞంబులు దానంబులు, దపంబు లఖిల కార్యములు శ్రద్ధలేనిచో
నసత్తులనియే వాకొనబడు నవి యన్నియు నిరర్థకంబులు పార్థా !

## అష్టాదశాధ్యాయము

## మోక్షసంన్యాస యోగము

శ్లో॥ 1-6 16 మాత్రలు

హృషీకేశ సంన్యాసము, త్యాగము పృథగ్రూపమున నెఱుగదలంచితి
మహాబాహూ ! వానిని నాకు ననుగ్రహించి తెలుపవె కేశిని సూదన !

యనుచువేడగా బార్థున కిట్టులు వినిపించందొడగెను భగవానుఁడు
సర్వకర్మలను ద్యజియించుటయే కవుల దృష్టిలో సంన్యాసమగును;
సర్వకర్మల ఫలత్యాగమే విచక్షణుల మతంబునఁ ద్యాగము సుమ !
ప్రాజ్ఞులు కొందఱు కర్మలన్నిఁటిని వదలవలెనందురు దోషముల వలె,
యజ్ఞ తపోదాన కర్మలెన్నడు ద్యజింపవలదందురు మఱికొందఱు
పావన మొనరించు యజ్ఞదానతపః కర్మలవి మనీషుల సమ్మతము,
కావున వానిని విడువం గూడదు, కర్తవ్యములవి భరత నందనా !
అనాసక్తి యోగంబున ఫలముల నాకాంక్షించక కర్తవ్యములని
చేయదగు నీ స్వకర్మలను నిశ్చితముత్తమమైనది నామతమిది

శ్లో॥ 7-9 12 మాత్రలు

పనికిరాదు నిత్యకర్మ పరిత్యాగము, మోహమున
త్యక్తమైనది తామస త్యాగంబని పిలువంబడు.
కాయ క్లేశంబని దుఃఖ ప్రాప్తి భయమున సల్పు
త్యాగము రాజస మనబడు, త్యాగఫలము లభియింపదు,
కర్తవ్యంబనుచు నియతకర్మ సలుపవలయు ననా
సక్తి న్నఫలాపేక్షను, సాత్త్వికమను త్యాగమద్ది

శ్లో॥ 10-12 16 మాత్రలు

త్యాగియు వాఁడెసుమా - మేధావియు వాఁడె సుమా ! -
సత్వగుణాఢ్యుఁడు సంశయరహితుఁడు త్యాగియువాడె సుమా ! -
ద్వేషింపడు బంధించు కర్మలను ప్రేమింపడు మోక్ష కర్మల నతఁడు.

శరీరధారులకు గర్మ నిశ్శేషముగా వదలుట శక్యము గాదిఁకఁ
గర్మఫలము లెల్లను సంపూర్ణముగాఁ దృజియించినఁ ద్యాగఫలమబ్బు
ఇష్టమనిష్టము, మిశ్రమ మనుచును నీవిధమునఁ గర్మఫలము త్రివిధం
బత్యాగికిఁ బ్రాప్తించును మరణా నంతరంబు; సంన్యాసికి నబ్బదు

శ్లో॥ 13-18

12 మాత్రలు

సర్వకర్మ సిద్ధి కొఱకు సాంఖ్య శాస్త్రమునఁ జెప్పిన,
దేహ, మహంకారము, బుద్ధీంద్రియ సహితమనంబును,
ప్రాణంబుల వివిధ వ్యాపారంబులు, దైవంబను
నైదు కారణంబుల నీ వవధరింపు నా వలనను
శరీరవాఙ్మనములచే సలుపంబడు న్యాయాన్యా
యకర్మలకు హేతువులివి యైదే యని గ్రహియింపుము.
ఆత్మయ కేవలము కర్తయని సంభావించు వార
లజ్ఞాను, లకృత బుద్ధులు, నంధులు, దుర్మతులు సుమ్మి !
నిరహంకారులు కర్ములు, నిర్లిప్తులు, సమబుద్ధులు
లోకములను హతమార్చియు లోనుగారు బంధములకు
జ్ఞానము, జ్ఞేయంబు, పరిజ్ఞాత కర్మ నడుపు త్రికము,
కర్తృ కర్మ కరణంబులు కర్మసల్పు త్రికమనఁ బడు

శ్లో॥ 19-22

16 మాత్రలు

జ్ఞాన కర్మకర్తల భేదంబులు, సాంఖ్యశాస్త్రమున వినుము, త్రివిధములు;
భిన్నములగు సర్వభూతములను నభిన్నం బద్వయ, మవ్యయమైనది

సత్తును వీక్షించెడు భావంబే సాత్త్విక జ్ఞానమని పిలువంబడు;
వేఱువేఱు భూతము లన్నింటను వేఱువేఱాత్మలు సంస్థితములను
పృథగాత్మరూప భావంబేయది, పృథాతనయ రాజస జ్ఞానమగు;
నేదో యొకరూపంబున నాత్మన్నిరికించి యద్దియే పూర్ణమను న
హైతుక, మసత్య, మల్పభావమది యజ్ఞుల జ్ఞానము తామస మనబడు

శ్లో॥ 23-25 12 మాత్రలు

విధివిహితమ్ములు, రాగద్వేషవిహీనము, లఫలా
కాంక్షితములు, సంగరహితకర్మలు సాత్త్వికములు సుమ !
అహంకారయుతములు, బహులాయాసకృతములు, కామ్య
కర్మలు, పునరావృతములఁ గాంచుమ రాజసములుగా;
పరిణామంబును, హింసను, బౌరుషమును, నాశమ్మును,
బరికింపక యొనరించెడు పను లన్నియుఁ దామసములు.

శ్లో॥ 26-28 16 మాత్రలు

అహంకారమమకార రహితుండు, నసంగుండు, సిద్ధ్యసిద్ధు లందున
సముండు, ధృత్యుత్సాహసమేతుఁడు సాత్త్వికకర్త యనంబడు నాతఁడు
సక్తుండు, ఫలాపేక్షకుండు, హింసారతుండు, లుబ్ధుండును, మలినుఁడు
హర్షశోకాన్వితుం డగువాఁడే వ్యవహరింపఁబడు రాజసకర్తగ,
శఠుఁడు, ప్రాకృతుఁడు, యోగవిదూరుడు, స్తబ్ధుఁడు, సోమరి,
నిష్క్రియాత్మకుఁడు,
దీర్ఘసూత్రుండు, విషాది యాతడు తెలుపంబడు దామసకర్తయనుచు

శ్లో॥ 29-35 16 మాత్రలు

బుదిధృతుల భేదంబులు- గుణములం బట్టి త్రివిధంబులు-
పృథగ్రూపమున సంపూర్ణంబుగ వివరించెద నీకవినుము ధనంజయ !
పవృత్తి నివృత్తు లిరుమార్గంబుల, బంధమోక్షముల, భయాభయంబుల.
కర్తవ్యాకర్తవ్యములఁ దెలుపఁ గలబుద్ధియ సాత్త్వికం బనంబడు;
ధర్మాధర్మంబులను, విధినిషేధంబుల, నెయ్యది శాస్త్రోక్తంబగు
విధినిగాక వేఱువిధంబుగాను విచారించు నా బుద్ధి రాజసము;
తమోగుణాఢ్యులధర్మంబులనే ధర్మంబులుగాఁ గాంచుచు సర్వము
విపరీతంబుగ భావింత్రు నా యవిపశ్చితులబుద్ధి తామసం బగు
మనఃప్రాణేంద్రియక్రియ లనన్యమనస్కుఁడై స్థిరముగ ధైర్యంబుగ
ధారణ చేసిన యెడల నెద్ది పార్థా ! సాత్త్వికధృతి యని తెలిసికొనుమ,
ధర్మకామార్థములు మాత్రమె కర్తవ్యము లంచు ఫలాపేక్షన్ ధా
రణ చేసిన నాసక్తి మీఱ నది రాజసధృతి యని యెఱుగు మర్జునా !
భారత ! బుద్ధివిహీనుఁడు నిద్రాభయశోకవిషాదమదము లెపుడును
విడువక ధైర్యముతో వాని ననుభవించు, నట్టిధృతి తామస మనబఁడు.

శ్లో॥ 36-39 12 మాత్రలు

సుఖములు మూఁడు విధంబులు సుమ భరతర్షభ వినుమా !
యనుభవించు కొలఁది యధిక మగు నానందంబు సుమా !
ప్రారంభంబున విష మది పరిణామ మమృతతుల్యం
బాత్మబుద్ధివలనఁ బుట్టు నట్టిసుఖము సాత్త్వికమగు;

అమృతోపమము విషయసుఖ మారంభమునందుఁ దోఁచుఁ
పరిణామంబున దుఃఖము ప్రాప్తించును; రాజస మది;
ఆద్యంతములందు మోహ మాత్మకు సమకూర్చు నదియు
నిద్రాలస్యప్రమాద నిర్మితసుఖము తామసము.

శ్లో॥ 40-49 12 మాత్రలు

మూఁడుగుణంబులకంటని భూతంబులు లేనే లేవు
భూలోకమునందు స్వర్గభూమిని దేవతల యందు;
స్వభావజగుణములచేత బ్రహ్మక్షత్రియుల వైశ్య
శూద్రులకర్మలు వేఱగుఁ జుమ్మీ వినుమీ పరంతపా।
శమదమతపములు, శౌచ, క్షమల, జ్ఞానవిజ్ఞానము
లాస్తిక్యార్జవంబు లనునవి బ్రాహ్మణకర్మలు విను;
శౌర్యము తేజము, శాసనశక్తి, రణ మహిలాయనము
ధృతి, దానము, దక్షత క్షత్రియుల కర్మ లని తెలియుమ;
వైశ్యకర్మ గోరక్షణ వాణిజ్య మితరవృత్తులు;
పరిచర్యాత్మకకర్మలు స్వభావజములు శూద్రులకు
తమతమకర్మలయందునఁ దత్పరులై యున్నవారు
సంసిద్ధిని బొందుదురోవ సవ్యసాచి విను మింకను
ఎవ్వనిచే భూతముల ప్రవృత్తి సంభవించు చున్న,
దెవ్వనిచే వ్యాప్తంబై యీ జగత్తు నిండియున్న,
దప్పరమాత్ము స్వకర్మల నారాధించుచు నుండినఁ

ఉప్పక మనుజులు మోక్షస్థానంబు నలంకరింత్రు,
స్వధర్మంబు విగుణంబును సర్వశ్రేయమును గూర్చు;
పరధర్మము స్వనుష్ఠితము భయముం గూర్చుచునుండును
స్వాభావికములు కర్మలు సల్పినఁ బాపము నొందఁడు;
సర్వశాస్త్రసమ్మత మిది సంశయములు వీడు మింక;
దోషయుక్త మని స్వకర్మ ద్రోసివేయరాదు; దోష
భూయిష్ఠము కర్మ యంత పొగ గప్పిన నిప్పువోలె;
నసక్తుండు విజితాత్ముండాశలన్ని విడిచిపెట్టి
సన్న్యాసంబుననే నైష్కర్మ్యసిద్ధి సాధించును

శ్లో॥ 50.54 16 మాత్రలు

సిద్ధి పొందినట్టి వ్యక్తి బ్రహ్మను జేరుట కనువగు మార్గక్రమమును
సంక్షిప్తంబుగ జెప్పెదను వినుమ జ్ఞాననిష్ఠాపరాకాష్ఠ గనుమ
శరీరేంద్రియమ్ములను వశముంచి, శబ్దాది విషయములను ద్యజియించి,
రాగద్వేషములను జయించి, ధైర్యంబున బుద్ధిని సంశోధించియు,
మనోవాక్కాయములను నియమించి, మానవులకు దూరము నివసించి
ఆహారము లఘువుగను భుజియించి, యహంకార బలదర్పములడంచి
కామక్రోధములను ద్రుంచి, మమకారంబును మొగ్గలోన త్రుంచియు
పరిగ్రహమ్ములవలనుంచి, దృఢమగు వైరాగ్యంబును బెంచి మనంబును
ధ్యానయోగమున నుంచి, శాంతుఁడై యర్హుఁడగును బ్రహ్మమును బొందుటకు
బ్రహ్మభూతుండుఁ బ్రసన్నాత్మకుఁడు వాంఛింపడు శోకింపడెన్నఁడును

సర్వభూతసముఁడై నాభక్తిని సంపాదించి పరమగతిఁ బొందును.

శ్లో॥ 55-62 12 మాత్రలు

భక్తి చేతనాయథార్థ భావమెఱుంగ గలరట్టి
భక్తివరులు మాత్రమె నను బడయ గలుగుదురు పిమ్మట.
నాపదముల నాశ్రయించి నానా కర్మలు సతతము
సల్పుచు, నాకృప నవ్యయ శాశ్వతపదము పొందెదరు
మనసుచే సమస్తకర్మ మదర్పణము గావించుచు
జ్ఞాన బుద్ధితో భక్తిన్ స్మరియింపుము నన్ను సదా
మచ్చిత్తుఁడవగుము దుర్గమములు దాట గల వన్నియు.
నహంకారయుతుడ వైనన్ని విధముల నశింతువు
అహంకారమునకు వశుఁడవై యుద్ధము సేయనియెద;
ప్రకృతియ నినునియోగించు వ్యర్థ నిశ్చయుడ వగుదువు
స్వభాజక్షాత్ర కర్మస్వాధీను డవు మోహమున
నిష్టపడకయున్నను నీవే చేసెద వట్టి కర్మ
ఈశ్వరుండు సర్వభూత హృదయాంతర వాసుండై
యాత్మ మాయచే నాయంత్రారూఢులఁ ద్రిప్పు చుండు
సర్వ భావముల భారత! శరణుపొందు మవ్వానిని
తత్ప్రసాదమున శాంతి స్థానము శాశ్వతమబ్బును.

శ్లో॥ 63-66 14 మాత్రలు

గుహ్యములలో కెల్ల పరమగుహ్యమగు జ్ఞానమెఱిగించితి
బాగుగా యోచించి యిష్టము వచ్చినట్లొనరించు మింకను

పరమగుహ్యతమంబు నగు నా వచనమును మరల వినిపింతును
హితుఁడ వత్యంత ప్రియుఁడవు నీ హితవు కోరియ చెప్పుచుంటిని
నాకు మన మర్పణము సేయుము, నన్ను భక్తినిఁ గొల్పు చుండుము;
నన్ను బూజించు మెల్లప్పుడును నమస్కృతు లొనరింపు నాకే.
ప్రతిన గావించి చెప్పెద మత్ప్రాప్తిం బిగలుగును నిశ్చయం బిది
సర్వధర్మంబులఁ ద్యజించుమఁ శరణుపొందుమ నన్నొకనినే
పుణ్యపాపవిముక్తి తప్పక పొందఁ జేసెద దుఃఖ మొందకు.

శ్లో॥ 67-70 16 మాత్రలు

బోధింపం దగు దర్జున గీతాబోధామృతము తపోహీనులకున్.
కోరనివారికి, భక్తరహితులకు గురుశుశ్రూషాపరాఙ్ముఖులకున్
దివ్యుడ నగు నను సామాన్యుం డని ద్వేషించుచు నున్నదుష్టాత్ములకు
పరమగుహ్య మగు నీ శాస్త్రము మద్భక్తవరుల కెవఁ డుపదేశించునో
పరాభక్తిగల్గి నిశ్చయముగా ప్రవేశించు నాయందే యాతఁడు
వానికంటెఁ బ్రియతముఁడు భక్తుఁ డీవసుధాస్థలిలో లేఁ డెవ్వండును:
భవిష్యత్తునం దాతనికిన్ సరివచ్చు ప్రియతముఁడు పుట్టఁ బోఁ డెపుడు.
ఈ మనయుభయుల సంవాదధర్మ్య మెవఁ డధ్యయనము సేయు చుండునో
వానిచేతఁ బూజితుఁడ నౌదు నీ జ్ఞానయజ్ఞమున నా నిశ్చయమిది.

శ్లో॥ 71-73 16 మాత్రలు

శ్రద్ధగలవాఁడై యసురగహితుఁడై వినువాఁడు సహితము
పుణ్యపురుషులు వోవులోకంబులను జేరును ముక్తుఁడై చను
వింటివా ? యరునా ! యిద్ది యవిచలితైకాగ్రమునమున న
జ్ఞానసంజనితంబు మోహము సమసిపోయినదా ? ధనంజయ !

యనుచు భగవానుం డడుగగా వినయమున బదులాడెఁ బార్థుఁడు
నష్టమైనది మోహ మంతయు నాకు స్మృతి యిప్పుడు లభించెను;
మీ యనుగ్రహబలము చేత స్థిమితుఁడ నైతిని నేను గృష్ణా !
సంశయంబులు నశించెను శిరసావహించెద మీఁదునానతి

శ్లో॥ 74-78

12 మాత్రలు

సంగరరంగస్థితి సంజయుఁ డిటు ధృతరాష్ట్రునకున్
సంగ్రహించుచును తననిశ్చయము దెల్పె నీ విధమున.
ఆశ్చర్యకరంబు, రోమహర్షణంబు, మహాత్ములగుఁ
గృష్ణార్జునసంవాదము, కిల్బిషహర, మతిగుహ్యము
కేవలయోగతత్త్వంబు గీతాశాస్త్రంబు నేను
వ్యాసానుగ్రహమున దివ్యజ్ఞానము పొంది వింటి,
సాక్షాత్కృష్ణుఁడు యోగేశ్వరుఁడు స్వయముగాఁ జెప్పఁగ.
అద్భుతమైన దిది కేశవార్జున సంవాదము, పు
ణ్యప్రదంబు, స్మరియించిన హర్ష మబ్బు మరల మరల;
నా హరివిశ్వరూప మత్యద్భుతంబు పదే పదే
సంస్మరించుకొలఁది హెచ్చు సంతోషం బాశ్చర్యము
యోగేశ్వరుఁడగు కృష్ణుఁడు, యోగి ధనుర్ధారి పార్థుఁ
డుండు నెడ సిరి, విజయ, మభ్యుదయము దృఢనీతి యుండు.

ఓం తత్ సత్
శ్రీకృష్ణపరబ్రహ్మార్పణమస్తు
హరి రామ కృష్ణ
ఇతి శమ్

శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

# భగవద్గీతా మహాత్మ్యము

శ్లో॥ 1-23

16 మాత్రలు

ప్రారబ్ధం బనుభవించుచును దృఢభక్తిపీఠంబు మానవుం డెట్టు
లలంకరించును ? భగవంతా ! నా కానతిమ్ము పరమేశ్వరా ! ప్రభూ !
యను ధరాదేవి ప్రారస కిటులు సమాధానము విష్ణువు దా నొసంగెను
ప్రారబ్ధ మనుభవంచుచు గీతాభ్యాసరతుం డైనమానవుండు సదా
ముక్తుండు, సుఖములు బరంగొను, లోకమున నాతని నంటవు కర్మ
లెపుడు

గీతాభ్యాసము సేయువాండు పాపాతిపాపి యైనను సరె యాతనిం
బాపము లేమాత్రము స్పృశియింపవు వారిజపత్రమును వారివిధమున
గీతాపుస్తక ముండుచోటులను, గీతాపఠనము జరుగు స్థలంబులం
బ్రయాగాది సర్వతీర్థంబులును ప్రవర్తిల్లుచుండును సంతతంబు
పార్షదులు నారదోద్ధవులును, గోపాలకులును, గోపీబృందంబులు,
దేవతాళి, ఋషి యోగి పన్నగులు దివ్య తెల్లరు సహాయమొనర్తురు
గీతాపాఠనపఠనము శ్రవణము గీతావిచారణము జరుపం బడు
ప్రదేశములయందు నే వసింతును; వసుంధరా నిశ్చయ మిది సుమ్మీ !
గీత నాకు నుత్తమనివాస మగు గీతయ నా యునికికి నాధారము,
గీతాజ్ఞానబలంబుచేతనేం చేతును త్రిలోకపాలనంబు నే.
గీత పరమవిద్య బ్రహ్మరూపము గీతాజ్ఞాన మనిర్వచనీయం
బర్ధమాత్ర యిది యవ్యయ మైనది యక్షరంబు నిస్సంశయముగ నిది
చిదానందుండు కృష్ణుండు స్వయముగం జెప్పెను నర్జునునకు నీ గీతను
వేదసార మిది పరమానందము, వేగమె కూర్చును తత్త్వజ్ఞానము
నిశ్చలమానసమున మానవుండు నిత్యం బష్టాదశాధ్యాయములు
పఠియించిన జ్ఞానసిద్ధి గలుగును; పరమపదప్రాప్తి దక్కు జివరకు
సంపూర్ణంబుగం జదువుటకు శక్తి చాలనియెడలం దదర్ధంబైనను
పారాయణ చేసిన గోదానపు ఫలము గల్గు నిది నిశ్చయము సుమా !
గంగాస్నానఫలము తృతీయాంశంగానము వలనను తప్పక కల్గును

ఆఱవభాగము చదివినను సోమయాగి పుణ్యఫలము గల్గు వానికిఁ
నేకాధ్యాయము నిత్యము భక్తిఁ బఠించు వాడు రుద్రలోక మందునఁ
బ్రవేశించి భూతగణంబులతో వసియించును జిరకాలం బచ్చట
నధ్యాయచతుర్థాంశము పారాయణము నిత్యము జరుపు మానవుడుఁ
మన్వంతరకాలం బీ పృథ్విని మనుష్య జన్మము దాల్చుచునుండును
బదియు నేడైదు నాల్గు శ్లోకములు ప్రతిదినము మూడు రెండొకటేనియు
సగమైనను భక్తిఁ జదువనుండును జంద్రలోకమునఁ బదివేల యేండ్లు
గీతాపారాయణము సేయుచును గీతిశేషుఁడై పోయినయెడలన్
మరల జన్మ మెత్తునప్పు డాతఁడు మానుష యోనిని మాత్రమే పొందును
గీతాభ్యాసము మరలఁ జేసి ముక్తిని నుత్తమ మగు పదమును బొందుఁను
గీతోచ్చారణ సల్పుచు మృత్యువు వాతఁబడిన వాఁడు గాంచు సద్గతి.
వైకుంఠమునఁ బ్రవేశముం గాంచి వైకుంఠునితో సరిసమాన మగు
నానందమ్ము మహాపాపియు గీతార్థశ్రవణాసక్తుడు బొందును
జీవన్ముక్తుండై పరమ పదము సేరుకొనును దేహాంతంబందున
జనకాదులు రాజర్షులు గీతాశ్రయముననే పాపపంక మంతయుఁ
బ్రక్షాళితంబుగాన్ విదేహులై పరమపదము గాంచి రంతమందుఁన
నీ మాహాత్మ్యము బఠింపగావలయుఁ దప్పనిసరిగా
నట్లుచేయ కున్నఁ బఠన మంతయు వ్యర్థం బని యెఱుగంగ వలయు సుమ
ఏతన్మాహాత్మ్యయుక్తముగ నీ గీతాధ్యానం బొనరించిన ద
త్ఫలమ్ముఁబొందుట కాక, కడుదుర్లభం బగు సద్గతిఁ గాంచును నాతఁడు
ఈ గీతామాహాత్మ్యంబు నే రచించినది సనాతనము, గీతాంత
మునఁ బఠియించినఁ జెప్పినట్టిఫలము నిస్సంశయముగా లభించు నని
వరాహపురాణమునందు సూతునివచనము లివి గీతామాహాత్మ్యము

ం ం ం

గంగారాజేశ్వరుఁ డీగీతాగానము సమహాత్మ్యము తెనుగించెను;

**పాడిన వారికి విన్న వారికిని భగవత్ప్రాప్తి గలుగు నిశ్చయ మిది.**

ఇతి శమ్